ON TV TELUGU

SPECIAL EDITION

www.specialeditiondaily.com

# స్పెషల్ ఎడిషన్

తెలుగు దినపత్రిక

PRGI NO. TGTEL/26/A0668

రంగారెడ్డి   సంపుటి: 01,   సంచిక : 137,   సంపాదకులు : యస్.బి.ఎన్ చారి   శనివారం, జూన్ 20, 2026,   పేజీలు : 8,   వెల : రూ.6/-

# డ్రగ్స్‌పై యుద్ధం

**ఎల్‌బీ స్టేడియంలో వేలాది మంది విద్యార్థులతో మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ**






హైదరాబాద్, జూన్ 19 (స్పెషల్ ఎడిషన్):

సమాజాన్ని నిశ్శబ్దంగా కబళిస్తున్న మాదక ద్రవ్యాల మహమ్మారిపై తెలంగాణ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పోరాటం కొనసాగిస్తోంది. యువత భవిష్యత్తును చీకటిలోకి నెట్టే డ్రగ్స్ అనే సామాజిక దురాచారాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యాచరణలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో భారీ స్థాయిలో మాదక ద్రవ్యాల నిరోధక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి, సమాజాన్ని కూడా మాదక ద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు,

**గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆధ్వర్యంలో యువతకు చైతన్య సందేశం**

**సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో కార్యక్రమం**

**డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం విద్యార్థులే మార్పుకు మార్గదర్శకులని పిలుపు**

**మాదక ద్రవ్యాల ముఠాలపై ఉక్కుపాదం మోపనున్నట్లు ప్రభుత్వ సంకేతం**

ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, విద్యాసంస్థల ప్రతినిధులు, వేలాది మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎల్‌బీ స్టేడియం మొత్తం యువతతో నిండిపోగా, డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలు కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాదు, మొత్తం కుటుంబ వ్యవస్థను, సమాజాన్ని, దేశ భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకర వ్యసనమని హెచ్చరించారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను చేరుకోవాలంటే మాదక ద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, అలాగే తమ స్నేహితులను, తోటి విద్యార్థులను కూడా ఈ ముప్పు నుంచి కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతిజ్ఞలో భాగంగా విద్యార్థులు "మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వాములమవుతాం. డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తాం. మాదక ద్రవ్యాల బారిన ఎవరూ పడకుండా అవగాహన కల్పిస్తాం. డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనలో ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాం" అంటూ ఘనంగా ప్రమాణం చేశారు. వేలాది మంది విద్యార్థులు ఏకకంఠంతో చేసిన

మిగతా 2వ పేజీలో...



## నమ్మకానికి భారత్ చిరునామా

**పారిస్‌లో ప్రవాస భారతీయుల సభలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు**

**భారత్-ఫ్రాన్స్ బంధం స్థిరత్వానికి బలమైన స్తంభమన్న ప్రధాని**

**వచ్చే ఏడాది 'తృష్ణా' ఉపగ్రహాన్ని సంయుక్తంగా ప్రయోగించనున్నట్లు వెల్లడి**

**ఏఐ అంటే భారత్‌కు 'ఆల్ ఇన్‌క్లూజివ్' కూడా అని స్పష్టీకరణ**

**భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని వేగవంతం చేయాలని మోదీ-ట్రంప్ నిర్ణయం**

**ఫ్రెంచ్ ప్రముఖ కంపెనీల సీఈఓలతో పెట్టుబడులు, భాగస్వామ్యాలపై చర్చలు**

పారిస్, జూన్ 19 (స్పెషల్ ఎడిషన్):

ప్రపంచ దేశాలకు భారత్ అత్యంత నమ్మకమైన భాగస్వామిగా ఎదుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు వృద్ధి, ఆవిష్కరణలు, అవకాశాలను అందించే రంగాల్లోనే భారత్

మిగతా 2వ పేజీలో...

## టుడే స్పెషల్

ప్రజల బడి మీ పిల్లలకు పనికిరాదా?
ప్రజల ఓట్లతో గెలిచి
ప్రజల పన్నులతో పాలిస్తూ,
ప్రభుత్వ బడులు గొప్పవని చెప్పే నాయకులారా,
మీ పిల్లలు మాత్రం అక్కడ ఎందుకు కనిపించరు?
వేదికలపై విద్యా సంస్కరణల మాటలు,
సభల్లో ప్రభుత్వ విద్యపై ప్రశంసలు,
కానీ మీ పిల్లల అడుగులు మాత్రం
కార్పొరేట్ బడుల గుమ్మాలకే ఎందుకు?
ప్రజలకు ఒక నీతి,
మీ కుటుంబాలకు మరో నీతి ఎందుకు?
పేదల పిల్లలకు ప్రభుత్వ బడి,
పెద్దల పిల్లలకు ప్రైవేట్ బడి ఎందుకు?
ప్రభుత్వ బడులు నిజంగా మంచివైతే
ముందుగా మీ పిల్లలను చేర్పించండి;
అవి మంచివి కాకపోతే
ప్రజల పిల్లలను ఎందుకు పంపిస్తున్నారు?
ప్రతి ఎన్నికల ముందు
విద్యపై పెద్ద పెద్ద హామీలు,
ఎన్నికలు ముగిసిన వెంటనే
ఆ హామీలన్నీ గాలిలో కలిసిపోవడం ఎందుకు?
బడులు బాగున్నాయని చెప్పే నాయకులారా,
మీ పిల్లల భవిష్యత్తుకు పనికిరాని బడి
పేదల పిల్లల భవిష్యత్తుకు ఎలా పనికొస్తుంది?
ప్రజల డబ్బుతో జీతాలు,
ప్రజల డబ్బుతో సౌకర్యాలు,
ప్రజల డబ్బుతో భద్రత,
కానీ ప్రజల బడిపై మాత్రం నమ్మకం లేదా?
మీ పిల్లలు చదవని బడిని
ప్రజలు ఎందుకు నమ్మాలి?
మీరు ఎక్కని పడవలో
ప్రజలను ఎందుకు ఎక్కిస్తున్నారు?
నిజంగా ప్రభుత్వ విద్యపై విశ్వాసం ఉంటే
మీ ఇంటి నుంచే మార్పు ప్రారంభించండి;
మీ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించి
ప్రజల ముందు ఆదర్శంగా నిలవండి.
లేకపోతే ప్రభుత్వ విద్య గొప్పదని చెప్పే
మీ ప్రసంగాలన్నీ ఖాళీ నినాదాలే!
మీ ప్రకటనలన్నీ ప్రచారాలే!
మీ మాటలన్నీ ప్రజలను మభ్యపెట్టడమే!
మాటలకు కాదు చేతలకు విలువ,
హామీలకు కాదు ఆచరణకు గౌరవం;
ప్రజల బడిలో మీ పిల్లలు చేరిన రోజే
మీ నిజాయితీకి సాక్ష్యం లభిస్తుంది.
ప్రభుత్వ బడిని నమ్మని నాయకుడు
ప్రజల నమ్మకానికి అర్హుడు కాదు;
ప్రజల బడిలో తన పిల్లలను చదివించే నాయకుడే
ప్రజల హృదయాల్లో నిజమైన నాయకుడు!

**-యస్.బి.ఎన్. చారి, సంపాదకులు**

# బుల్లెట్ బూస్ట్

**రూ.87 కోట్ల సీఆర్ఎఫ్ రోడ్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు**

**తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు ప్రతిపాదించిన కేంద్రం**

**హైదరాబాద్-పూణే, బెంగళూరు, చెన్నై మార్గాల్లో హైస్పీడ్ రైళ్లు**

**గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రహదారి అనుసంధానంపై దృష్టి**

**తెలంగాణ అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారనున్న భారీ ప్రాజెక్టులు**

రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 19 (స్పెషల్ ఎడిషన్)

తెలంగాణలో మౌలిక సదుపాయాల విస్తరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని, రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి రహదారులు, హైస్పీడ్ రైలు మార్గాలు కీలకంగా మారనున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ



మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో సుమారు రూ.87 కోట్ల విలువైన సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఎఫ్) రోడ్ల అభివృద్ధి పనులకు ఆయన రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తిమ్మాపూర్ కేంద్రంగా

మిగతా 2వ పేజీలో...

# మూసీకి మోక్షం

**బాపూ ఘాట్ వద్ద ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు అనుమతులు**

**కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం కృతజ్ఞతలు**

**మూసీ పునరుజ్జీవనంలో కీలక మైలురాయిగా అభివర్ణన**

**పర్యావరణ, సాంస్కృతిక అభివృద్ధికి కొత్త ఊతం**


**ప్రజలకు ఆహ్లాదకరమైన ప్రజా స్థలాల ఏర్పాటు**

**తెలంగాణ అభివృద్ధికి కేంద్ర సహకారం అభినందనీయం**

హైదరాబాద్, జూన్ 19 (స్పెషల్ ఎడిషన్):

మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా హైదరాబాద్ నగరంలోని బాపూ ఘాట్ వద్ద తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టు పనులకు కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేయడం రాష్ట్ర అభివృద్ధి చరిత్రలో మరో కీలక ఘట్టంగా నిలిచింది. ఈ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ శాఖ,

మిగతా 2వ పేజీలో...






# లోన్ లెక్కలపై లెంపకాయ

**రూ.200 కోట్ల ప్రాజెక్టుకు రూ.500 కోట్లకు పైగా రుణమా? అంటూ ఎస్‌బీఐపై హైకోర్టు ప్రశ్నలు**

**ప్రభుత్వ భూములను తాకట్టు పెట్టి రుణాలు ఎలా మంజూరు చేశారంటూ ఆగ్రహం**

**బాధ్యులపై చర్యలు తీసుకున్నారా లేదా స్పష్టం చేయాలని ఆదేశం**

**అవసరమైతే సీబీఐ విచారణకు ఆదేశిస్తామని హెచ్చరిక**

**ప్రజల సొమ్మును నిర్లక్ష్యంగా రుణాలుగా విడుదల చేయొద్దని సూచన**

**పరిశ్రమల పేరుతో భూములు తీసుకుని లక్ష్యాలు నిర్వీర్యం చేస్తున్నారన్న కోర్టు**

**కేసు విచారణను ఈ నెల 25కు వాయిదా**

హైదరాబాద్, జూన్ 19 (స్పెషల్ ఎడిషన్):

ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకునే ప్రక్రియలో ఉన్న భూములను తాకట్టు పెట్టుకుని వందల కోట్ల రూపాయల రుణాలు ఎలా మంజూరు చేశారంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)పై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

మిగతా 2వ పేజీలో...




# తెలంగాణలో జనసేన

**హైదరాబాద్ మణికొండలో నూతన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన పవన్ కళ్యాణ్**

**ప్రత్యేక పూజల మధ్య ప్రారంభోత్సవ కార్యక్రమాలు**

**తెలంగాణలో పార్టీ విస్తరణకు కార్యాచరణ వేగవంతం**

**గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలపై జనసేన దృష్టి**

హైదరాబాద్, జూన్ 19 (స్పెషల్ ఎడిషన్):

ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ ఇప్పుడు తెలంగాణ రాజకీయాలపై దృష్టి సారిస్తోంది. ఏపీలో ఎన్నికల విజయంతో ఉత్సాహంగా ఉన్న జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి Pawan Kalyan తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలనే లక్ష్యంతో కీలక అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నగరంలోని మణికొండలో నూతనంగా నిర్మించిన

మిగతా 2వ పేజీలో...

# ఓటర్ల మహా ప్రక్షాళన

**జూన్ 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి సర్వే ప్రారంభం**



**25 ఏళ్ల తర్వాత ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్‌కు శ్రీకారం**

**3.39 కోట్ల ఓటర్ల వివరాల సమగ్ర పరిశీలన**

**నకిలీ, మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపుపై దృష్టి**


**35 వేల మంది బీఎల్‌ఓలు, 26 వేల మంది ఏజెంట్లు రంగంలోకి**

**సన్నద్ధతపై అధికారులతో సీఈఓ సుదర్శన్ రెడ్డి సమీక్ష**

స్పెషల్ కరస్పాండెంట్, జూన్ 19 స్పెషల్ ఎడిషన్:

తెలంగాణలో ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, తప్పుల్లేకుండా రూపొందించేందుకు భారత ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026' కార్యక్రమానికి రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం సన్నద్ధమైంది. దాదాపు 25 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో ఈ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా ప్రక్షాళన కార్యక్రమం జూన్ 25 నుంచి ప్రారంభం కానుంది. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, నకిలీ మరియు అనర్హ ఓటర్ల పేర్లను తొలగించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యంగా అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అమలుపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు), అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి తదితరులతో చర్చించారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను

మిగతా 2వ పేజీలో...



# ట్రంప్‌పై మెలోనీ ఫైర్

**ఫోటో కోసం బతిమాలిందన్న ట్రంప్ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం**

**వ్యాఖ్యలు పూర్తిగా కల్పితమంటూ వీడియో విడుదల చేసిన ఇటలీ ప్రధాని**

**తాము ఎప్పుడూ యాచించే పరిస్థితిలో లేమని స్పష్టం**

**ట్రంప్ తీరు మిత్రదేశాల మధ్య విభేదాలకు దారితీస్తోందన్న ఆందోళన**

**అమెరికా పర్యటనను రద్దు చేసుకున్న ఇటలీ విదేశాంగ మంత్రి**

స్పెషల్ కరస్పాండెంట్, జూన్ 19 (స్పెషల్ ఎడిషన్):

జీ7 శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. 2లో

స్పెషల్ ఎడిషన్
తెలుగు దినపత్రిక



# డ్రగ్స్‌పై యుద్ధం

మొదటి పేజీ తరువాయి...

ప్రతిజ్ఞ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ వ్యాపారులపై రాజీ లేని పోరాటం కొనసాగిస్తోందన్నారు. యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ ముఠాలు సమాజంలో వేళ్లు పాతేందుకు ప్రయత్నిస్తున్నాయని, అలాంటి శక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు కొనసాగుతాయని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. డ్రగ్స్ సమస్యను కేవలం పోలీసుల బాధ్యతగా కాకుండా సామాజిక ఉద్యమంగా చూడాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా, ప్రజా ప్రతినిధులు కలిసి పనిచేస్తేనే ఈ మహమ్మారిని సమూలంగా నిర్మూలించవచ్చని అన్నారు. యువతలో అవగాహన పెంపొందించడం ద్వారా భవిష్యత్తు తరాలను రక్షించగలమని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు కూడా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడేందుకు తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తామని ప్రకటించారు. విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, డ్రగ్స్ ప్రమాదాలపై సహచర విద్యార్థులకు వివరించడం, అనుమానాస్పద కార్యకలాపాలపై అధికారులకు సమాచారం అందించడం వంటి చర్యల్లో భాగస్వాములమవుతామని చెప్పారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా యువతను లక్ష్యంగా చేసుకుని విస్తరిస్తున్న మాదక ద్రవ్యాల ముప్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం విశేష ప్రాధాన్యత సంతరించుకుంది.

విద్యార్థుల భాగస్వామ్యంతో డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఈ కార్యక్రమం బలమైన నాంది పలికింది. డ్రగ్స్ రహిత తెలంగాణ సాధన లక్ష్యంగా ప్రభుత్వం, ప్రజలు, యువత కలిసి ముందుకు సాగాలని ఈ వేదిక నుంచి పిలుపునిచ్చారు. సమాజ భవిష్యత్తును కాపాడే దిశగా ఎల్బీ స్టేడియంలో జరిగిన ఈ మహా ప్రతిజ్ఞ కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది.

# నమ్మకానికి భారత్ చిరునామా

మొదటి పేజీ తరువాయి...

పెట్టుబడులు పెడుతోందని ఆయన స్పష్టం చేశారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని సాల్ ప్లేయెల్ ఇండోర్ వేదికలో నిర్వహించిన ప్రవాస భారతీయుల సభలో పాల్గొన్న మోదీకి అక్కడి భారతీయులు ఘన స్వాగతం పలికారు. "బోంజూర్ మోదీ", "భారత్ మాతా కీ జై" నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రధాని, ఒకప్పుడు దేశాల మధ్య సంబంధాలు ప్రధానంగా వ్యాపార ప్రయోజనాల చుట్టూ తిరిగేవని, కానీ నేటి ప్రపంచంలో పరస్పర నమ్మకం కూడా అంతే కీలకమైందని అన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న వేళ భారత్-ఫ్రాన్స్ సంబంధాలు స్థిరత్వానికి, సహకారానికి ప్రతీకగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. గత 12 ఏళ్లుగా దేశానికి ప్రధానమంత్రిగా సేవ చేసే అవకాశం తన జీవితంలో గొప్ప భాగ్యమని చెప్పారు. భారత్, ఫ్రాన్స్ దేశాలు కలిసి వచ్చే ఏడాది 'తృష్ణా' అనే ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నట్లు మోదీ వెల్లడించారు. ఈ ఉపగ్రహం ప్రపంచవ్యాప్తంగా నీటి వనరుల పరిస్థితులను అంచనా వేయడంలో, నీటి ఎద్దడిని గుర్తించడంలో, ఆహార భద్రతకు సంబంధించిన అంశాలను పర్యవేక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. వాతావరణ మార్పులు, నీటి సంక్షోభం వంటి ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం పారిస్‌లో జరిగిన యూరప్‌లోనే అతిపెద్ద టెక్నాలజీ, ఇన్నోవేషన్ వేదిక అయిన 'వివాటెక్-2026' సదస్సులో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో కలిసి ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సాంకేతికత కొద్దిమందికే పరిమితమైతే అభివృద్ధి అసంపూర్ణమవుతుందని, ప్రజలందరికీ అందుబాటులోకి వచ్చినప్పుడే అది నిజమైన ప్రగతికి దారి తీస్తుందని పేర్కొన్నారు. భారత్‌కు ఏఐ అంటే కేవలం 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' మాత్రమే కాకుండా 'ఆల్ ఇన్‌క్లూజివ్' కూడా అని వ్యాఖ్యానించారు. గత దశాబ్దంలో సాంకేతిక రంగంలో భారత్ సాధించిన ప్రగతి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని మోదీ చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ గుర్తింపు వ్యవస్థ, అత్యంత విస్తృతమైన డిజిటల్ చెల్లింపుల వేదికలను భారత్ నిర్మించిందని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ డిజిటల్ లావాదేవీల్లో సగానికి పైగా భారత్‌లోనే జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ ఏడాది వివాటెక్ సదస్సులో భారత్‌కు అతిపెద్ద జాతీయ పెవిలియన్ ఏర్పాటు కావడం దేశ సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనమని అన్నారు. ఇదిలా ఉండగా, జీ7 సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన భేటీలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోదీ కీలక చర్చలు జరిపారు. ఇరు దేశాలకు సమాన ప్రయోజనాలు కలిగేలా, పరస్పర వాణిజ్యాన్ని బలోపేతం చేసేలా ట్రేడ్ అగ్రిమెంట్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఇద్దరు నేతలు అధికారులకు సూచించారు. ఇప్పటికే పలుమార్లు జరిగిన చర్చల్లో గణనీయ పురోగతి సాధించామని, మధ్యంతర ఒప్పందం దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ చర్చలను మరింత వేగవంతం చేసేందుకు అమెరికా వాణిజ్య ప్రతినిధి జామీసన్ గ్రీర్ వచ్చే వారం భారత్‌ను సందర్శించనున్నట్లు సమాచారం. ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ప్రముఖ ఫ్రెంచ్ కంపెనీల సీఈఓలతో కూడా సమావేశమయ్యారు. షిప్పింగ్, లాజిస్టిక్స్, రైల్వేలు, నిర్మాణ రంగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కీలక రంగాల్లో పెట్టుబడులు, వ్యాపార విస్తరణ అవకాశాలు, కొత్త భాగస్వామ్యాలపై విస్తృతంగా చర్చించారు. భారత్‌లో పెట్టుబడులకు అనుకూల వాతావరణం, వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్ అవకాశాలను వారికి వివరించారు. ఈ సమావేశాలు భారత్--ఫ్రాన్స్ ఆర్థిక, వ్యాపార సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగులుగా భావిస్తున్నారు.

# మూసీకి మోక్షం

మొదటి పేజీ తరువాయి...

భారత సైన్యం అనుమతులు ఇవ్వడం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు, భారత సైన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు అనుమతి లభించడం తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన అభివృద్ధి విజన్ అమలులో ఒక ముఖ్యమైన మైలురాయి అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మూసీ నది సమగ్ర పునరుజ్జీవనానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఈ నిర్ణయం మరింత బలాన్ని చేకూరుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. నగర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల పెంపు లక్ష్యాలతో చేపడుతున్న కార్యక్రమాల్లో గాంధీ సరోవర్ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుందని వివరించారు.

ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత మూసీ నది పరివాహక ప్రాంతం పర్యావరణపరంగా పునరుజ్జీవం పొందడంతో పాటు నగరవాసులకు విశ్రాంతి, వినోదం, సాంస్కృతిక కార్యక్రమాల కోసం అత్యాధునిక ప్రజా వేదికలు అందుబాటులోకి రానున్నాయి. సుందరమైన పార్కులు, నడక మార్గాలు, పర్యాటక ఆకర్షణలు, సాంస్కృతిక కేంద్రాల ఏర్పాటుతో ఈ ప్రాంతం నగరానికి ప్రత్యేక ఆకర్షణగా మారనుందని అధికారులు భావిస్తున్నారు. మూసీ నది తీర ప్రాంతాలను ఆధునికీకరించి ప్రజలకు మరింత అనువైన వాతావరణాన్ని కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పానికి గాంధీ సరోవర్ ప్రాజెక్టు ప్రతీకగా నిలుస్తుందని సీఎం పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు వారసత్వ సంపదను కాపాడుతూ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, భారత సైన్యం అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని ముఖ్యమంత్రి అన్నారు. కేంద్ర-రాష్ట్ర సమన్వయంతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్ర ప్రగతికి మరింత దోహదపడతాయని పేర్కొంటూ, ఈ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

# బుల్లెట్ బూస్ట్

మొదటి పేజీ తరువాయి...

పలు గ్రామాలకు రహదారి అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.100 కోట్ల వ్యయంతో రహదారి నిర్మాణ పనులను మంజూరు చేసిందని తెలిపారు. కొంగర, రావిరాల, శ్రీశైలం రోడ్డు, లాచునూరు, అవరమియగూడెం, జబార్‌గూడ, ఎలిమినేడు, కప్పాడు, తుర్కగూడెం, చర్లపటేల్‌గూడెం, ఇబ్రహీంపట్నం రోడ్డు, గుమ్మడవెల్లి, మీర్‌ఖాన్‌పేట, కుర్మిద్ద తదితర ప్రాంతాలకు మెరుగైన రహదారి సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. మాదాపూర్, బేగంపేట్ ప్రాంతాలతో కూడా కనెక్టివిటీ పెంచేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడితే గ్రామాల అభివృద్ధి వేగవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న రంగారెడ్డి జిల్లా ప్రాంతాలు వేగంగా పట్టణీకరణ చెందుతున్నాయని, ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు.

**తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు**

దేశవ్యాప్తంగా ప్రతిపాదించిన బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుల్లో భాగంగా తెలంగాణకు మూడు హైస్పీడ్ రైలు కారిడార్లు ప్రతిపాదించినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. హైదరాబాద్-పూణే, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై మార్గాల్లో బుల్లెట్ ట్రైన్లను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. ఈ ప్రాజెక్టుల ప్రాథమిక అంచనా వ్యయం సుమారు రూ.5 లక్షల కోట్లుగా ఉండగా, భూసేకరణ వ్యయాలతో కలిపి అది రూ.10 లక్షల కోట్ల వరకు చేరే అవకాశముందని తెలిపారు. ప్రస్తుతం హైస్పీడ్ ఎలివేటెడ్ రైలు కారిడార్లకు సంబంధించిన సర్వేలు కొనసాగుతున్నాయని, సర్వేలు, డీపీఆర్ పూర్తైన వెంటనే టెండర్ల ప్రక్రియ చేపట్టి పనులు వేగవంతం చేయనున్నట్లు చెప్పారు. ఈ మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు తెలంగాణ అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా నిలుస్తాయని, రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక రంగాలకు కొత్త ఊపు తీసుకురానున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్టూ మరో రింగ్ రోడ్డు నిర్మాణంపై కూడా కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ముఖ్యంగా ఉత్తర హైదరాబాద్ ప్రాంతంలో భూసేకరణ పనులు కొనసాగుతున్నాయని, ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.20 వేల కోట్ల నుంచి రూ.25 వేల కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశముందని తెలిపారు. రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, ఈ అభివృద్ధికి రహదారి అనుసంధానం అత్యంత కీలకమని అన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవతో ఈ ప్రాంతానికి కేంద్ర నిధుల ద్వారా రూ.100 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరయ్యాయని తెలిపారు. గతంలో కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా కొన్ని పనులు ఆలస్యమైన విషయం వాస్తవమేనని అంగీకరించిన ఆయన, ఇకపై అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొంగర, రావిరాల, తిమ్మాపూర్, లాచునూరు, అవరమియగూడెం తదితర ప్రాంతాల్లో జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను ప్రత్యేకంగా సమీక్షించి, రాబోయే కొద్ది నెలల్లో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రంగారెడ్డి జిల్లా, ముఖ్యంగా కందుకూరు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో జనసేన

మొదటి పేజీ తరువాయి...

జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. కార్యాలయ ప్రారంభోత్సవానికి ముందు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యాలయాన్ని ప్రారంభించిన పవన్ కళ్యాణ్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. తెలంగాణలో పార్టీ విస్తరణ, భవిష్యత్ కార్యాచరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, యువతను ఆకర్షించే విధానాలపై ఆయన చర్చించినట్లు సమాచారం. తెలంగాణలో జనసేన ఉనికిని మరింత బలపర్చేందుకు క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మండల, జిల్లా స్థాయిల్లో కమిటీల ఏర్పాటు, క్రియాశీల కార్యకర్తల ఎంపిక, ప్రజా సమస్యలపై పోరాటాలకు కార్యాచరణ సిద్ధం చేయాలని నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక త్వరలో జరగనున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ పార్టీని విస్తరించేందుకు పవన్ కళ్యాణ్ స్వయంగా పర్యటించనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ జనసేన శ్రేణులకు ఆయన ఎలాంటి దిశానిర్దేశం చేయనున్నారు? రాష్ట్ర రాజకీయాల్లో పార్టీ పాత్రను ఎలా విస్తరించనున్నారు? అన్న అంశాలపై ఆసక్తి నెలకొంది. తెలంగాణలో పార్టీకి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం, యువతను ఆకర్షించడం, ప్రజా సమస్యలపై ఉద్యమాల ద్వారా బలమైన రాజకీయ ప్రత్యామ్నాయంగా ఎదగడం జనసేన లక్ష్యంగా కనిపిస్తోంది. మణికొండలో పార్టీ కార్యాలయ ప్రారంభం ఆ దిశగా కీలక అడుగుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# లోన్ లెక్కలపై లెంపకాయ

మొదటి పేజీ తరువాయి...

కేవలం రూ.200 కోట్ల విలువైన ప్రాజెక్టు కోసం రూ.500 కోట్లకు పైగా రుణం ఎలా ఇచ్చారో వివరించాలని ప్రశ్నించింది. రుణాల మంజూరులో బాధ్యతారాహిత్యం లేదా అక్రమాలు జరిగి ఉంటే సంబంధిత బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకున్నారా లేదా స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించింది. ఒకవేళ చర్యలు తీసుకోకపోతే కోర్టే సుమోటోగా వ్యవహరించి సీబీఐ దర్యాప్తునకు ఆదేశించే అవకాశముందని హెచ్చరించింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల గ్రామంలోని ఫ్యాబ్‌సిటీ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పరిధిలో సెమ్ ఇండియా ఫ్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన సుమారు 100 ఎకరాల భూమిని ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకునేందుకు జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ బెంగళూరు ఎస్‌బీఐ శాఖ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టి బ్యాంకు తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ దశలో ఎస్‌బీఐకి ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయబోమని స్పష్టం చేస్తూ సంబంధిత ప్రభుత్వ అధికారులు, టీజీఐఐసీ అధికారులు, కంపెనీ ప్రతినిధులకు నోటీసులు జారీ చేశారు. విచారణ సందర్భంగా ఎస్‌బీఐ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, సెమ్ ఇండియా ఫ్యాబ్ సంస్థకు కేటాయించిన భూములను తాకట్టు పెట్టుకుని తీసుకున్న రుణాలు చెల్లించకపోవడంతో బ్యాంకు ఇప్పటికే రికవరీ ప్రక్రియ ప్రారంభించిందని తెలిపారు. 2012లోనే స్వాధీన నోటీసులు జారీ చేశామని, అదే సమయంలో ప్రభుత్వం భూములను తిరిగి స్వాధీనం చేసుకునే చర్యలు చేపట్టిందని కోర్టుకు వివరించారు. అయితే ఈ వాదనలపై స్పందించిన న్యాయమూర్తి, భూముల యాజమాన్యంపై వివాదాలు ఉండగా మరియు ప్రభుత్వ స్వాధీనం ప్రక్రియ కొనసాగుతుండగా రుణాలు ఎలా మంజూరు చేశారో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. రూ.200 కోట్ల ప్రాజెక్టుకు రూ.500 కోట్ల రుణం ఎలా మంజూరు చేశారనే ప్రశ్నకు బ్యాంకు తరఫు న్యాయవాది అసలు రుణం తక్కువేనని, వడ్డీలు మరియు ఇతర బకాయిలతో మొత్తం పెరిగిందని వివరణ ఇచ్చారు. అయితే బ్యాంకు లెక్కల ప్రకారమే బకాయి మొత్తం రూ.624 కోట్లకు చేరిందని కోర్టు గుర్తుచేసింది. అంతేకాకుండా గతంలో కోర్టు స్టే ఉత్తర్వులు ఉన్న భూములను కూడా తాకట్టు పెట్టుకుని రుణాలు ఎలా పొందారో స్పష్టత ఇవ్వాలని కోరింది. రుణాల మంజూరుకు బాధ్యులైన అధికారులపై కేసులు నమోదు చేశారా? ఎలాంటి అంతర్గత విచారణ నిర్వహించారా? సీబీఐ లేదా ఇతర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేశారా? అనే అంశాలపై పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. ప్రజలు నమ్మకంతో బ్యాంకుల్లో జమ చేసిన సొమ్మును సరైన పరిశీలన లేకుండా భారీ రుణాల రూపంలో విడుదల చేయడం ఆందోళనకరమని వ్యాఖ్యానించింది. పరిశ్రమలు స్థాపిస్తామని ప్రభుత్వ భూములు పొందడం, అనంతరం అదే భూములను తాకట్టు పెట్టి భారీ రుణాలు తీసుకోవడం, ఆ తర్వాత ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం వల్ల ప్రభుత్వ లక్ష్యాలు దెబ్బతింటున్నాయని కోర్టు అభిప్రాయపడింది. కొందరు రుణగ్రహీతలు విదేశాలకు వెళ్లిపోతుండగా నష్టపోతున్నది మాత్రం బ్యాంకులను నమ్మిన సామాన్య ప్రజలేనని పేర్కొంది. ఉపాధి కల్పన పేరుతో భూములు తీసుకుని పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా కొన్ని సంస్థలు కనుమరుగవుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వ భూకేటాయింపు విధానాల ఉద్దేశాలను కొన్ని కంపెనీలతో పాటు ఆర్థిక సంస్థలు కూడా నిర్వీర్యం చేస్తున్నాయని హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. రుణాల మంజూరులో బ్యాంకు అధికారులు అసాధారణ ఉదారత ప్రదర్శించారని పేర్కొంది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ కేసు విచారణను ఈ నెల 25కు వాయిదా వేసింది.

# ట్రంప్‌పై మెలోనీ ఫైర్

మొదటి పేజీ తరువాయి...

ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ తనతో ఒక ఫోటో దిగేందుకు ఎంతో ఆత్రుతగా ఎదురుచూశారని, చివరకు ఆమె పరిస్థితి చూసి జాలి వేసి ఫోటోకు అంగీకరించానని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై మెలోనీ శుక్రవారం ఘాటుగా స్పందిస్తూ ట్రంప్ ఆరోపణలను పూర్తిగా ఖండించారు. తన అధికారిక వీడియో సందేశంలో మాట్లాడిన మెలోనీ, ట్రంప్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని స్పష్టం చేశారు. తాను గానీ, తన దేశం గానీ ఎప్పుడూ ఎవరి వద్దా ప్రాధేయపడే పరిస్థితిలో లేవని పేర్కొన్నారు. ఒక మిత్రదేశాధినేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యానికి గురి చేసిందని, ట్రంప్ ఎందుకు తరచూ తన మిత్రదేశాల నాయకులను లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేస్తున్నారో అర్థం కావడం లేదని ఆమె అన్నారు. మెలోనీ స్పందనతో ఇటలీ రాజకీయ వర్గాలు కూడా ట్రంప్ వ్యాఖ్యలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ వ్యవహారం కేవలం వ్యక్తిగత స్థాయిలోనే కాకుండా రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మిత్రదేశాల మధ్య పరస్పర గౌరవం అవసరమని, అలాంటి విలువలను దెబ్బతీసే వ్యాఖ్యలు అనవసర ఉద్రిక్తతలకు దారితీస్తాయని వారు పేర్కొంటున్నారు. ఇటలీ విదేశాంగ మంత్రి ఆంటోనియో తజానీ కూడా ట్రంప్ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. ఈ వ్యాఖ్యలు కేవలం మెలోనీని మాత్రమే కాకుండా మొత్తం ఇటలీ దేశాన్ని అవమానించేలా ఉన్నాయని ఆయన అన్నారు. ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో జూన్ 21, 22 తేదీల్లో జరగనున్న సమావేశాల కోసం అమెరికా పర్యటనను రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ ఘటనతో అమెరికా-ఇటలీ సంబంధాలపై చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. జీ7 సదస్సు వేదికగా ప్రారంభమైన ఈ వివాదం అంతర్జాతీయ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీయగా, మిత్రదేశాల మధ్య పరస్పర గౌరవం, దౌత్య మర్యాదల ప్రాధాన్యత మరోసారి వెలుగులోకి వచ్చింది.

# లంచం.. అరెస్ట్

## సర్వే నివేదిక జారీకి రూ.35 వేల లంచం డిమాండ్

**తొలి విడతగా రూ.20 వేలు తీసుకున్న అధికారి - మిగతా రూ.15 వేలు స్వీకరిస్తుండగా ఏసీబీ వల**

**నల్గొండ కలెక్టరేట్ వద్ద రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత - కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరు**

నల్గొండ, జూన్ 19 (స్పెషల్ ఎడిషన్):

ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి పాల్పడే అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఉక్కుపాదం మోపుతోంది. తాజాగా నల్గొండ ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జి. పవన్‌కుమార్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కాడు. ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారుడి తల్లి, అత్తకు చెందిన భూముల సర్వే రికార్డులు మరియు సంబంధిత నివేదిక జారీ చేయాల్సి ఉండగా, ఆ పనిని పూర్తి చేయడానికి డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ పవన్‌కుమార్ రూ.35 వేల లంచం డిమాండ్ చేశాడు. అధికారికంగా చేయాల్సిన పనికి అక్రమంగా డబ్బులు కోరడంతో బాధితుడు తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. డిమాండ్ చేసిన మొత్తంలో తొలి విడతగా రూ.20 వేల నగదును ఇప్పటికే అధికారి స్వీకరించినట్లు సమాచారం. అనంతరం మిగిలిన రూ.15 వేలు కూడా ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ఉచ్చుపన్నారు. శుక్రవారం నల్గొండ కలెక్టరేట్ సమీపంలో ఫిర్యాదుదారుడు మిగతా రూ.15 వేల లంచం మొత్తాన్ని పవన్‌కుమార్‌కు అందజేస్తుండగా, ముందుగానే మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి అతడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం లంచం నగదును స్వాధీనం చేసుకుని అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించారు. ఈ ఘటనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ అనంతరం



అతడిని నాంపల్లి ప్రత్యేక కోర్టులో హాజరుపరిచినట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ సేవల్లో పారదర్శకతకు విఘాతం కలిగించే అవినీతి చర్యలను ఏసీబీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని అధికారులు హెచ్చరించారు.

# ఓటర్ల మహా ప్రక్షాళన

మొదటి పేజీ తరువాయి...

కచ్చితంగా అమలు చేస్తూ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి ధృవీకరించనున్నారు. ఓటర్ల పేరు, చిరునామా, అర్హత తదితర వివరాలను పరిశీలించి, మరణించిన వారి పేర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన పేర్లు, చిరునామా మారిన వారి వివరాలను జాబితా నుంచి తొలగించనున్నారు. అదే సమయంలో కొత్తగా అర్హత పొందిన వారికి ఓటరు జాబితాలో చోటు కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఈ మహత్తర కార్యక్రమం కోసం రాష్ట్రవ్యాప్తంగా 35 వేల మందికి పైగా బీఎల్‌ఓలు, సుమారు 26 వేల మంది బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో పనిచేయనున్నారు. బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్ల మధ్య సమన్వయంతో ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని సీఈఓ సూచించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కూడా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న సుమారు 3.39 కోట్ల మంది ఓటర్ల వివరాలను ఈ ప్రత్యేక సర్వేలో సమగ్రంగా పరిశీలించనున్నారు. 2026 అక్టోబర్ 1వ తేదీని అర్హత తేదీగా పరిగణించి తుది ఓటరు జాబితాను రూపొందించనున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవడంతో పాటు అవసరమైన సవరణలు చేసుకోవాలని ఎన్నికల అధికారులు విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితాను మరింత విశ్వసనీయంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు చేపడుతున్న ఈ ప్రత్యేక ప్రక్షాళన కార్యక్రమం తెలంగాణ ఎన్నికల చరిత్రలో కీలక ఘట్టంగా నిలవనుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# 200 జిల్లాల్లో నీటి కటకట



న్యూఢిల్లీ : మొన్నటికి మొన్న దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించాయని.. అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయని.. ఎల్ నీనో ప్రభావం అంతగా ఉండదని మీడియాలో వార్తలు వచ్చాయి.. కానీ ఈ మురిపం రెండు మూడు రోజులకే పరిమితమైంది. ఎందుకంటే రుతుపవనాల విస్తరణకు అనుకూలమైన వాతావరణం లేకపోవడంతో దేశవ్యాప్తంగా కొన్ని ప్రాంతాలు మినహా మిగతా అన్నిచోట్ల ఎండలు దంచి కొడుతున్నాయి. వర్షపాతం ఏకంగా 36% లోటుకు చేరుకుంది. జూన్ నెలలో వర్షపాతం 36% లోటు పెద్ద ఇబ్బంది కాకపోయినప్పటికీ.. రుతుపవనాల విస్తరణకు ఏమాత్రం అనుకూల వాతావరణ లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.జూన్ 16 నాటికి దేశవ్యాప్తంగా వర్షపాతం లోటు ఏకంగా 35 శాతానికి చేరుకుంది. మహారాష్ట్ర.. కొంకణ్ తీరంలో ఇంతవరకు నైరుతీ రుతుపవనాలు విస్తరించలేదు. ఈ ప్రాంతంలో అనుకూలమైన వాతావరణం ఏర్పడి వర్షాలు కురిస్తేనే గోదావరి నదికి వరద వస్తుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు ఆ వరదే జీవనాధారం. పొడి వాతావరణం వల్ల కొన్ని రోజులుగా ఉత్తర దిశగా రుతుపవనాల విస్తరణ పూర్తిగా ఆగిపోయింది.. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం ఈ ఏడాది ఈ సమయానికి వాయువ్య భారతదేశం మాత్రమే సాధారణ వర్షపాతం కంటే ఒక ఐదు శాతం ఎక్కువగా పొందింది. తూర్పు, ఈశాన్యం, మధ్య భారతదేశం, దక్షిణ దీపకల్పంలో లోటు వర్షపాతం కొనసాగుతోంది.ఈశాన్య భారతదేశంలో 43%.. మధ్య భారత దేశంలో 63%.. దక్షిణ ద్వీపకల్పంలో 14 శాతం లోటు వర్షపాతం కొనసాగుతోంది. 2000 నుంచి ఎల్ నీనో సంవత్సరాలను ఒకసారి పరిశీలిస్తే.. జూన్ వర్షపాత వ్యత్యాసాల విశ్లేషణలో 2015 జూన్ నెల నిలిచింది. ఆ సంవత్సరం జూన్ నెలలో సాధారణ కంటే ఎక్కువ వర్షపాతం 14% అధికంగా నమోదయింది. 2002 జూన్.. 2024 జూన్ నెలలో వర్షపాతం సాధారణ స్థాయిగా నమోదయింది.. అనంతరం జూలై నుంచి మిగతా నెలలో వర్షపాతం తక్కువగా నమోదయింది.2009లో జూన్ నెలలో సాధారణం కంటే 47% తక్కువగా వర్షపాతం నమోదయింది. 2014లో సాధారణం కంటే 44 శాతం తక్కువగా వర్షపాతం నమోదయింది. 2023లో సాధారణం కంటే ఎనిమిది శాతం తక్కువ వర్షపాతం నమోదయింది. మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్రం కాలానుగుణంగా వేడిగా మారడం వల్ల అది భారత దేశంలో రుతు పవనాల గమనాన్ని పూర్తిగా మార్చేస్తోంది. ఎల్ నీనో సాధారణంగా రుతుపవనాల ప్రారంభం.. రుతుపవనాల ముగింపు పై తీవ్రమైన ప్రభావం చూపిస్తోందని.. అందువల్లే ఈ స్థాయిలో వర్షపాతం తక్కువగా నమోదు అవుతుందని అధికారులు చెబుతున్నారు.ఈ ఏడాది కాస్త ఆలస్యంగా జూన్ 4న కేరళలో రుతుపవనాలు ప్రవేశించాయి. అయితే అప్పటికే పశ్చిమ తీరం వెంబడి రుతుపవనాల పురోగతి వేగాన్ని కోల్పోయింది. వాతావరణంలో మార్పుల ఆధారంగా రుతుపవనాలు విడతలవారీగా కదులుతూ ఉంటాయి. ముంబై శివారు ప్రాంతానికి చేరుకున్న మొదటి విడత రుతుపవనాలు స్థిరంగా నిలబడలేకపోయాయి. దీనికి బదులుగా ముంబై నగరానికి ఉత్తరాన ప్రతికూల వాతావరణం వల్ల రుతుపవనాలు స్తంభించి పోయాయి.. ఒకవేళ వర్షాలు కురవాలి అంటే కచ్చితంగా బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడాలి.. అప్పుడుగాని ఎల్ నీనో ప్రభావం తగ్గుతుంది.ఇప్పటి అంచనాల ప్రకారం దేశంలో దాదాపు 20 జిల్లాలు డేంజర్ జోన్ లో ఉన్నాయి. ఇక్కడ ఎప్పటికప్పుడు సమీక్షలు జరపాలని.. తక్కువ నీటి అవకాశం ఉన్న పంటలు మాత్రమే రైతులు వేసేలా అవగాహన కల్పించాలని కేంద్రం సూచించింది.. ఒకవేళ కరువు వల్ల పంటలు పండకపోతే రిటైల్ ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే చైనా ఎరువుల తయారీకి సంబంధించిన ముడి పదార్థాలపై ఆంక్షలు విధించింది. దీంతో దేశీయంగా యూరియా ఉత్పత్తి వ్యయం కూడా పెరిగే ప్రమాదం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# వైద్యుల విజయం.. రోగికి జీవితం

## సకాలంలో కీమోథెరపీ, నిపుణుల వైద్యంతో ప్రాణాలు కాపాడిన యశోదా వైద్యబృందం

మిర్యాలగూడ, జూన్ 19 (స్పెషల్ ఎడిషన్):

ప్రాణాంతక రక్త క్యాన్సర్ వ్యాధి అయిన ఆక్యూట్ మైలోయిడ్ లుకీమియా (ఏఎంఎల్)తో తీవ్ర అస్వస్థతకు గురైన మిర్యాలగూడకు చెందిన 34 ఏళ్ల యువకుడికి సకాలంలో అత్యాధునిక వైద్యం అందించి కొత్త జీవితం ప్రసాదించిన ఘటన వైద్య రంగంలో ఆశాజనక ఉదాహరణగా నిలిచింది. హైదరాబాద్ మలక్‌పేట్‌లోని యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిపుణులైన ఆంకాలజీ వైద్యబృందం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగికి సమర్థవంతమైన చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి బయటపడేసింది. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం, మిర్యాలగూడకు చెందిన యువకుడు గత రెండు నెలలుగా పదేపదే జ్వరం, దగ్గు, తీవ్ర బలహీనతతో బాధపడుతున్నాడు. ఆరోగ్య పరిస్థితి రోజురోజుకూ క్షీణించడంతో పాటు తీవ్రమైన విరేచనాలు, ఆహారం తీసుకోలేని స్థితి, శారీరక నీరసం వంటి లక్షణాలు కనిపించాయి. అనంతరం ఫెబ్రైల్ న్యూట్రోపీనియా అనే అత్యంత ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. రక్తంలో శరీరాన్ని రక్షించే తెల్ల రక్తకణాలు తీవ్రంగా తగ్గిపోవడంతో ఇన్ఫెక్షన్ల ప్రమాదం పెరిగి, పరిస్థితి ఆందోళనకరంగా మారింది. కుటుంబ సభ్యులు అతడిని అత్యవసరంగా యశోదా ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు సమగ్ర పరీక్షలు నిర్వహించారు. రక్తపరీక్షలు, ఎముక మజ్జ పరీక్షలు, ఇతర నిర్ధారణ పరీక్షల అనంతరం రోగికి ఆక్యూట్ మైలోయిడ్ లుకీమియా (ఏఎంఎల్) ఉన్నట్లు నిర్ధారించారు. ఇది వేగంగా వ్యాపించే రక్త క్యాన్సర్ అని, చికిత్స ఆలస్యం అయితే అవయవ వైఫల్యం, తీవ్రమైన ఇన్ఫెక్షన్లు, రక్తస్రావం వంటి సమస్యలు తలెత్తి ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని వైద్యులు కుటుంబ సభ్యులకు వివరించారు. డాక్టర్ రోహిత్ రెడ్డి నేతృత్వంలోని ఆంకాలజీ బృందం వెంటనే చికిత్స ప్రారంభించింది. మొదట రోగిని ద్రవాలు, రక్త మార్పిడి, శక్తివంతమైన యాంటీబయోటిక్స్ ద్వారా స్థిరపరిచారు. అనంతరం క్యాన్సర్ కణాలను నిర్మూలించేందుకు ఇండక్షన్ కీమోథెరపీ నిర్వహించారు. డౌనోరుబిసిన్, సైటారాబిన్ మందులతో కూడిన '3+7' రెజిమెన్ ద్వారా చికిత్స అందించారు. చికిత్స సమయంలో ఫెబ్రైల్ న్యూట్రోపీనియా, థ్రాంబోసైటోపీనియా వంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పటికీ వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రత్యేక సంరక్షణ అందించారు.




ఇండక్షన్ కీమోథెరపీ అనంతరం ఎంఆర్డీ పాజిటివ్ ఫలితాలు వచ్చినప్పటికీ వైద్యబృందం వెనుకడుగు వేయకుండా హైడాక్ కన్సాలిడేషన్ కీమోథెరపీ రెండు సైకిళ్లు నిర్వహించింది. రక్త మార్పిడి, ఐవీ యాంటీబయోటిక్స్, యాంటీఫంగల్ మందులు, హైడ్రేషన్, వాంతులు, విరేచనాల నియంత్రణకు అవసరమైన ప్రత్యేక చికిత్సలు అందించింది. 24 గంటల వైద్య పర్యవేక్షణలో రోగిని ఉంచి ఇన్ఫెక్షన్లను అదుపులోకి తెచ్చింది. ఈ సందర్భంగా కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ, "ఇది అత్యంత క్లిష్టమైన లుకీమియా కేసు. ఫెబ్రైల్ న్యూట్రోపీనియా, ఎంఆర్డీ పాజిటివిటీ వంటి సమస్యలు ఉన్నప్పటికీ సకాలంలో చేపట్టిన ఇండక్షన్ కీమోథెరపీ, అనంతరం నిర్వహించిన హైడాక్ కన్సాలిడేషన్ చికిత్సలతో రోగికి రిమిషన్ సాధించగలిగాం. నిరంతర పర్యవేక్షణ, సపోర్టివ్ కేర్ ఈ విజయానికి ప్రధాన కారణాలు" అని తెలిపారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, కీమోథెరపీ సైకిళ్లకు మంచి స్పందన లభించిందని వైద్యులు వెల్లడించారు. ఇన్ఫెక్షన్లు పూర్తిగా అదుపులోకి వచ్చాయని, రిమిషన్ సాధించడంతో రోగిని స్థిరమైన ఆరోగ్య పరిస్థితిలో డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. క్రమం తప్పకుండా రక్తపరీక్షలు, ఫాలోఅప్ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు. యశోదా ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాసరెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ, అత్యాధునిక ఆంకాలజీ సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు, ఆధునిక నిర్ధారణ పరికరాలు, 24 గంటల క్రిటికల్ కేర్ సేవలు యశోదా ఆసుపత్రుల ప్రత్యేకత అని తెలిపారు. ఏఎంఎల్ వంటి అత్యంత క్లిష్టమైన రక్త క్యాన్సర్ కేసులను కూడా సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యం తమ సంస్థకు ఉందని పేర్కొన్నారు. సకాలంలో వ్యాధిని గుర్తించి సరైన చికిత్స అందిస్తే ప్రాణాంతక వ్యాధులను కూడా జయించవచ్చని ఈ కేసు మరోసారి నిరూపించిందని వారు తెలిపారు.

# ఫారెస్ట్ శాఖ వర్సెస్ రెవెన్యూ శాఖ

నిజామాబాద్ : బోథ్ నియోజకవర్గ పరిధిలో అటవీ శాఖ, రెవెన్యూ శాఖల మధ్యన ఉన్న అటవీ భూముల లెక్క ఇప్పటికీ తేలక పోవడంతో కొంతమంది మొరం మాఫియా కీడుగాలకు అందినంత దోచుకునే అవకాశం లభించింది. దీంతో నేరడిగొండ బోత్ ఇచ్చోడ బజార్హత్నూర్ మండలాల్లో విచ్చలవిడిగా మొరం వ్యాపారం కొనసాగుతున్నది. రాత్రిపూట మొరం మాఫియా మూట కాపలాదారులను పెట్టి విచ్చలవిడిగా మొరం తవ్వుకు పోతున్నారు.నేరడిగొండ మండలంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిని అనుకుని ఉన్న కుమారి చుట్టుపక్కల ఉన్న ఎర్ర మొరం గుట్టలు మొరం మాఫియా బంగారు బాతులా మారాయి. 44వ నెంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న ఎర్ర మొరం క్వారీని ఆనుకొని అటవీశాఖ భూమి ఉండడం ఆ భూమిలో ఏ కొంచెం తవ్విన అటవీ శాఖ వారు పట్టుకొని జరిమానాలు విధిస్తుండటంతో అక్రమ మొరం వ్యాపారులు రెవెన్యూ భూములపై దృష్టి సారించి విచ్చలవిడిగా తరలించకపోతున్నారు.లోకల్ నేరడిగొండ మండలంలోని వడూర్ ,రాజుల తాండ, బుద్ధికొండ, బోథ్ మండలంలోని పిప్పలదరి ,కొత్త కరత్వాడ ,బోత్, ధనూర్ , రఘునాథపూర్, సోనాల మండలంలోని సాకేర, కోట కె సోనాల టివి టి గ్రామాల పరిసరాలలో ఉన్న గుట్టలలో నుండి ప్రతిరోజు వందల సంఖ్యలో తిప్పల ద్వారా మొరం తరలించకు పోతున్నారు . బోథ్ సోనాల మండలాల్లో అక్రమ మొరం తవ్వకాలు ప్రభుత్వ కార్యాలయాల ముందు నుండి పట్టపగలే మొరం ట్రాక్టర్లో తరలిస్తున్నారు. అడిగేవాడు లేకపోవడంతో మొరం మాఫియా పట్టపగలు గుట్టలను తవేసి మొరం అమ్మకాలు కొనసాగిస్తున్నారు. కొంతకాలం పాటు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల కంటూ అధికారుల వద్ద నుండి అనుమతులు పొంది బయట వ్యక్తులకు విచ్చలవిడిగా విక్రయించు కున్నారు.. సహజ వనరులు అయినా మొరం గుట్టలను పట్టపగలు రాత్రిపూట తవ్వకాలు కొనసాగిస్తూ విచ్చల విడిగా ఇసుక మొరం అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ప్రైవేటు భవనాలకు సమీపంలోని వాగుల నుండి నల్ల ఇసుకను పునాదులకు అవసరమైన పునాది రాళ్లను తరలిస్తున్నారు.

పోచ్చర సమీపంలో నిర్మిస్తున్న ఓ ప్రైవేటు భవనానికి గ్రామం సమీపంలోని వాగులో నుండి నల్ల ఇసుక పునాది రాళ్లను తరలించిపోయారు. అక్రమ దందా కొనసాగుతున్న అటవీ శాఖ రెవెన్యూ శాఖల అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయివాస్తవానికి మైనింగ్ అధికారుల నిబంధనల ప్రకారం మూడు ఫీట్ల కన్నా ఎక్కువ లోతుగా తగిలితే అవసరమైన అనుమతులు పొందాల్సి ఉంటుంది కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే కొత్త కర త్వాడ మిషన్ భగీరథ ట్యాంక్ కుడివైపున ఉన్న రెవెన్యూ గుట్టను 15 నుండి 20 ఫీట్ల వరకు తవ్వి మొరం తరలించారు. ఇంత బహిరంగంగా జరుగుతున్న ఈ వ్యాపారంపై అధికారులు చూడనట్లు వ్యవహరిస్తుండటంతో విమర్శలు వస్తున్నాయి.రెవెన్యూ రికార్డుల్లో ఉన్న బట్టలు తమవి కావలి అటవీశాఖ వారు పేర్కొంటుండగా రెవెన్యూ శాఖ వారు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ శాఖ గుట్టలుగా పేర్కొంటున్న వాటి పైన ఉన్న చెట్లు అటవీ శాఖ వారివి అయితే గుట్టలేము రెవెన్యూ శాఖ వారిగుట్టపై చెట్లను కొడితే అటవీ శాఖ వారు కేసులు చేస్తుంటే మొరం తీసుకువెళ్తే తమకు సంబంధం లేదంటూ అటవీ శాఖ వారు చేతులెత్తేస్తున్నారు రెండు శాఖల సమన్వయ లోపం వల్ల కోట్లాది రూపాయల మొరం తరలిపోయింది.

# సెక్స్ కోసం.., భర్తను చంపి...చివరకు

కాకినాడ : మంగళసూత్రం సాక్షిగా ఏడడుగులు నడిచిన ఆ ఇల్లాలు క్షణిక సుఖాల వ్యామోహంలో పడి పవిత్ర బంధాన్ని ఊపిరాడకుండా చేసి తెంచేసింది. గుండెజబ్బుతో బాధపడుతున్నాడన్న జాలి కూడా లేకుండా, కట్టుకున్న భర్తను అత్యంత దారుణంగా కడతేర్చింది. ఆపై గుండెపోటు మరణంగా కలరింగ్ ఇచ్చి కథ ముగిసిందనుకుంది. కానీ, దేవుడి స్క్రిప్ట్ మరోలా ఉంది. తనను వదిలేసి కొత్త ప్రియుడిని వెతుక్కుందన్న కోపంతో పాత ప్రియుడే ఎంట్రీ ఇచ్చి, లీక్ చేసిన ఒకే ఒక్క మెసేజ్‌తో ఈ మైండ్ బ్లోయింగ్ క్రైమ్ స్టోరీ వెలుగులోకి వచ్చింది. కాకినాడ జిల్లా సర్పవరంలో జరిగిన ఈ ఘోరం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.సర్పవరం సీఐ బి.ప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ రూరల్ మండలం సర్పవరానికి చెందిన పుల్ల దుర్గాప్రసాద్ ఆటో నడుపుతూ భార్య రమాదేవి, ఇద్దరు కుమార్తెలతో కలిసి జీవిస్తున్నాడు. అయితే రెండేళ్ల క్రితం దుర్గాప్రసాద్‌కు గుండెపోటు రావడంతో వైద్యులు స్టంట్లు వేశారు. అప్పటినుంచి ఆయన శారీరకంగా బలహీనపడి ఇంటికే పరిమితమయ్యాడు. భర్త అనారోగ్యంతో అచేతనంగా మారుతుండటంతో రమాదేవిలో శారీరక కోరికలు మితిమీరాయి. ఈ క్రమంలోనే ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బాపట్లకు చెందిన ప్రసాదం గోపిసాయితో పరిచయం ఏర్పడి, అది కాస్తా వివాహేతర సంబంధానికి దారితీసింది. ప్రియుడితో కలిసి విజయవాడ, రామచంద్రపురం అంటూ ఆమె షికార్లు కొట్టడం మొదలుపెట్టింది.భార్య ప్రవర్తనపై అనుమానం వచ్చిన దుర్గాప్రసాద్ ఆమెను నిలదీశాడు. పద్ధతి మార్చుకోవాలని మందలించడమే ఆయన చేసిన పాపమైంది. తమ సుఖానికి అడ్డుగా ఉన్న భర్తను వదిలించుకోవాలని రమాదేవి, గోపిసాయి పక్కా ప్లాన్ వేశారు. ప్లాన్ ప్రకారం.. గోపిసాయి బాపట్ల నుంచి 15 నిద్రమాత్రలు తెచ్చి రమాదేవికి ఇచ్చాడు. మార్చి 13న ఉదయం భర్తకు ఎంతో ఇష్టమైన ఖర్జూర జ్యూస్‌లో ఆ మాత్రలన్నింటినీ కలిపి తాగించింది. కొద్దిసేపటికే దుర్గాప్రసాద్ అపస్మారక స్థితిలోకి వెళ్లగా.. రమాదేవి ఏమాత్రం దయలేకుండా దిండుతో ఆయన ముఖంపై గట్టిగా అదిమి పట్టుకుని ఊపిరాడకుండా చేసి చంపేసింది. ఆపై భర్తకు గుండెపోటు వచ్చిందని నమ్మించి, ఎవరికీ అనుమానం రాకుండా అంత్యక్రియలు కూడా పూర్తి చేసేసింది.

ప్లాన్ ప్రకారం అంతా పూర్తి చేసి .. కొత్త ప్రియుడ్ని చూసుకున్న రమాదేవి

కథ సుఖాంతం అయిందని రమాదేవి ఊపిరి పీల్చుకుంది. కానీ అసలు ట్విస్ట్ ఇక్కడే మొదలైంది. భర్త చనిపోయి మూడు నెలలు కూడా గడవక ముందే రమాదేవి పాత ప్రియుడు గోపిసాయిని పక్కనబెట్టి, మరొక కొత్త ప్రియుడిని వెతుక్కుంది. ఈ డబుల్ క్రాస్ ను గోపిసాయి తట్టుకోలేకపోయాడు. కసి పెంచుకున్న అతను నేరుగా రమాదేవి కుమార్తె కు.. మీ అమ్మ జ్యూస్‌లో నిద్రమాత్రలు కలిపి ఇచ్చి, ఊపిరాడ కుండా చేసి మీ నాన్నను చంపేసింది అంటూ మెసేజ్ పంపాడు. ఆ మెసేజ్ చూసి షాకైన కుమార్తెలు బంధువుల సహాయంతో పోలీసులను ఆశ్రయించడంతో గుట్టు చప్పుడు కాకుండా సాగిన ఈ హత్యోదంతం బయటపడింది. పోలీసులు తమదైన శైలిలో విచారణ జరపడంతో నిందితురాలు రమాదేవి తన పాపాన్ని ఒప్పుకోక తప్పలేదు. పరారీలో ఉన్న ప్రియుడు గోపిసాయిని కూడా పోలీసులు అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి నెట్టారు. క్షణిక సుఖం కోసం భర్తను చంపిన మహిళ, చివరకు కొత్త ప్రియుడి వ్యామోహం లో పాత ప్రియుడికి ద్రోహం చేయడం.. ఆ కక్షతోనే హత్య రహస్యం బట్టబయలు కావడం చూసి పోలీసులు సైతం ముక్కున వేలేసుకున్నారు. ప్రస్తుతం ఈ సైకో కిల్లర్ భార్య ఉదంతం కాకినాడ జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

# ట్రాఫిక్ కష్టాలకు చెక్

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ కీలకమైన ప్రణాళికలను సిద్ధం చేసింది. నగరంలో వ్యక్తిగత వాహనాల సంఖ్య 80 లక్షలు దాటడంతో, ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ ద్వారా కూకట్‌పల్లి వై జంక్షన్ నుంచి గండిమైసమ్మ, ఎల్బీనగర్ నుంచి నాగోల్ వంటి ముఖ్యమైన ప్రాంతాలలో రహదారులను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు.ఈ ప్రణాళికలో భాగంగా రహదారుల విస్తరణతో పాటు ఆక్రమణల తొలగింపు, డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయడం , విద్యుత్, గ్యాస్ పైపులైన్ల కోసం భూగర్భంలో ప్రత్యేక మార్గాలు చేపట్టనున్నారు. దీనివల్ల రోడ్లను పదేపదే తవ్వాల్సిన అవసరం ఉండదు. అలాగే పాదచారులకు, దివ్యాంగులకు అనుకూలమైన ఫుట్‌పాత్‌లు, ర్యాంపులు, ఆధునిక బస్ షెల్టర్ల నిర్మాణం , సిగ్నల్ రహిత ప్రయాణం కోసం ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లను కూడా నిర్మించనున్నారు. ఈ పనులు పూర్తి చేయడం ద్వారా నగరంలో ట్రాఫిక్ వేగం ప్రస్తుతమున్న గంటకు 15 కిలోమీటర్ల నుండి 30-40 కిలోమీటర్లకు పెరగడమే కాకుండా, ప్రమాదాలు తగ్గడం , భూముల విలువలు పెరగడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని అంచనా. అయితే, భూసేకరణ , పనుల సమయంలో ఎదురయ్యే ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించేందుకు సరైన ప్రణాళిక అవసరమని పేర్కొన్నారు

గ్రేటర్ చుట్టూ లింక్ రోడ్లు

మహానగరం హైదరాబాద్‌తో పాటు శరవేగంగా విస్తరిస్తున్న శివారు ప్రాంతాల రూపురేఖలను మార్చేలా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఒక సరికొత్త రవాణా వ్యూహాన్ని సిద్ధం చేసింది. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు, ఐటీ కారిడార్‌ను ఇతర శివారు మండలాలతో సులభంగా అనుసంధానించేలా మరో 50 కొత్త లింక్ రోడ్ల నిర్మాణానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను అధికారులు ఖరారు చేశారు. ప్రధాన జాతీయ రహదారులు, రేడియల్ రోడ్లను కలుపుతూ సాగే ఈ మిస్సింగ్ లింక్ రోడ్ల ప్రాజెక్టు.. గ్రేటర్ పరిధిలోని ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించడమే కాకుండా, నగర విస్తరణకు కొత్త ద్వారాలు తెరవబోతోందిహెచ్ఎండీఏ సిద్ధం చేసిన ఈ తాజా రోడ్ మ్యాప్‌లో తూర్పు మరియు ఉత్తర హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు అత్యధిక ప్రాధాన్యత లభించింది. ముఖ్యంగా ఉప్పల్-వరంగల్ హైవేను ఆనుకుని ఉన్న పీర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధితో పాటు నాగారం, దమ్మాయిగూడ, కీసర రూట్లలో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేలా ఈ లింక్ రోడ్లను డిజైన్ చేశారు. మరోవైపు, శరవేగంగా పారిశ్రామికంగా, నివాస ప్రాంతాలుగా ఎదుగుతున్న మేడ్చల్, గుండ్లపోచంపల్లి కారిడార్ల నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వైపు తక్కువ సమయంలో చేరుకునేలా అవుటర్ రింగ్ రోడ్ కి సమాంతరంగా, అనుసంధానంగా కొత్త రోడ్డు మార్గాలు ఈ ప్లాన్ ద్వారా అందుబాటులోకి రానున్నాయి.ఈ మెగా కనెక్టివిటీ ప్రకటన వెలువడటమే ఆలస్యం.. ఆయా కారిడార్లలోని రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ఒక్కసారిగా కదలిక మొదలైంది. కొత్త లింక్ రోడ్లు ప్రయాణించబోయే గ్రామాలు, లేఅవుట్లలో భూముల ధరలకు డిమాండ్ భారీగా పెరిగింది. మౌలిక వసతుల కల్పన వేగవంతం కానుండటంతో.. ఓపెన్ ప్లాట్లు, నివాస స్థలాల ధరలు చదరపు గజానికి కనీసం రూ.3,000 నుండి రూ.5,000 వరకు తక్షణమే పెరిగే అవకాశం ఉందని రియల్ ఎస్టేట్ మార్కెట్ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. నిన్నమొన్నటి వరకు రవాణా సౌకర్యం సరిగా లేక వెనుకబడిన శివారు భూములు సైతం.. ఇప్పుడు ఈ లింక్ రోడ్ల మాస్టర్ ప్లాన్ ఎఫెక్ట్‌తో హాట్ కేకుల్లా మారుతున్నాయి.ఈ రోడ్ల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, నిధుల సమీకరణ ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. రోడ్డు కనెక్టివిటీ స్పష్టంగా ఉండటంతో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ల్యాండ్ డెవలపర్లు, బిల్డర్లు పీర్జాదిగూడ, మేడ్చల్, శంషాబాద్ పరిసర బెల్ట్‌లలో వందలాది ఎకరాలలో కొత్త డీటీసీపీ, హెచ్ఎండీఏ అప్రూవ్డ్ లేఅవుట్లు, గేటెడ్ కమ్యూనిటీలను ప్లాన్ చేస్తున్నారు. నగరానికి దూరంగా ఉన్నా సరే, సులభంగా ఐటీ కారిడార్‌కు చేరుకునే వెసులుబాటు లభించనుండటంతో మధ్యతరగతి కొనుగోలుదారులకు, దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు ఈ శివారు ప్రాంతాలు ఇప్పుడు అత్యంత సురక్షితమైన మరియు లాభదాయకమైన గమ్యస్థానాలుగా మారుతున్నాయి.



### స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -2026 కార్యక్రమంలో

# ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలి

## పారదర్శకంగా, కచ్చితత్వంతో ఓటర్ల జాబితాను రూపొందించాలి

## ఇంటింటి సర్వేలో ప్రజలకు అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -2026 కార్యక్రమం జూన్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైందని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పారదర్శకంగా, తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డితో కలిసి రేణిగుంట మండలం,వెదుళ్లచెరువు గ్రామంలో ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తారని తెలిపారు. ఓటర్లు ఫారాలను పూర్తిగా నింపి బీఎల్ఓలకు నేరుగా గానీ, బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏలు) ద్వారా గానీ అందజేయవచ్చని, ఇంటర్నెట్‌పై అవగాహన ఉన్నవారు స్వయంగా ఆన్‌లైన్‌లో కూడా సమర్పించవచ్చని తెలిపారు. ఈ మూడు విధానాల్లో ఏదో ఒక రూపంలో సమర్పించిన వారి పేర్లు నమూనా ఓటర్ల జాబితాలో చేర్చబడతాయన్నారు. ప్రభుత్వం సూచించిన 12 రకాల గుర్తింపు పత్రాలలో ఏదైనా ఒకటి సమర్పిస్తే వాటిని పరిశీలించి అర్హులైన వారి పేర్లను తుది ఓటర్ల జాబితాలో చేర్చడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా పేర్లు లేకపోవడం లేదా ఇతర అభ్యంతరాలు ఉన్నట్లయితే సంబంధిత వారికి నోటీసులు జారీ చేసి పూర్తి వివరాలు సేకరించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. చివరిసారిగా 2002లో రాష్ట్రంలో ప్రత్యేక విస్తృత పరిశీలన నిర్వహించబడిందని, అప్పటి ఓటర్ల వివరాలను ప్రస్తుత ఓటర్ల వివరాలతో అనుసంధానం చేయడం జరుగుతోందని తెలిపారు. అప్పటి పోలింగ్ కేంద్రం లేదా ఎపిక్ నంబర్ వివరాలు అందుబాటులో ఉంటే వాటి ఆధారంగా ప్రస్తుత ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయిన వారు, ద్వంద్వ ఓటు నమోదులు కలిగిన వారు వంటి అనర్హుల పేర్లను తొలగించి ఓటర్ల జాబితాను రూపొందిస్తామని తెలిపారు.

అలాగే 18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్లను గుర్తించి నమోదు చేయడంతో పాటు, వివాహం లేదా ఇతర కారణాల వల్ల నివాసం మారిన వారికి ఓటును కొత్త ప్రాంతానికి బదిలీ చేసే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు.ప్రతి వ్యక్తికి ఒకే చోట ఓటు ఉండాలని, ఉద్దేశపూర్వకంగా రెండు చోట్ల ఓటు నమోదు చేసుకోవడం చట్టరీత్యా నేరమని, అలాంటి సందర్భాల్లో క్రిమినల్ కేసులు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

# సంపాదకీయం

## డేంజర్ లో 200 జిల్లాలు

12 రాష్ట్రాలపై ఎల్‌నినో పంజా.. ఇదైతే పక్కా. దాదాపు 60 శాతం దేశాన్ని కబళించబోతోంది ఎల్‌నినో రక్కసి. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన హైఅలర్ట్ ఇది. ఖరీఫ్ సీజన్‌ను మొదట్లోనే తుంచి పడేసేలా, వీలైతే రబీని కూడా డ్యామేజ్ చేసేలా, ఇప్పటికే కరవు ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. విషాదం ఏంటంటే, ఎల్‌నినో పీడిత 12 రాష్ట్రాల్లో మన తెలుగు రాష్ట్రాలు కూడా ఉన్నాయి. సాగునీటి కోసం రైతాంగం, తాగునీటి కోసం సామాన్య జనాభా అలమటిస్తోంది. ఎల్‌నినో ఎఫెక్ట్ దేశాన్ని ఎటు తీసుకెళ్తుందిఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయం దెబ్బతింటుందన్న భయాందోళనలు నెలకొన్నా మరోవైపు కేంద్రం వద్ద ప్రస్తుతం భారీగా ఆహారధాన్యాల నిల్వలు ఉండడంతో ఆహారభద్రతపై ఎలాంటి ఎల్‌నినో ప్రభావం ఉండబోదని కేంద్ర ప్రభుత్వం భరోసా ఇస్తోంది. అయితే ఈ నిల్వలను వృథా కాకుండా సరిగ్గా పంపిణీ, విక్రయాలు సాగించగలిగితేనే ధరలు అదుపులో ఉంటాయి. దీనికి ఓపెన్ మార్కెట్ సేల్ స్కీమ్ అనే పథకాన్ని అమలు చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఏర్పడే వర్షాభావంతో దేశంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 200కు పైగా జిల్లాల్లో వ్యవసాయానికి ముప్పు వచ్చే పరిస్థితులు కమ్ముకొస్తున్నాయి. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉన్న 12 రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కూడా ఉన్నాయి. వర్షాలు సకాలంలో పడకపోవడంతో వరి వంటి నీటి అవసరాలపై ఎక్కువగా ఆధారపడే పంటల ఉత్పత్తికి ముప్పు ఏర్పడుతుంది. అయితే ప్రస్తుతం కేంద్రం వద్ద జూన్ 1 నాటికి రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాల నిల్వలు 122 మిలియన్ టన్నుల వరకు ఉండడం విశేషం. ఏడాది పొడుగునా వరి వినియోగానికి ఇవి సరిపోతాయి. మొత్తం నిల్వల్లో 68.43 మిలియన్ టన్నుల వరి, 53.41 మిలియన్ టన్నుల వరకు గోధుమలు ఉన్నాయి. ఈ భారీ నిల్వల్లో సుమారు 80 కోట్ల మందికి పైగా లబ్ధిదారులకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందించాలంటే ఏటా 56 మిలియన్ టన్నులు అవసరం కాగా, ప్రస్తుత నిల్వలు దాదాపు రెండేళ్లపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఉచితంగా సరఫరా చేయడానికి సరిపోతాయి. అందువల్ల దేశానికి ఆహార భద్రతపై భరోసా లభిస్తోంది. ఎల్‌నినో ప్రభావం వల్ల సాధారణ వర్షపాతం నమోదు కాకపోయినా ప్రాథమిక ఆహార లభ్యతకు ఎలాంటి ఢోకా లేదు. ఓపెన్ మార్కెట్ సేల్ స్కీమ్ (ఓఎంఎస్ఎస్) ద్వారా గోధుమ, బియ్యం వంటి ఆహార ధాన్యాలను రాష్ట్ర ప్రభుత్వాలతోసహా భారీ సంఖ్యలో వినియోగదారులకు విక్రయించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ సంక్షేమ పథకాల కోసం ఎఫ్‌సిఐ నుండి నేరుగా ఆహార ధాన్యాలను కొనుగోలు చేయవచ్చు. ఆహార భద్రతను నిర్వహించడం, నిల్వలు వృథా కాకుండా చూడడం, మార్కెట్లో ధరలను అదుపులో ఉంచడం ఈ ఓఎంఎస్ఎస్ పథకం ఉద్దేశం. 2025 26లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 176.04 మిలియన్ టన్నులు కాగా, అంతకన్నా ఎక్కువగా 176.16 మిలియన్ టన్నుల ఉత్పత్తిని 2026 27లో సాధించాలని ప్రభుత్వం లక్షంగా నిర్దేశించుకుంది. ఇందులో 123.15 మిలియన్ టన్నుల వరి, 8.4 మిలియన్ టన్నుల కాయధాన్యాలు, 28.92 మిలియన్ టన్నుల చమురు గింజలు, 13.56 మిలియన్ టన్నుల చిరుధాన్యాలు. 31.04 మిలియన్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి చేయాలని చూస్తున్నారు. అయితే ఆహార ధాన్యల సద్వినియోగానికి ఓఎంఎస్ఎస్ పథకానికి భారీ కేటాయింపులు అవసరమని, ఇథనాల్ (ఇంధనం) ఉత్పత్తి కోసం సబ్సిడీ ధరలో బియ్యం కోటా కేటాయింపును తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. భారత ఆహార సంస్థ దగ్గర ఉన్న బియ్యాన్ని క్వింటాలుకు రూ. 2320 వంతున భారీ సబ్సిడీతో గతంలో ప్రభుత్వం కేటాయించింది. అయితే పెరుగుతున్న ఆహార భద్రత ఆందోళనలు, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో బియ్యం నిల్వలను కాపాడుకోవాలని, ధరల పెరగకుండా అదుపులో ఉంచడానికి ఈ కేటాయింపులు భారీగా తగ్గించాలని మాజీ అగ్రికల్చరల్ సెక్రటరీ సిరాజ్ హుస్సేన్ సూచించారు. అలాగే ప్రస్తుతం ప్రభుత్వం దగ్గర 4.5 మిలియన్ టన్నుల వరకు పప్పుధాన్యాల నిల్వలు ఉన్నాయి. వీటి ధరలను అదుపులో ఉంచడం చాలా అవసరం. ఇదిలా ఉండగా వాతావరణ శాఖ అంచనా ప్రకారం సాధారణ వర్షపాతం 62.1 మిమీ కాగా, జూన్ 15 వరకు 42.4 మిమీ వర్షపాతమే లభించింది. అంటే దేశం మొత్తం మీద 32 శాతం లోటు వర్షపాతం కనిపిస్తోంది. సాధారణంగా దీనిని ఎదుర్కోడానికి కేంద్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా పప్పు ధాన్యాల సాగు చాలా మందకొడిగా ప్రారంభమైంది. గత ఏడాదితో పోలిస్తే ఈ జూన్ 12 నాటికి పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం 43 శాతం తగ్గిపోయింది. కంది, మినుము, పెసర, వంటి పంటల విత్తనాలు విత్తడం భారీగా పడిపోయింది. కర్ణాటక, మహారాష్ట్రలోని పప్పుధాన్యాల ఉత్పత్తి అత్యధికంగా జరిగే కీలక ప్రాంతాల్లో రైతులు వరుణ కటాక్షం కోసం నిరీక్షిస్తున్నారు. జూన్ 12 వరకు కంది విత్తనాలను 0.09 లక్షల ఎకరాల్లో వేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ కంది సాగు విస్తీర్ణం 57 శాతం తక్కువ. మినుములు 0.27 లక్షల ఎకరాల్లో విత్తగా, గత ఏడాది ఇదే సమయానికి 0.35 లక్షల ఎకరాల్లో వేయడమైంది. అంటే 22 శాతం సాగు విస్తీర్ణం తగ్గింది. గత ఏడాది 1.54 లక్షల ఎకరాల్లో పెసర సాగు చేయగా, ఈ ఏడాది ఇప్పటికి 0.69 లక్షల ఎకరాల్లో విత్తారు. అంటే 55 శాతం సాగు విస్తీర్ణం తగ్గింది. కర్ణాటక ఈశాన్య ప్రాంతం, మహారాష్ట్రలో కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. మహారాష్ట్ర లోని లాతూరు, సోలాపూర్, తెలంగాణ రాష్ట్రంలో బఠానీ పండిస్తారు. లాతూరులో కందిసాగు ఇంకా ప్రారంభం కాలేదు. కర్ణాటకలోని కలబుర్గిలో కొన్ని ప్రాంతాల్లో కొన్ని వారాల క్రితం వర్షాలు పడడంతో పెసర సాగు ప్రారంభించారు. అయితే నాటిన విత్తనాలు నిలదొక్కుకోడానికి వర్షాలు అవసరం. పప్పుధాన్యాలు ప్రధానంగా పండించే మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కంది, మినుము, వంటి పంటల సాగు జులై మధ్య వరకు చేపట్టినా, పంట చేతికి వచ్చేసరికి చాలా ఆలస్యమవుతుందని రైతులు చెబుతున్నారు.

## మహిళ వేషంతో గాలం వేసిన పురుష పుంగవుడు

తిరుపతి : పొత్తూరి మోహన కృష్ణమ నాయుడు. వయస్సు 30 ఏళ్ళు. మదనపల్లిలోని శివాజీ నగర్ లో నివాసం. ఇంటర్ దాకా చదివిన మోహన కృష్ణమ నాయుడు ఆడవేషం ధరించి అందాలు ఆరబోయడంలో దిట్ట. చీర కట్టులోనే కాదు మోడరన్ డ్రెస్సుల్లోనూ మగాళ్ళను ఆకర్షిస్తూ స్త్రీ వేషధారణలో తిరుగుతూ మోసాలకు పాల్పడటమే వృత్తి. మధుశ్రీ అలియాస్ హనీగా హనీ ట్రాప్ చేస్తున్న మోహన కృష్ణమ నాయుడు నమ్మించి మోసం చేసిన వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. మహిళగా వేషం మార్చి మోసాలు చేయడమే కాదు నమ్మే వాళ్ళ ఇళ్లను గుల్ల చేయడంలోనూ దిట్టగా మధు శ్రీ అలియాస్ హనీ నేరాలకు పాల్పడుతూ వచ్చింది. గుప్త నిధులు ఉన్నాయని, ప్రేతాత్మలు ఉన్నాయని భయపెట్టి మోసం చేయడంలో మధుశ్రీ అలియాస్ హనీ రాణించింది. శాంతి పూజలు చేయాలంటూ నమ్మించి మోసాలకు పాల్పడటమే కాకుండా పెళ్లిళ్ల పేరిట లేడీ గెటప్ లో పలువురికి వలపు వేసి పెళ్లి చేసుకుని మోసాలకు పాల్పడింది. కొందరు యువకులను ట్రాప్ చేసి జీవితం బాగుండాలంటే తనలాంటి ఆడ మగ కాని వాళ్ళను పెళ్లి చేసుకోవాలని మాయమాటలు చెప్పి అయిన కాడికి దండుకున్న మోహన కృష్ణ నాయుడు మధుశ్రీ గా మారి మోసాలకు పాల్పడింది. యువకులను ఆకర్షించి కొందరి చేత తాళి కూడా కట్టించుకున్న మధు శ్రీ అలియాస్ హనీ మాయ లేడిగా చలామణి అయింది. గత కొంతకాలంగా ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న మాయలేడి బాధితులు ఇప్పుడు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. మదనపల్లి లోనే పదుల సంఖ్యలో బాధితులు ఉండగా పక్క రాష్ట్రం కర్ణాటకలోనూ మధు శ్రీ అలియాస్ హనీగా మారిన మోహన కృష్ణమ నాయుడిని మోహించిన వారి సంఖ్య నివ్వెర పరుస్తుంది. కొందరు బాధితులు పోలీసులను ఆశ్రయించగా ఈ యవ్వారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇక పడుచు పిల్లగా సింగారించు కోవడమే కాకుండా పెళ్లిళ్లు జరిగే చోట్లకు వెళ్లి దిష్టి తీస్తూ పలువురి దగ్గర అందిన కాడికి దోచుకోవడం లోనూ పొత్తూరి మోహన్ కృష్ణమ నాయుడు ఏ హనీ రాణించింది. మధుశ్రీగా హనీ గా పోలీసులు, రాజకీయ నాయకులకు బాగా తెలిసిన మోహన కృష్ణమ నాయుడు వారితోనూ సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. గత కొద్ది రోజులుగా పలు ఫిర్యాదులు వచ్చినప్పటికీ పోలీసుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. తనను మోహించిన వారిని మోసం చేయడమే కాకుండా గుప్తనిధులున్నాయని, తాంత్రిక పూజలు పేరుతోనూ కొందరికి ట్రాప్ చేసిన మధు శ్రీ అలియాస్ హనీ పై ఇప్పటివరకు ఒక్క కేసు నమోదు కాకపోవడం చర్చగా మారింది. కొందరు పోలీసు అధికారుల అండదండలు ఉండడంతోనే మాయలేడి అవతారంలో మాయల మరాఠీగా మోహనకృష్ణమనాయుడు రాణిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు ఈ వ్యవహారంపై పోలీసు యంత్రాంగం స్పందించకపోవడం చర్చణీయాంశంగా మారింది.

## అత్యాచార నిందితుడికి ముందస్తు బెయిల్

హైదరాబాద్ : తనపై బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ నమోదైన కేసులో నిందితుడికి ఊరట లభించింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను సవాల్ చేస్తూ 40 ఏళ్ల మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. దీనిపై విచారించిన జస్టిస్ సందీప్‌మెహతా, జస్టిస్ విజయ్‌బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం పిటిషనర్ వయసు, ఫిర్యాదులో జాప్యం తెలుసుకుని... ఎస్ఎల్‌పీని కొట్టేస్తున్నట్లు ప్రకటించింది. 2023 మే 30న హైదరాబాద్ ఐఎస్‌బీ క్యాంపస్‌లోని స్టూడెంట్ అపార్ట్‌మెంట్‌లో ప్రథమ్‌సింగ్ అనే వ్యక్తి తనపై బలవంతంగా లైంగిక చర్యకు పాల్పడినట్లు పిటిషనర్ 2025 డిసెంబరు 26న గచ్చిబౌలి పోలిస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో అతడిపై బీఎన్ఎస్ సెక్షన్ 351(2), 69 కింద కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడు ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఇద్దరి మధ్య పరస్పర ఆమోదయోగ్యమైన రిలేషన్ ఉన్నప్పటికీ, ఆమె తప్పుడు ఆరోపణలతో రెండున్నరేళ్ల తరువాత ఫిర్యాదు చేసినట్లు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనలు విని, కేసు వివరాలు పరిశీలించిన హైకోర్టు 2026 మే 29న నిందితుడికి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆ మహిళ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆమె తరఫున సీనియర్ లాయర్ మీనాక్షి అరోడా వాదనలు వినిపించారు. లైంగిక దాడి జరిగిన రెండున్నరేళ్ల తర్వాత ఫిర్యాదు చేశారని, కేసు దర్యాప్తు దాదాపు పూర్తయిందన్న కారణంతో హైకోర్టు బెయిల్ ఇచ్చిందని, కానీ అందులో నిజం లేదని కోర్టుకు తెలిపారు. వాదనలు వింటున్న జడ్జి జస్టిస్ సందీప్‌మెహతా జోక్యం చేసుకుని.. పిటిషనర్ ఎందుకు రెండున్నరేళ్ల ఆలస్యంగా ఫిర్యాదు చేశారని ప్రశ్నించారు. అందుకు వెల్లడించిన కారణాలను ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు లాయర్ బదులిచ్చారు. కానీ ఆ అంశంతో జడ్జి జస్టిస్ మెహతా ఏకీభవించలేదు.

ఇంత జాప్యం జరిగితే ఎలా? ఈ పరిస్థితుల్లో క్రిమినల్ జూరిస్‌ప్రుడెన్స్ ప్రకారం ఏం చేయాలని ప్రశ్నించారు. అందుకు పిటిషనర్ తరపు లాయర్ బదులిస్తూ.. అత్యాచారం తరహా ఘటనను నిందితుడు ఇదివరకే అంగీకరించినట్లు తమ వద్ద డిజిటల్ ఆధారాలున్నాయని కోర్టుకు చెప్పారు. జడ్జి మరోసారి స్పందిస్తూ 'పిటిషనర్ వయసెంత' అని ప్రశ్నించగా... నిందితుడికి 38 ఏళ్లు కాగా, పిటిషనర్ వేసిన మహిళకు 40 ఏళ్లు అని న్యాయవాది బదులివ్వగా... జస్టిస్ మెహతా వెంటనే స్పందిస్తూ 'థాంక్యూ.. డిస్మిస్' అని పిటిషన్ కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. అయితే నిందితుడు విదేశాలకు పారిపోకుండా అతని పాస్‌పోర్టును కోర్టులో డిపాజిట్ చేసేలా ఆదేశించాలని కోర్టును కోరారు. దానిపై కింది కోర్టుకు వెళ్లే అవకావం ఇస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

## యూపీలో ఎన్డీయే సరికొత్త వ్యూహాలు




లక్నో : ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో సమాజ్ వాదీ పార్టీ ని లక్ష్యంగా చేసుకుని అధికార ఎన్డీయే కూటమి సరికొత్త వ్యూహాలకు తెరలేపింది. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పార్టీల ఎంపీలు చీలిపోయి ఎన్డీఏకు మద్దతు ప్రకటించడంతో యూపీలోనూ అదే తరహా రాజకీయాలు జరుగుతాయన్న చర్చ ప్రారంభమయింది. యోగి ఆదిత్యనాథ్ క్యాబినెట్‌లో మంత్రి, సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ అధినేత ఓం ప్రకాష్ రాజ్‌భర్ చేసిన సంచలన వ్యాఖ్యలు యూపీ రాజకీయాల్లో పెను తుఫానును సృష్టించాయి. సమాజ్ వాదీ పార్టీకి చెందిన దాదాపు 21 మంది లోక్‌సభ ఎంపీలు బీజేపీ వైపు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, త్వరలోనే ఎస్పీలో భారీ చీలిక రాబోతోందని ఆయన ప్రకటించారు. యూపీ మంత్రి ఓం ప్రకాష్ రాజ్‌భర్ తన సోషల్ మీడియా వేదికగా ఎస్పీ అగ్రనేత రామ్ గోపాల్ యాదవ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఒక రహస్య లేఖ సమర్పించారని ఆరోపించారు. యూపీని గతంలో కుదిపేసిన మైనింగ్ కుంభకోణం, గోమతి రివర్ ఫ్రంట్ స్కామ్‌ల మాస్టర్‌మైండ్ ఎవరో అందరికీ తెలుసని.. ఇప్పుడు ఆ కేసుల ఉచ్చు గట్టిగా బిగుస్తుండటంతో ఎస్పీ నేతల్లో ఆందోళన మొదలైందని ఆయన పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థల భయంతో , నియోజకవర్గాల నిధుల కోసమే స మొత్తం సమాజ్ వాదీ పార్టీ బీజేపీలో చేరేందుకు లోపాయకారీగా లైన్ క్లియర్ చేసుకుంటోందని, అందులో భాగంగానే 21 మందికి పైగా ఎంపీలు టచ్‌లోకి వచ్చారని రాజ్‌భర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి రాజ్‌భర్ చేసిన ఈ మైండ్ గేమ్‌పై సమాజ్ వాదీ పార్టీ అధినేత, లోక్‌సభ ఎంపీ అఖిలేష్ యాదవ్ అత్యంత ఘాటుగా స్పందించారు. ఇవన్నీ కేవలం ఓటమి భయంతో బీజేపీ ఆడుతున్న చౌకబారు నాటకాలని కొట్టిపారేశారు. లోక్‌సభ ఎన్నికల్లో యూపీ ప్రజలు బీజేపీకి గట్టి బుద్ధి చెప్పారని, ఆ పరాజయాన్ని జీర్ణించుకోలేక ఇటువంటి మైండ్ గేమ్స్ ఆడుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం లోక్‌సభలో 37 స్థానాలతో మూడో అతిపెద్ద పార్టీగా అవతరించిన తమ పార్టీ ఎంతో పటిష్టంగా ఉందని, తమ పార్టీ ఎంపీలు ఎవరూ కూడా ప్రలోభాలకు లొంగే ప్రసక్తే లేదని అఖిలేష్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చీలిక వస్తుందంటూ జరుగుతున్న ప్రచారాన్ని అఖిలేష్ తిప్పికొడుతూ.. రాబోయే 2027 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తాము కాంగ్రెస్ పార్టీతో కలిసి ఉమ్మడిగానే పోటీ చేస్తామని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఏ విధంగానైతే మట్టికరిపించామో, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే ఫార్ములాతో యోగి ప్రభుత్వాన్ని గద్దె దించుతామని పునరుద్ఘాటించారు. ప్రతిపక్షాల మధ్య విభేదాలు సృష్టించి మైలేజ్ పొందాలని చూస్తున్న బీజేపీ పప్పులు ఉమ్మడి యూపీలో ఉడకవని, అసలైన ప్రజా సమస్యలైన నిరుద్యోగం, ఆరోగ్య రంగా పతనంపై మాట్లాడకుండా అధికార పక్షం ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు. మహారాష్ట్రలో శివసేన కి చెందిన ఎంపీలు షిండే వర్గంలో విలీనం అయ్యారు. రాజ్‌భర్ చేసిన ఈ వ్యాఖ్యలు యూపీ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. లోక్‌సభలో మేజిక్ ఫిగర్ దాటినప్పటికీ, విపక్షాల బలాన్ని మరింత కుంగదీయాలనే వ్యూహంతో బీజేపీ ఆపరేషన్ లోటస్ ను దేశవ్యాప్తంగా విస్తరిస్తోందనే అనుమానాలు బలపడుతున్నాయి. అయితే, అఖిలేష్ యాదవ్ తన ఎంపీలు, కేడర్‌ను కాపాడుకుంటూ 2027 పోరుకు ఎలా సిద్ధం కాబోతున్నారనేది రాబోయే రోజుల్లో జాతీయ రాజకీయాల సరళిని శాసించనుంది

## ప్రభుత్వ భూములను కాపాడాలి

### భూమాఫియాపై ఉక్కుపాదం మోపాలి : ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్ : నగరంలో పేదవాడు జీవించే పరిస్థితి రోజురోజుకు కష్టతరమవుతోందని, ఇల్లు నిర్మించుకోవడానికి కనీస స్థలం కూడా అందుబాటులో లేకుండా పోతోందని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. కంటోన్మెంట్ పరిధిలోని సర్వే నంబర్లు 57/1, 157/1 భూముల సమస్యపై స్థానిక ప్రజలతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. 70?80 ఏళ్ల క్రితం గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన పేదలు ఆనాడు డిమాండ్ లేని ప్రాంతాల్లో గుడిసెలు వేసుకుని జీవనం ప్రారంభించారని, కానీ నేడు పేదలకు ఇల్లు కట్టుకునేందుకు 20 గజాల స్థలం కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, ప్రజా అవసరాల కోసం కూడా భూములు అందుబాటులో లేకపోవడానికి ప్రధాన కారణం ప్రభుత్వ భూముల ఆక్రమణలేనని ఆయన పేర్కొన్నారు. కొందరు భూ కబ్జాదారులు, పైరవీకారులు, అవినీతి అధికారులతో కుమ్మక్కై వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేటు ఆస్తులుగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. షంషీగూడ ఎల్లమ్మబండలోని వందల ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, ఒకప్పుడు పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూములనే నేడు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అలాగే బాలానగర్?తిరుమలగిరి గ్రామాల మధ్య ఉన్న సుమారు 8 ఎకరాల భూమిని కూడా కొందరు భూమాఫియా వ్యక్తులు ప్రైవేటు భూమిగా చిత్రీకరించారని విమర్శించారు. సర్వే నంబర్లు 57/1, 157/1లో తరతరాలుగా నివసిస్తున్న పేద కుటుంబాలను ఖాళీ చేయించే ప్రయత్నాలు అన్యాయమని, తాము ప్రజల పక్షాన నిలబడి అలాంటి ప్రయత్నాలను అడ్డుకున్నామని తెలిపారు. గత 25 నుంచి 30 ఏళ్లుగా రికార్డుల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వ భూములను ప్రైవేటు భూములుగా చూపించే కుట్రలు జరిగాయని ఆరోపించారు. ప్రభుత్వ భూములను కాపాడి పేదలకు ఇళ్ల స్థలాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, పిల్లలకు ఆటస్థలాలు ఏర్పాటు చేయాలి. భూమాఫియాపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని, ప్రభుత్వ భూముల పరిరక్షణకు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల పన్నులతో జీతాలు పొందుతున్న అధికారులు ప్రజల పక్షాన పనిచేయాలని, సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు, కొడుకు మృతి

మేడ్చల్ : మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మురహరపల్లి రాజీవ్ రహదారిపై అర్ధ రాత్రి జరిగిన ప్రమాద ఘటన స్థలాన్ని మేడ్చల్ ఏసిపి శంకర్ రెడ్డి పరిశీలించారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో కరీంనగర్ కు చెందిన రైల్వే ఉద్యోగి చంద్ర శేఖర్ మరియు అతని భార్య రేఖ మరియు రేఖ చెల్లెలి కుమారుడు నిహాల్ 2 సంవత్సరాలు ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కారు అదుపు తప్పి అటుగా వస్తున్న లారీని బలంగా ఢీ కొనడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ముగ్గురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు.

## రైతులకు రెండు లక్షల పంట రుణాలు మాఫీ చేయాలి

పిడుగురాళ్ల :రైతులకు రెండు లక్షల పంట రుణాలు మాఫీ చేయాలని జూన్ 30వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మందపాటి రమణారెడ్డి అన్నారు. పిడుగురాళ్ల ఎస్ టి యూ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సమావేశంలో రమణారెడ్డి మాట్లాడుతూ, గత రెండేళ్లుగా రాష్ట్రంలో రైతాంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా మన రాష్ట్రంలో రెండు లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి ఆత్మహత్యల నుంచి రైతాంగాన్ని కాపాడాలని అన్నారు. గురజాల నియోజకవర్గం కార్యదర్శి కందిమళ్ల సైదారావు మాట్లాడుతూ, డాక్టర్ ఎం ఎస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని కౌలు రైతులకు గుర్తింపు కార్డులను ఇచ్చి, పంట రుణాలను ఇవ్వాలన్నారు. విజయవాడలో జరుగు ధర్నా చౌక్ వద్దకు ఈ నెల 30వ తేదీన గురజాల నియోజకవర్గం నుంచి రైతులు పాల్గొని ముఖ్యమంత్రి కార్యాలయం రాయబారాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు కందిమళ్ళ అంజలి, అక్కెనపల్లి బాలయ్య, షేక్ సైదా, షేక్ నజీర్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ పురోగతిపై మంత్రి పొన్నం సమీక్ష

హైదరాబాద్ : ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు పూర్తయిన సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీ సమ్మె సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్పీఎస్–2021కు సంబంధించిన 11 శాతం ఫిట్మెంట్ను జూలై 1 నుంచి అమలు చేయాలని నిర్ణయించాం. అలాగే ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ను త్వరలో విడుదల చేసి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు. నాగర్కర్నూల్, పెద్దపల్లి డిపో పనులను వేగవంతం చేయడంతో పాటు మంజూరైన బస్ స్టేషన్ల శంకుస్థాపనలకు కార్యాచరణ రూపొందించాలని సూచించాను. ఆత్మహత్య చేసుకున్న ఉద్యోగి శంకర్ కుటుంబానికి రూ.1 కోటి చెక్కు, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు అందించే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో దక్షిణ భారత రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, కమిషనర్లు, ఆర్టీసీ ఎండీలతో సమావేశం నిర్వహించి ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధిపై చర్చించనున్నామని మంత్రి వెల్లడించారు.

## ఎస్సీ బాలికల హాస్టల్ లో నీటి పైపుకు లీకేజీ

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం కేంద్రంలోని దొడగట్ట రోడ్ లోని ఎస్సీ బాలికల హాస్టల్. ఈ హాస్టల్ ప్రాంగణంలో సత్యసాయి నీటి సరఫరా పైప్ లైన్ కు లీకేజీ పడింది. పదిరోజులుగా నీటి ప్రవాహం కొనసాగుతుంది. సెలవుల అనంతరం హాస్టల్ కి విద్యార్థినులు వచ్చేశారు. ఈ నీటి ప్రవాహం లోనే విద్యార్థులు నడవాల్సివస్తుంది. నీటి నిల్వ కారణంగా దోమలు ఎక్కువవుతున్నాయి. ఆన్పైప్ లైన్లు మరమ్మతులు చేసినా ప్రెజర్ కారణంగా పూర్తి స్థాయిలో ఆగిపోలేదని హాస్టల్ వార్డెన్ అంటున్నారు. సత్యసాయి నీటి సరఫరా ఇంజనీర్లు చొరవ తీసుకొని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇక్కడి పరిసర ప్రాంతం లోని నివాస గృహాల వారు హాస్టల్ బయట ప్రధాన ద్వారం ముందరే చెత్త కుప్ప వేస్తున్నారు. దీని మూలంగా విద్యార్థులు అనారోగ్యం బారినపడే అవకాశం ఉంది.

### అంతేరా రెస్టారెంట్, లా పినోజ్ పిజ్జా

## రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడి

హైదరాబాద్ : మియాపూర్లోని మదీనాగూడలో ఉన్న అంతేరా రెస్టారెంట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేసారు. ఫంగస్ ఏర్పడిన కాలీఫ్లవర్ ఇతర కూరగాయలు, వంటకు వాడరాని నూనె, లేబుల్స్ లేకుండా కూరగాయల నిల్వలు గుర్తించి ఇంప్రూవ్మెంట్ నోటీసులు జారీ చేసారు. హైటెక్ సిటీ జూబ్లీ ఎంక్లేవ్లోని లా పినోజ్ పిజ్జా రెస్టారెంట్పై దాడులు చేసి ఫ్రిజ్లో పురుగులు, కిచెన్లో బొద్దింకలు, వెజ్ మరియు నాన్ వెజ్ పదార్థాలు ఒకే చోట నిల్వ ఉంచడం, ఆహార పదార్థాలు నిల్వ ఉంచే చోట బల్లి విసర్జనలు ఉన్నట్లు గుర్తిం,ఆరు. నోటీసులు జారీ చేసారు.

## గోడ కూలి కారులో ఉన్న ఇద్దరు మృతి

మహబూబ్ నగర్ : వర్షం కురుస్తున్న సమయంలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిపై నుంచి ప్రహరీ గోడ కారుపై అకస్మాత్తుగా కూలిపోయింది. ఘటనలో కారులో ఉన్న సివిల్ ఇంజనీర్ జగన్నాథ్ రెడ్డి, డ్రైవర్ సంతోష్ మృతి చెందారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండల కేంద్రంలో ఘటన జరిగింది.

## మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

**- మామిడి రైతులకు మద్దతుగా వైసీపీ ఆధ్వర్యంలో ఆందోళన**

చిత్తూరు : జీడి నెల్లూరు జైన్ ఫ్యాక్టరీ ఎదుట మామిడి రైతులతో వైసీపీ నిరసనకు దిగింది. మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేసారు. గత ఏడాది మామిడి పంటకు కిలో 12 రూపాయలు గిట్టు బాటు ధర కల్పించింది ప్రభుత్వం. ఈ ఏడాది మామిడి పంటను జ్యూస్ ఫ్యాక్టరీలు తక్కువ ధరకే కిలో 4 - 5 రూపాయలు మించి కొనుగోలు చేయడంలేదు. తోతాపురి మామిడి పంటకు కిలో 15-20 రూపాయలు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేసారు. తిరుపతి , చిత్తూరు జిల్లాలు వైసీపీ అధ్యక్షుడు భూముల కరుణాకర్ రెడ్డి నేతృత్వంలో జైన్ ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన జరిగింది.

## పోలీసుల వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

విజయనగరం : సంతకవిటి మండలం రామరాయపురంలో విషాదం నెలకొంది. పోలీసుల పలుమార్లు విచారణకు పిలవడంతో తల్లీకొడుకులు కళావతి, చిరంజీవి రైలు క్రిందపడి ఆత్మహత్యకు ప్రయత్నించారు. ఆఖరి క్షణంలో కొడుకును పక్కకునెట్టి తల్లి ఆత్మహత్య చేసుకుంది. గత నెల 25న ఓ ఇంట్లో 4 తులాల బంగారం, రూ.10 వేల నగదు చోరీ అయ్యాయి. అనుమానంతో వీరినే పదే పదే పోలీస్ స్టేషన్ కు పిలవడంతో మనస్తాపానికి గురయ్యారు.

### ఎంపీలకు రూ.50 కోట్ల ఎంఎస్‌పీ..

## సంజయ్ రౌత్ ఆరోపణ

ముంబై: శివసేన (యూబీటీ)లో చీలిక ఏర్పడనుందని, ఏడుగురు ఎంపీలు పార్టీ ఫిరాయించనున్నారనే ఊహాగానాల నేపథ్యంలో ఆ పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ ఎంపీలను పార్టీ మారేందుకు ఒక్కొక్కరికి రూ.50 కోట్ల కనీస మద్దతు ధర నిర్ణయించారని, అందులో రూ.15 కోట్లు అడ్వాన్స్ ఇస్తున్నారని రౌత్ ఆరోపించారు. దీనికిముందు, పార్టీ మారేందుకు ఒక్కొక్కరికి రూ.15 కోట్లు ఆఫర్ చేస్తున్నారనంటూ సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రా వెంటనే స్పందించారు. 'కేవలం 15 కోట్లేనా? మా ఎంపీలకు రూ.4 కోట్లు అడ్వాన్, తర్వాత 36 నెలల వరకూ నెలకూ రూ.కోటి ఆఫర్ ఇచ్చారు. హనీ ప్లస్ మనీ' అని పోస్టు చేశారు. దీనికి వెంటనే సంజయ్ రౌత్ కౌంటర్ ఇచ్చారు. 'మహువా జీ.. ఒక్కో ఎంపీకి కనీస మద్దతు ధర రూ.50 కోట్లు ఫిక్స్ చేశారు. రూ.15 కోట్లు అడ్వాన్స్ మాత్రమే. నిజానికి వీళ్ల (ఎంపీలు) రూ.50,000 కూడా విలువచేయరు. శివసేన, టీఎంసీ బ్రాండ్ లేబుల్ కారణంగానే వాళ్ల ధర పెరిగింది' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వ్యంగ్యంగా పోస్ట్ పెట్టారు.

స్పెషల్ ఎడిషన్ తెలుగు దినపత్రిక

శనివారం, జూన్ 20, 2026

# సంగారెడ్డి జిల్లాలో దొంగల హల్చల్

సంగారెడ్డి : మండల కేంద్రమైన జిన్నారం గ్రామంలో కొలువుదిరినా కోదండరాముల వారి దేవాలయంలో పట్టపగలే దొంగలు చోరికి పాల్పడ్డారు,,మంగళవారం మధ్యాహ్నం ఆలయంలోకి చొరపడ్డ గుర్తుతెలియని దుండగులు అయ్యప్ప పడిపూజకు సంబంధించిన సుమారు 2 లక్షల విలువ చేసే పూజా సామాగ్రిని పట్టపగలే చోరీచేశారు,,విషయం తెలుసుకున్న గ్రామస్తులు జిన్నారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు,,సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు

# జొన్నగిరి గ్రామంలో సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు పంపిణీ

తుగ్గలి: తుగ్గలి మండల పరిధిలోని గల జొన్నగిరి గ్రామం నందు మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు స్థానిక గ్రామ టిడిపి నాయకుల ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను బుధవారం రోజున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వేరుశనగ విత్తనాలు కావలసిన రైతులు తమ పరిధిలోని గల రైతు సేవ కేంద్రం వద్దకు పొలం పాస్ బుక్,ఆధార్ కార్డులను తీసుకుని వెళ్లి వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలియజేశారు. మండలంలో యూరియా కొరత కూడా లేదని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు సంఘాల కృష్ణ,హోటల్ మల్లి,జయరాముడు, లక్ష్మణ స్వామి,సోము,వ్యవసాయ శాఖ అధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

### జర్నలిస్టుల పిల్లలకు విద్యా ఫీజు లో

# 50% రాయితీ అమలు చేయాలి

### - డిఆర్ఓ కి ఏపీయూడబ్ల్యూజే జర్నలిస్టుల వినతి

నరసరావుపేట : పల్నాడు జిల్లాలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు సమాజానికి, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచి – నిస్వార్థంగా ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టస్ (ఏపీయూడబ్ల్యూజే) పేర్కొన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో 50%ఫీజు రాయితీ విద్యను కల్పించే అంశంపై పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కృతిక శుక్లా కి తెలియచేయగా వెంటనే సానుకూలంగా స్పందించి డిఆర్ఓ కు తగు చర్యలు తీసుకోమని ఆదేశించారు. ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిఆర్ఓ ని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా ఏపీయూడబ్ల్యూజే నాయకులు హర్షం వ్యక్తం చేసి జర్నలిస్ట్ లు, ఏపీయూడబ్ల్యూజే తరుపున కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పల్నాడు జిల్లా సెక్రటరీ నాగరాజు, గౌరవాధ్యక్షులు జగన్, పల్నాడు జిల్లా కమిటీ మెంబర్ కోటేశ్వరాచారి, సాజిద్, నాయిూమ్, తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 25 నుండి టిడిపి ఇంటింటి ప్రచార కార్యక్రమం

### 45 రోజులపాటు కొనసాగునున్న ఇంటింటి ప్రచార కార్యక్రమం

తుగ్గలి : ఈనెల 25 నుండి ఆగస్టు 10 వరకు తెలుగుదేశం పార్టీ ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, ఎర్రగుడి వెంకటస్వామి,మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు లు తెలియజేశారు. బుధవారం రోజున విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సర్ (ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు. 45 రోజులపాటు నిర్వహించే ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ప్రభుత్వ విజయాలను ప్రజలలోకి తీసుకువెళ్లడం,ప్రజల సమస్యలను తెలుసుకొని నమోదు చేయడం,ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం,ప్రతి ఒక్క ఓటు రక్షణ పై దృష్టి సాధించడం,జనసేన మరియు బిజెపి పార్టీల సమన్వయంతో ప్రచార లక్ష్యాలను చేరుకొని ప్రజలకు అవగాహన కల్పిస్తామని వారు తెలియజేశారు. 45 రోజులపాటు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలలోనే ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందని వారు తెలియజేశారు. జూన్ 25 నుండి ప్రారంభమయ్యే తెదేపా ఇంటింటి ప్రచారం కార్యక్రమానికి మండలంలోని గల ప్రతి ఒక్క టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు,క్లస్టర్ ఇంచార్జిలు, బూత్ ఇన్చార్జులు,కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మారెళ్ళ దేవరింటి వెంకటరాముడు, మాజీ సర్పంచ్ మసాలా శీను,బోస్, డీలర్ రవి,మునేశ్వర్ గౌడ్,సంజీవ చౌదరి తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

### - సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యురాలు కొంకా రాధ

పిడుగురాళ్ల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి అనిత పై వైసీపీ నాయకుడు గుడివాడ అమర్నాథ్ చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను నేను తీవ్రంగా ఖండిస్తున్నాను అని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ కొంక రాధ అన్నారు. ఈ సందర్భంగా ఆమె పిడుగురాళ్లలో మీడియాతో మాట్లాడుతూ ఒక మహిళను, అదీ రాష్ట్ర హోంమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకురాలిని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం అత్యంత బాధాకరం అన్నారు, ఆ వ్యాఖ్యలు ఖండించదగిన విషయం అన్నారు. సామాన్య కుటుంబం నుంచి స్వయంకృషితో ఎదిగి, ఎస్సీ వర్గానికి చెందిన మహిళగా ఎన్నో అవరోధాలను అధిగమించి రాష్ట్ర హోంమంత్రి స్థాయికి చేరుకున్న అనిత నేటి యువతకు, మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు అని అన్నారు. అలాంటి మహిళపై వ్యక్తిగత విమర్శలు చేయడం అంటే ఆమెను మాత్రమే కాదు, రాష్ట్రంలోని ప్రతి మహిళ ఆత్మగౌరవాన్ని అవమానించినట్టే అని అన్నారు. రాజకీయాల్లో విభేదాలు ఉండవచ్చు, విమర్శలు ఉండవచ్చు, కానీ అవి విధానాలపై ఉండాలి తప్ప, మహిళల వ్యక్తిత్వం, రూపురేఖలు లేదా వ్యక్తిగత విషయాలపై కాదు అని అన్నారు. మహిళలను కించపరిచే భాషను ఉపయోగించడం వైసీపీ నాయకుల సంస్కృతిని బయటపెడుతోంది అన్నారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో అగ్రస్థానాల్లో నిలుస్తున్నారు అని అన్నారు. అలాంటి సమయంలో మహిళల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు చేయడం అత్యంత దురదృష్టకరం అని రాధా అన్నారు . ఇటువంటి వ్యాఖ్యలను రాష్ట్రంలోని ప్రతి మహిళ, ప్రతి ప్రజాస్వామ్యవాది ఖండించాలి అన్నారు. హోంమంత్రి అనిత కి ప్రజల ఆశీస్సులు, మద్దతు పుష్కలంగా ఉన్నాయి అన్నారు. ఇలాంటి చౌకబారు వ్యాఖ్యలు ఆమె స్థాయిని ఏమాత్రం తగ్గించలేవు అన్నారు. ఆమె మరింత ధైర్యంగా, మరింత సమర్థవంతంగా ప్రజాసేవలో ముందుకు సాగుతారు అని రాధా తన ఆశా భావాన్ని వ్యక్తం చేశారు. మహిళలను అవమానించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకునే వారికి ప్రజలే తగిన సమయంలో తగిన సమాధానం చెబుతారు అని అన్నారు.

# ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీ ని అరికట్టాలి

బద్వేలు : ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడికి ప్రభుత్వాలు వత్తాసు పలకడంతో రకరకాల ఫీజుల వసూళ్లతో తల్లిదండ్రులకు మరణ శాసనం గా మారిందని బద్వేలు సిపిఐ పట్టణ కార్యదర్శి బాలు, ఏరియా సహాయ కార్యదర్శి ఇమ్మానియేల్ వారి బృందం తో విలేకరుల సమావేశంలో విద్యాసంస్థల దోపిడీపై ఆగ్రహం చెందారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రైవేట్ స్కూళ్ల ఇష్టారాజ్యం. గత ఏడాది కంటే 20 శాతం ఫీజులు పెంపు. స్టేషనరీ పేరుతో అక్రమ వసూళ్లు.చేయడం చాల దుర్మార్గమన్నారు ఒక్కో విద్యార్థి నుంచి స్టేషనరీ కింద 2 వేల నుంచి 5 వేల వరకు వసూలు అక్రమంగా వసూలు చేస్తోందని తల్లిదండ్రుల వాపోతున్నారు అన్ని ప్రైవేట్ స్కూళ్లలోనూ ఇదే పరిస్థితి. ఎంఆర్పీ కంటే ఎక్కువ రేట్లకు పుస్తకాలు, యూనిఫామ్ అమ్మకాలు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు అమలు చేయకుండా ఇష్టానుసారంగా వసూళ్లు చేస్తున్న యాజమాన్యాలు. అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రైవేట్ స్కూళ్ల దోపిడీపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల కోరారు. ప్రైవేట్ విద్యా సంస్థల అధిక పీసులు, వ్యాను ఫీజులు, డ్రెస్సులు, అడ్మిషన్ ఫీజులు, షూస్, ఎన్నో రకాల ఫీజులతో సతమతమవుతున్న తల్లిదండ్రుల బాధలను జిల్లా డి ఈ ఓ గారు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు మామూళ్ల మత్తులో చదువుతున్నారా అన్న బలమైన చర్చ తల్లిదండ్రుల జరుగుతాంది తమిళనాడు రాష్ట్రంలో ముఖ్యమంత్రి గారు ప్రైవేట్ స్కూల్లో ఒకటవ తరగతి నుండి ఒక్కొక్క సెక్షన్కు ఇంత డబ్బులు తీసుకోవాలని ప్రతి స్కూల్లో రేట్ల బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది అదేవిధంగా మన రాష్ట్ర ప్రభుత్వం నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ గారు పవన్ కళ్యాణ్ గారు ఎందుకు నియంతించలేక పోతున్నారు అర్థం కాని పరిస్థితిలో ఉన్నామని వారన్నారు మెడికైనా పాలక ప్రభుత్వాలు మేలుకొని అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు యాజమాన్యంపై ఉక్కు పాదం మోపాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# డీఎస్సీపై చర్చకు సిద్ధమా?

## జగన్ కు లోకేష్ సవాల్



విజయవాడ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి నివాసానికి సమీపం నుంచి ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఛాలెంజ్ చేశారు. తాడేపల్లిలోని జగన్ ఇంటికి కేవలం 200 మీటర్ల దూరంలో ఉండి మాట్లాడుతున్నానని, గొడ్డలి పార్టీ నేతల్లా బురద చల్లి పారిపోయే రకం తాము కాదన్నారు. ఏపీ మెగా డీఎస్సీ నిర్వహణ, టీచర్ పోస్టుల నియామకాలపై ప్రతిపక్షాలకు ఎలాంటి అనుమానాలున్నా, వాటికి సమాధానం చెప్పేందుకు తానే స్వయంగా సిద్ధంగా ఉన్నానని, ధైర్యం ఉంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. జగన్ ఎన్ని జన్మలెత్తినా ఏపీలో డీఎస్సీ నియామకాలను ఆపలేరని నారా లోకేష్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలా 'సాక్షి క్యాలెండర్' కాకుండా, తాము నిరుద్యోగుల కోసం నిజమైన జాబ్ క్యాలెండర్ను ప్రకటిస్తున్నామని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో ఒక్క డీఎస్సీ అయినా నిర్వహించి ఉంటే వారికి హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియపై అవగాహన ఉండేదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పులివెందుల ఎమ్మెల్యే అయిన మాజీ సీఎం జగన్.. బెంగళూరు, తాడేపల్లి, హైదరాబాద్ లూప్ను వీడి, ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తేనే ఇక్కడి అభివృద్ధి కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. ఎప్పుడూ రౌడీల మధ్య ఉండే వైసీపీ అధినేత జగన్, మహిళలను కించపరిచే వారిని, తిట్టే వారిని తన చుట్టూ పెట్టుకుంటారని విమర్శించారు. గత ప్రభుత్వంలో కోడిగుడ్డుకు, పరిశ్రమకు తేడా తెలియని వాళ్లు మంత్రులుగా చేయడం వల్లే రాష్ట్రం నుంచి పరిశ్రమలు పారిపోయాయంటూ నారా లోకేష్ ధ్వజమెత్తారు.

**అమర్నాథ్పై జగన్ ప్రశంసలు దురదృష్టకరం..**

మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రెస్మీట్పై జగన్ ప్రశంసలు కురిపించడం దురదృష్టకరమని లోకేశ్ వ్యాఖ్యానించారు. ఒకవేళ వైసీపీ నేతలు హోం మంత్రి వంగలపూడ అనితని అవమానించినట్లే, జగన్ భార్య భారతీరెడ్డిని లేదా ఆయన ఇద్దరు కుమార్తెలను ఎవరైనా అవమానిస్తే జగన్ ఇలాగే శభాష్ అంటారా? అని నిలదీశారు. టీడీపీ పార్టీకి అలాంటి నీచమైన సంస్కృతి లేదని, అందుకే జగన్ కుటుంబ సభ్యులను సోషల్ మీడియాలో కించపరిచిన వారిపై కూడా తాము చర్యలు తీసుకున్నామని నారా లోకేష్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. 'మంగళగిరి నుంచి పోటీ చేసి ఓడిపోయినందుకు చాలా బాధపడ్డాను. కానీ ఇక్కడి నుంచే నెగ్గాలని భావించాను. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లతో పోరాడి ఇదే సీటు తీసుకున్నాను. ఏపీలో టాప్ 3 మెజారిటీ నియోజకవర్గాల్లో ఒకటిగా మంగళగిరి నిలిచింది. తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తున్నాం. అన్నా క్యాంటీన్లు తెరిచి తక్కువ ధరకు పేదల ఆకలి తీర్చుతున్నాం. అనాడు అన్న ఎన్టీఆర్ స్థాపించిన లైబ్రరీని అభివృద్ధి చేస్తున్నాం. చిన్న కార్పొరేషన్లో భూగర్భ డ్రైనేజీని తీసుకురావడంలో ఎంపీ కృషి ఉంది. రాష్ట్రంలో అన్ని రంగాల్లో మంగళగిరి నియోజకవర్గం ముందుండేలా కృషి చేస్తానన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.4 వేల ఫించన్, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. మహిళలకు ఆర్టీసీ లో ఉచిత ప్రయాణం. తల్లికి వందనంతో ఎంత మంది పిల్లలున్నా వారికి ఆర్థిక సాయం. అన్నదాతలకు కేంద్రం, రాష్ట్రం కలిపి 20 వేలు ఏడాదికి ఇస్తున్నాం. ఎస్ఐఆర్ ఓటింగ్ ప్రక్రియపై అనుమానాలు వద్దన్నారు. కొత్తగా ఓట్లు నమోదు చేసుకోవాలని కొత్త వారికి సైతం సూచిస్తున్నామని' అన్నారు

**అనిల్ మద్దతుగా లోకేష్**

హోంమంత్రి వంగలపూడి అనితపై వైసీపీ నేత గుడివాడ అమర్ నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యల దుమారం ఏపీ రాజకీయాల్లో మరింత ముదిరింది. ఈ వ్యవహారంపై మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా అత్యంత తీవ్రంగా స్పందించారు. ఈ వ్యాఖ్యలు యాదృచ్ఛికంగా చేసినవి కావని, వైసీపీ ఐదేళ్ల విఫల పాలనలో పెంచి పోషించిన విషపూరిత రాజకీయ సంస్కృతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో శాంతిభద్రతలు, అభివృద్ధిపై మాట్లాడటానికి ఆ పార్టీ నేతల వద్ద ఎలాంటి సమాధానాలు లేవని లోకేశ్ ఎద్దేవా చేశారు. హోంమంత్రి పదవిలో ఉన్న ఒక మహిళను, అందులోనూ ఒక దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకురాలిని పనిగట్టుకుని లక్ష్యంగా చేసుకోవడం వెనుక వైసీపీ వికృత రాజకీయం దాగి ఉందన్నారు. వంగలపూడి అనిత కష్టపడే తత్వానికి, ధైర్యానికి, నిరంతర ప్రజాసేవకు నిదర్శనమని లోకేశ్ కొనియాడారు. వైసీపీ నాయకులు ఎంతగా దూషించినా, బాడీ షేమింగ్ చేసినా ఆమె సాధించిన విజయాలను అస్సలు తగ్గించలేరని, ఆమె గొంతును నొక్కలేరని స్పష్టం చేశారు. ఏపీ ప్రజలు ఇలాంటి ద్వేషపూరిత రాజకీయాలను ఎప్పుడో తిరస్కరించారని గుర్తుచేశారు. హోంమంత్రి అనితతో పాటు రాష్ట్రంలోని ప్రతి మహిళకు, ప్రతి దళితుడికి వైసీపీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# కొడుకును, భార్యను చంపి..ఆత్మహత్య

నెల్లూరు : పెంపుడు కొడుకు సాఫ్ట్వేర్ ఉద్యోగం కోల్పోవడంతో మనస్తాపానికి లోనై రిటైర్డ్ టీచర్ కుటుంబం ప్రాణాలు తీసుకుంది. 'మా కుమారుడు అమాయకుడు. మేం లేకుండా తను బతకలేడు' అని లేఖ రాసి, భార్య, కుమారుడికి ఉరివేసి అనంతరం రిటైర్డ్ టీచర్ సైతం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం మండలంలోని దువ్వూరులో ఈ విషాదం చోటుచేసుకుంది. 'మా 26 ఏళ్ల కుమారుడు సాయిసుకృత్ అమాయకుడు. నేను, నా భార్య శారీరకంగా, మానసికంగా బలహీనం అయ్యాం. మేం లేకుండా కుమారుడు బతకలేడు. ఆ కారణంగా మేం ముగ్గురం ఆత్మహత్య చేసుకుంటున్నాం. ఇందుకు ఎవరూ బాధ్యులు కాదు. ఇప్పటివరకూ మాకు తోడ్పాటు అందించిన బంధు మిత్రులకు ధన్యవాదాలు' అంటూ సూసైడ్ నోట్ రాసి భార్య, కుమారుడికి ఉరివేసిన తరువాత రిటైర్డ్ టీచర్ సైతం ప్రాణాలు తీసుకున్న ఘటన అందర్నీ కలచివేస్తోంది. దువ్వూరుకు చెందిన చీరాల మధుసూదన్రావు (65) సెకండరీ గ్రేడ్ టీచర్గా పనిచేసి ఐదేళ్ల క్రితం రిటైర్ అయ్యారు. భార్య రత్నావళి (60), కుమారుడు సాయిసుకృత్ (26)తో కలసి దువ్వూరులో నివసిస్తున్నారు. తనకు మామిడి పండ్లు కావాలని.. వరుసకు సోదరి అయ్యే దొరసానమ్మతో ఆదివారం నాడు మధుసూదన్రావు మాట్లాడారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఆమె పండ్లు తీసుకుని వచ్చి చూడగా ఇంటి తలుపులు లోపల నుంచి వేసి ఉన్నాయి. ఎంత పిలిచినా ఎవరూ స్పందించకపోవడంతో చుట్టుపక్కల ఇళ్ల వారితో కలిసి తలుపులు బద్దలుగొట్టి లోపలికి వెళ్లారు. హాల్లో మధుసూదన్రావు, రత్నావళి దంపతులు.. దేవుడి గదిలో సాయిసుకృత్ మృతదేహాలు ఉరికి వేలాడుతూ కనిపించడంతో అంతా షాకయ్యారు. దగ్భ్రాంతికి గురయ్యారు. అయితే ముగ్గురి కాళ్లూచేతులూ కట్టేసి ఉండటంతో అనుమానాలు నెలకొన్నాయి. మధుసూదన్రావు దంపతులకు పిల్లలు పుట్టలేదు. దాంతో సాయిసుకృత్ని ఆత్మకూరు ప్రాంతం నుంచి తీసుకొచ్చి పెంచుకున్నారు. దత్తపుత్రుడు అయినా ప్రేమగా పెంచారు. బీటెక్ వరకు చదివించారు. ఈ క్రమంలో సాయిసుకృత్ తిరుపతిలోని ఒక సాఫ్ట్వేర్ కంపెనీలో జాబ్లో చేరాడు. అయితే ఆ కంపెనీ శాలరీ ఇవ్వకపోవడంతో గత గురువారం మధుసూదన్రావు తిరుపతిలోని ఆ కంపెనీకి వెళ్లి అడిగారు. కుమారుడి పనితీరు బాగాలేదని, సోమవారం వచ్చి సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని కంపెనీ పేర్కొంది. కుమారుడి సాఫ్ట్వేర్ జాబ్ పోవడంతో తల్లిదండ్రులు తీవ్ర వేదనకు గురయ్యారు. అసలే తాము వృద్ధాప్యంలో ఉన్నామని, తాము చనిపోయాక అమాయకుడైన కుమారుడు ఒంటరిగా బతకలేడని, అతడి భవిష్యత్ ఏమవుతుందోనని ఆందోళన చెందారు. ఆదివారం అర్ధరాత్రి తరువాత ఉరేసుకుని చనిపోయారని పోలీసులు భావిస్తున్నారు. భార్య, కుమారుడి కోరిక మేరకు ఆస్తులను ఎవరెవరికి ఎలా పంచాలో కూడా ఆ లేఖలో రాశారు. అంత్యక్రియల కోసం సోదరి బ్యాంకు అకౌంట్లో క్యాష్ చనిపోవడానికి ముందు నెల్లూరులోని రెడ్క్రాస్ సొసైటీకి కొంత స్థలాన్ని రాశారు. తమ అంత్యక్రియల ఖర్చుల కోసం ఎవరూ ఇబ్బంది పడకూడదని భావించి ఓ సోదరి బ్యాంకు అకౌంట్లో నగదు జమ చేసినట్లు సూసైడ్ నోట్ లో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ముగ్గురి కాళ్లు, చేతులు కట్టేసి ఉండటంతో ఎవరైనా హత్య చేశారా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది.

# బొమ్మకల్ పంచాయతీ వినూత్న తీర్మానం

### ప్రభుత్వ స్కూల్లో పిల్లలను చేర్పిస్తే ఇంటి పన్ను, నల్లా బిల్లు పూర్తిగా మాఫీ

కరీంనగర్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి, వాటిని బలోపేతం చేసేందుకు కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామ పంచాయతీ ఒక వినూత్న నిర్ణయం తీసుకుంది. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక లేదా ఉన్నత పాఠశాలలో తమ పిల్లలను చేర్పించే తల్లిదండ్రులకు ఇంటి పన్ను, నల్లా బిల్లుల నుంచి పూర్తి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించింది. సర్పంచ్ వేముల శ్రీకాంత్ నేతృత్వంలోని పాలకవర్గం ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ ఆఫర్ ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం ముగిసే వరకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. ప్రభుత్వ పాఠశాలల మనుగడను కాపాడుకునేందుకు, ప్రైవేటు పాఠశాలల మోజులో పడి సర్కారు బడులను నిర్లక్ష్యం చేస్తున్న తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చేందుకు ఒక గ్రామ పంచాయతీ దేశంలోనే ఎక్కడా లేని విధంగా విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడమే ఏకైక లక్ష్యంగా ఒక అద్భుతమైన ఆఫర్ ప్రకటించింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించే తల్లిదండ్రులకు, ఆయా ఇళ్లకు సంబంధించిన వార్షిక ఇంటి పన్ను, నల్లా బిల్లులను పూర్తిగా మాఫీ చేస్తామని ప్రకటన చేసింది. ప్రస్తుతం బొమ్మకల్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 62 మంది విద్యార్థులుండగా.. ఉన్నత పాఠశాలలో ఆ సంఖ్య కేవలం 23కి పడిపోయింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉపాధ్యాయుల కొరతతో పాటు, భవిష్యత్తులో స్కూల్ పూర్తిగా మూతపడే ప్రమాదం ఉందని గ్రామస్తులు, అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఎలాగైనా హైస్కూల్లో విద్యార్థుల సంఖ్యను భారీగా పెంచాలనే ఉద్దేశంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి వేముల శ్రీకాంత్ అధ్యక్షతన ఆరుగురు వార్డు సభ్యులు అత్యవసర ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం.. ప్రభుత్వ బడికి పిల్లలను పంపే కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం కలిగిస్తూ పన్నులు మాఫీ చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ ప్రత్యేక రాయితీ ప్రస్తుత పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం పూర్తయ్యే వరకు వర్తిస్తుందని సర్పంచ్ వేముల శ్రీకాంత్ స్పష్టం చేశారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లేదా ఉన్నత పాఠశాల.. ఈ రెండింటిలో ఏ బడిలో పిల్లలను చేర్చినప్పటికీ ఆయా కుటుంబాల ఇంటి పన్ను, నల్లా బిల్లుల రద్దు వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. కేవలం పన్నుల మినహాయింపు మాత్రమే కాకుండా.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కుటుంబాలకు భవిష్యత్తులో గ్రామ పరిధిలో అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలలో సైతం మొదటి ప్రాధాన్యత కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు పాలకవర్గం వెల్లడించింది. గ్రామ పంచాయతీ తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయానికి క్షేత్రస్థాయిలో, సోషల్ మీడియా వేదికగా అద్భుతమైన స్పందన లభిస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ఈ పన్నుల మాఫీ పథకం గురించి వివరిస్తున్నారు. ఈ వినూత్న ఆఫర్ ప్రకటించిన అతి తక్కువ సమయంలోనే ఇప్పటికే 12 మందికి పైగా విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా అడ్మిషన్లు పొందడం విశేషం. మరికొందరు తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను చేర్పించేందుకు ఉత్సాహం చూపుతున్నారు. విద్యా వ్యవస్థను రక్షించుకోవడానికి గ్రామీణ స్థాయిలో తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం ప్రస్తుతం కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్గా మారడమే కాక.. రాష్ట్రంలోని ఇతర గ్రామాలకు రోల్ మోడల్గా నిలుస్తోందని విద్యావేత్తలు ప్రశంసిస్తున్నారు.

# పశుపోషకులకు సబ్సిడీపై దాణా పంపిణీ

తుగ్గలి: రాష్ట్రంలోని పశుపోషకులకు సబ్సిడీపై దాణా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మండల పశువైద్యాధికారి బాలకృష్ణ తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో 50 శాతం రాయితీపై ఎస్సీ, ఎస్టి సబ్ ప్లాన్ ఫండ్ ద్వారా ఎస్సీ,ఎస్టీ పాడి రైతులకు రైతు సేవా కేంద్రాలు, పశువైద్యశాలల ద్వారా ఒక కేజీ 11 రూపాయలకు ప్రభుత్వం చేస్తుందని ఆయన తెలియజేశారు. ప్రభుత్వ సబ్సిడీ పోను 50 కేజీల దాణా ప్యాకెట్ కు పాడి రైతులు 550 రూపాయలు చెల్లించాలని ఆయన తెలియజేశారు. ఈ పథకం కేవలం తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి మాత్రమే వర్తిస్తుందని ఆయన తెలియజేశారు. మండలానికి పది మెట్రిక్ టన్నుల దాణా ప్రభుత్వం మంజూరు చేసిందని,కావలసిన ఎస్సీ, ఎస్టీ పాడి రైతులు తమ పరిధిలోని గల రైతు సేవ కేంద్రాన్ని లేదా పశు వైద్య సిబ్బందిను సంప్రదించాలని ఆయన తెలియజేశారు. అదేవిధంగా జీవాల పెంపకం దారులు వర్షాకాలంలో వచ్చే రోగాలు సోకకుండా అరికట్టేందుకు టీకాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు టీకాల కొరకు తమ పరిధిలోని గల రైతు సేవా కేంద్రాన్ని లేదా పశు వైద్య సిబ్బందిని సంప్రదించి టీకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి బాలకృష్ణ తెలియజేశారు.

### ఆదివాసీ హక్కులు చట్టాల అమలుకై,

# అడవి, భూమి, నీరు రక్షణకై పోరాటం

అరకులోయ : అల్లూరి సీతారామరాజు జిల్లా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు అరకులోయ గిరిజన సంఘం కార్యాలయంలో 17,18,19 తేదీల్లో మూడురోజులు పాటు జరుగుతుందని ఆదివాసీ హక్కులు చట్టాలు, సంస్కృతి సంప్రదాయాలు, ఆదివాసీ కళలు, అడవి భూమి, నీరు రక్షణకోసం పోరాటం కొనసాగిస్తామని అన్నారు ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ ధర్మన్న పడాల్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలాదేవ్ మాట్లాడుతూ ఆదివాసి షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసి హక్కులు చట్టాలు ఉల్లంఘిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసి సహజ వనరులు ,సంపదలు అడవి ,భూమి , నీరు కార్పొరేట్ బడా కంపెనీలకు అప్పనంగా అప్పగిస్తున్నాయని ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలు పండుగలు కళలు నిర్వీర్యం చేసే విధంగా ఆదివాసుల తెగల మధ్య వైమానిష్యాలు విభేదాలు సృష్టిస్తున్నారని ప్రకృతిని దైవంగా ఆరాధించే ఆదివాసులకు మతం పేరుతో విడదీస్తున్నారని ఆదివాసులకు వంద శాతం రిజర్వేషన్ చట్టం చేయాలని ఆదివాసి స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అక్రమ ఒప్పందాలు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 13 ,51, 2 రద్దు చేయాలని పీఎం జన్మన్ హౌసింగ్ బకాయి బిల్లులు ఇవ్వాలని చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పెంచిన లక్ష రూపాయలు విడుదల చేయాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీచట్టం కొనసాగించాలని ముఖ హాజరు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# కూటమినేతలు తమిళనాడు సీఎం ను చూసి నేర్చుకోవాలి

బద్వేలు : నాలుగు దశాబ్దాలు అనుభవం పేదల పక్షపాతి అని చెప్పుకుంటున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తమ పక్కనున్న తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ను చూసి నేర్చుకోవాలని తక్షణమే రాష్ట్రంలో ఉన్నటువంటి రైతాంగానికి లక్షలోపు రుణాలను రద్దుచేసి రైతంగం పట్ల తమకున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. తమ పార్టీ ముఖ్య కార్యకర్తలతో కలిసి స్థానిక బద్వేల్ పట్టణంలోని భగత్ సింగ్ నగర్ లోని పార్టీ కార్యాలయంనందు ఆయనపై విధంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తమ ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతన్నలకు అండగా నిలుస్తామని రైతన్నలను పారిశ్రామికవేత్తలకు దీటుగాఅభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందిస్తామని బూటక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను తుంగలో తొక్కి రైతాంగాన్ని మోసం చేసిందని వారు ఘాటుగా విమర్శించారు. రైతన్నల భరోసా అంటూ పదేపదే సభలు సమావేశాలు పెడుతూ హంగామా చేస్తున్న కూటమి ప్రభుత్వ నేతలు రెండేళ్లు గడిచిన ఏ హామీని నెరవేర్చిన పాపాన పోలేదని వారు విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండి అని నినాదం ఇచ్చి నేడు మాట మరిచి స్మార్ట్ మీటర్లు బిగించి రైతన్నల రక్తం తాగుతున్న మాట వాస్తవం కాదా అనివారు ప్రశ్నించారు. ఒకవైపు రైతు ప్రభుత్వం అంటూ చెప్పుకుంటూ రెండో వైపు ప్రాజెక్టుల పనులను పోస్ట్ ఫోన్ చేసుకుంటూ పర్యటనలు పేరుతో రైతులను ఏమారుస్తున్న మాట వాస్తవం కాదా అని వారు ఘాటుగా ప్రశ్నించారు. రైతుల పట్ల ప్రజల సమస్యల పట్ల నిజమైన నిజాయితీ చిత్తశుద్ధి ఉంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతాంగం యొక్క సహకార రుణాలు మాఫీ చేయాలని వారు డిమాండ్ చేశారు. పదేపదే మేము ఇది సాధించాం మేమే అభివృద్ధి చేశాం అంటూ ప్రగల్భాలు పలుకుతున్న మంత్రివర్గం ఇంతవరకు రైతాంగ సమస్యలపై వారి సహకార రుణాల మాఫీపై ఇంతవరకు ఎందుకు ప్రకటించలేదని వారు ప్రశ్నించారు. అనుభవం ముఖ్యం కాదని అవగాహన ముఖ్యమని అది ఉండబట్టే తమిళనాడు సీఎం గా కొత్తగా ఎన్నికైన విజయ్ గారు 75 వేల లోపు రుణాలు ఉన్న సహకార సంఘాల రుణాల మాఫీని ప్రకటించారని, స్మార్ట్ మీటర్లను పూర్తిగా ఎత్తివేయాలని, ఆ ప్రాజెక్టును పూర్తిగా పక్కన పెట్టాలని చేసిన నిర్ణయాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని మీరు కూడా ఆ బాటలో పయనించి తక్షణమే లక్షలోపు రుణాలు ఉన్న రైతులకు రుణమాఫీ ప్రకటించి నిధులు విడుదల చేయాలని, వివాదాల పేరుతో మాయ మాటలు చెప్పకుండా కేంద్రంతో పరిష్కరించుకొని తక్షణమే అన్ని ప్రాజెక్టులకు నీరు విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని లేనిపక్షంలో సిపిఐ ఎంఎల్ లేబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో రైతాంగంతో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించడానికి కార్యాచరణ రూపొందిస్తున్నామని ఆయన హెచ్చరించారు.

# ఉచిత కంది మినీకిట్ల పంపిణీ

సి. బేళగల్ : రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు పప్పుధాన్యాల ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా సి. బేళగల్ మండలంలో ఉచిత కంది మినీకిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి జి. మల్లేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు కంది విత్తనాలను అందజేయడంతో పాటు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి జి. మల్లేష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఏటా వివిధ పంటలకు సంబంధించి ఉచిత మినీకిట్లను అందజేస్తోందని తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కంది సాగును ప్రోత్సహించేందుకు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలకు మొత్తం 250 ఉచిత కంది మినీకిట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఒక్కో మినీకిట్‌లో నాలుగు కిలోల నాణ్యమైన కంది విత్తనం ఉంటుందని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సాగు విస్తీర్ణాన్ని పెంచుకోవాలని ఆయన సూచించారు. కంది పంట తక్కువ నీటితో సాగు చేయగలిగే పంట కావడంతో పాటు మంచి మార్కెట్ ధరను కూడా కలిగి ఉంటుందని అన్నారు. అందువల్ల రైతులు వరి, పత్తి వంటి సంప్రదాయ పంటలతో పాటు కంది సాగుపై కూడా దృష్టి సారించాలని కోరారు.

## రాష్ట్ర హోంమంత్రి అనితపై మాజీ మంత్రి అమర్నాథ్ చేసిన వాక్యాలను తీవ్రంగా ఖండిస్తున్నాం

### టిడిపి కర్నూల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి వి. రామలక్ష్మి

మద్దికేర: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పై మాజీమంత్రి అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు టిడిపి కర్నూలు పార్లమెంటు అధికార ప్రతినిధి వి.రామలక్ష్మి తెలియజేశారు. రాజకీయ విమర్శల పేరుతో మహిళల వ్యక్తిత్వాన్ని ఆత్మ గౌరవాన్ని కించపరచడం చాలా దారుణమని టిడిపి కర్నూలు పార్లమెంటు అధికార ప్రతినిధి వి.రామలక్ష్మి పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ హోంమంత్రి అనితపై మాజీ మంత్రి అమర్నాథ్ కేజీ మైకప్ పూస్తుందని ఆడవారి వ్యక్తిగత విషయాలను విమర్శించడం అది ఎంత మాత్రం తగదని, మంత్రి అమర్నాథ్ నోరు అదుపులో పెట్టుకొని ఆడవారి పట్ల మంచి సంస్కారంతో నడుచుకోవాలని, లేదంటే ఆడవారి చేతులకు పని చెప్పే దుస్థితికి దిగజారొద్దని మాజీ మంత్రి అమర్నాథ్ ను హెచ్చరిస్తున్నామని ఆమె తెలియజేశారు. కుక్క తోక వంకర అన్నట్టుగా వైసిపి నాయకులు మహిళ పట్ల మర్యాదపూర్వకంగా మసులుకోవాలని, ఇలాంటి దిగుజారుడు విమర్శలను కొనసాగిస్తే మహిళలు మీ వైసీపీ నాయకుల్ని, ఎమ్మెల్యేలను, మాజీ మంత్రులను తరిమికొట్టే పరిస్థితి తథ్యమని ఆమె తెలియజేశారు.

## దళితుల మధ్య చిచ్చు పెడుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ...

కొలిమిగుండ్ల : నంద్యాల పట్టణంలో ఇవాళ నవ్యాంధ్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కొ్రపాటి శరత్ బాబు పర్యటించారు. సూరత్ హోటల్లో నవ్యాంధ్ర మాల మహానాడు సంఘం నాయకులు కార్యకర్తలతో కొ్రపాటి శరత్ బాబు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నంద్యాల జిల్లా నవ్యాంధ్ర మాల మహానాడు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా సంగటి భాస్కరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు కొ్రపాటి శరత్ బాబు మాట్లాడుతూ మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాల మాదిగల మధ్య చిచ్చు పెడుతూ పబ్బం గడుపుకుంటున్నాడని భవిష్యత్తులో వర్గీకరణ అనే అంశమే లేకుండా చేసేందుకు వారు కుట్ర పన్నుతున్నారని ఇప్పటికైనా మాలలు ఐకమత్యంతో ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కొ్రపాటి శరత్ బాబు, నంద్యాల జిల్లా ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడు సంగటి భాస్కరరావు, రాయలసీమ జిల్లాల చైర్మన్ మద్దిలేటి, సంఘం సభ్యులు రమేష్, రామ్మోహన్, ఎస్ విజయ్ కుమార్, గురువయ్య, జె నాసరయ్య ఇంకా తదితర మాల మహానాడు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోశాలలో వృద్ధుడి హత్య

కృష్ణా జిల్లా : కంకిపాడు మండలం గోశాల గ్రామంలో ఒక స్థలం వివాదంలో మామను అల్లుడు హత్య చేసాడు. అల్లుడు మామ ఛాతి పై దాడి చేసాడు. ఘటనలో గోశాల కు చెందిన ఉప్పల సాంబశివరావు(65) ఘటనా స్థలంలోని మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## త్వరలో పోరుమామిళ్ల ఉప మార్కెట్ యార్డ్ పూర్తి

### - బద్వేల్ ఏఎంసి నారిసెట్టి సుప్రజ

పోరుమామిళ్ల వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్, పోరుమామిళ్ల ప్రాంతాల్లో రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించే దిశగా కీలక సమావేశం జరిగింది. బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ, నాగేంద్రలు మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులను కలిసి పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా బద్వేల్ మార్కెట్ యార్డ్‌కు సంబంధించిన సమస్యలు, పోరుమామిళ్లలో రైతు బజార్ ఏర్పాటు, బద్వేల్ రైతు బజార్ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టే అంశాలపై చర్చించారు. అలాగే నిర్మాణంలో ఉన్న పోరుమామిళ్ల ఉపమార్కెట్ యార్డ్‌ను త్వరలోపూర్తి చేసి రైతులకుఅందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా బద్వేల్ మార్కెట్ యార్డ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి ఆదాయ వనరులను పెంచడంతో పాటు రైతులు, వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే అంశాన్ని కూడా ప్రస్తావించారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ఈ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## సాయి కృష్ణ మాయమైన కేసులో సిఐ నాగరాజును పదవి నుంచి తొలగించాలి

మచిలీపట్నం : వి జయవాడకు చెందిన కాపుసేన సభ్యుడు సాయి కృష్ణ తెరమరుగు అవడానికి కారణమైన సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజును సి.ఐ పదవి నుంచి శాశ్వతంగా తొలగించి నాగరాజు కుటుంబానికి 5 కోట్ల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర కాపు సేన లీగల్ చైర్మన్ లంకిశెట్టి బాలాజీ డిమాండ్ చేశారు బుధవారం మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ కాపు కులముకు చెందిన యువకుడు మరణానికి సంబంధించి కాపు ఎమ్మెల్యేలు ఎంపీలు ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని బాలాజీ కోరారు. చట్ట వ్యతిరేకంగా రాష్ట్ర నడిబొడ్డిలో జరిగిన నాగరాజు అదృశ్యం రాష్ట్ర ప్రభుత్వానికి తలంపులు తీసుకొచ్చిందని బాలాజీ అన్నారు. రాష్ట్ర డిజిపి ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిన సీఐ నాగరాజును విఆర్‌ఓ పంపటం సరైన చర్య కాదని బాలాజీ అన్నారు. తక్షణమే నాగరాజుపై హత్య నేరం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని బాలాజీ డిమాండ్ చేశారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు విలేకరులకు చూపించిన ఫోటోలు చూస్తే నాగరాజు మరణం లాక్ అప్ అప్ డెత్ గా కనిపిస్తుందని బాలాజీ అన్నారు. రాష్ట్ర హైకోర్టు సూచన ప్రకారం నాగరాజు నుహై కోర్టు ఎదుట ప్రవేశపెట్టవలసి ఉండగా అందుకు భిన్నంగా కుటుంబ సభ్యులపై ఒత్తిడి తీసుకువచ్చి కేసును ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేయడం సమంజసం కాదని బాలాజీ అన్నారు.

రౌడీషీటర్లను కాల్చివేయమని ఏ చట్టం, ఏ పోలీసు మాన్యువల్ చెప్పలేదని బాలాజీ అన్నారు. రాష్ట్ర నడిబొడ్డులో కొడుకు నాగరాజు కోసం తల్లి ఆర్తనాదాలు రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయ ని బాలాజీ వాపోయారు. పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని బాలాజీ అన్నారు. గత ప్రభుత్వం కొంతమంది పోలీసు అధికారు లు యొక్క చట్ట వ్యతిరేక చర్యల వల్ల పూర్తిగా నష్టపోయిందని బాలాజీ అన్నారు. నాగరాజు ఆచూకీపై రాష్ట్ర హైకోర్టు సిట్టింగ్ జడ్జి ఎంక్వైరీ జరిపించాలని బాలాజీ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కాపులు ని నష్టపరిచే విధంగా చర్యలు జరిగిన అందుకు తగిన పరిహారం చెల్లించవలసి ఉంటుందని బాలాజీ హెచ్చరించారు.

# ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

## పిఆర్సీ అమలులో నిర్లక్ష్యం తగదు - యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ డిమాండ్

బద్వేలు : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని, తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం బద్వేల్ లోని స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదన విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు పూర్తయినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం తగదన్నారు. 12వ పిఆర్సీ గడువు ముగిసి మూడేళ్లు కావస్తున్నదని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే పిఆర్సీని అమలు చేస్తుందని ఆశించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నిరాశే మిగిలిందన్నారు. 12వ పిఆర్సీని అమలు చేయకపోవడం మూలన పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఉద్యోగుల పక్షపాతిగా వ్యవహరిస్తామన్న కూటమి పెద్దలు, రెండేళ్ల పాలనలో కనీసం పిఆర్సీ కమిషన్ ను సైతం నియమించకపోవడం దారుణమన్నారు. తక్షణం పిఆర్సీ కమిషన్ ను ఏర్పాటుచేసి పిఆర్సీ అమలయ్యే వరకు 30% మధ్యంతర భృతిని చెల్లించాలని డిమాండ్ చేశారు. ధరలకు అనుగుణంగా చెల్లించాల్సిన డిఏలు సైతం చెల్లించకుండా నాలుగు డీఏలను పెండింగ్ లో ఉంచడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆర్థిక బకాయిలను కొంతమేరకు చెల్లిస్తున్నప్పటికీ, పూర్తిస్థాయిలో చెల్లింపులు లేవన్నారు. గత పిఆర్సీ బకాయిలతో పాటు, మిగిలిన అన్ని రకాల ఆర్థిక బకాయిలను నిర్ణీత గడువులోగా చెల్లించాలని కోరారు. సరెండర్ లీవ్ బకాయిలు మూడేళ్లుగా చెల్లింపులకు నోచుకోలేదని ఆయన పేర్కొన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు, పాత పెన్షన్ అమలు విధానంపై కనీసం ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పును కారణంగా చూపి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలనడం తగదన్నారు. ఎన్నో ఏళ్ళుగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులను ఇప్పుడు మళ్లీ పరీక్ష రాయాలనటం సరికాదన్నారు. టెట్ సమస్యపై విద్యాశాఖ మంత్రి కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్యాహక్కు చట్టం 23(1) లో సవరణ చేసేందుకు కృషి చేయాలని కోరారు. గత బదిలీలలో బదిలీ పొంది రిలీవ్ కానీ ఉపాధ్యాయులను తక్షణం వారు బదిలీ పొందిన స్థానానికి పంపేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. హై స్కూల్ ప్లస్ లలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, హై స్కూల్ ప్లస్ లను బలోపేతం చేయాలని, కేజీబీవి ఉపాధ్యాయులు, సిబ్బంది ఎదుర్కొంటున్న ఉద్యోగ భద్రత, వేతన స్కేలు తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. కరోనా మహమ్మారిలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలను చేపట్టి వారిపై కారుణ్యత ప్రదర్శించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధి ప్రదర్శించి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరుబాట పట్టక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.సుధాకర్, బద్వేల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.దేవానందం, సి.కంచిరెడ్డి, సహాధ్యక్షుడు వై.రామయ్య, కార్యదర్శి సి.హెచ్.సాగర్, గోపవరం మండల ప్రధాన కార్యదర్శి ఎం.రామచంద్రయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎన్.కొండయ్య తదితరులు పాల్గొన్నారు

# గత పాలకులు 'జల జీవన్' నిధులు నొక్కేస్తే..

## కూటమి ప్రభుత్వంలో పరుగులు పెడుతున్న పనులు: ఎమ్మెల్యే బి.వి. జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య స్వచ్ఛమైన తాగునీరు. ఒకప్పుడు పల్లెల్లో వేసవి వస్తే చాలు బిందెడు నీళ్ల కోసం కిలోమీటర్ల మేర నడవాల్సిన దుస్థితి ఉండేది. ఈ దాహార్తిని శాశ్వతంగా తీర్చాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా 'జల జీవన్ మిషన్' పథకాన్ని తీసుకువచ్చింది. అయితే, గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ ప్రతిష్టాత్మక పథకం పూర్తిగా పడకేసిందని ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర రెడ్డి మండిపడ్డారు. నాటి పాలకులు కేంద్రం ఇచ్చిన నిధులను సైతం సక్రమంగా వాడకుండా పక్కదారి పట్టించారని, కేవలం కాంట్రాక్టర్ల జేబులు నింపుతూ, అవినీతికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. నాటి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నిధులున్నా పనులు ముందుకు సాగక ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని అనుభవించాల్సి వచ్చిందన్నారు. దానికి భిన్నంగా నేడు మన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలో తాగునీటి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ, పైసా వృథా కాకుండా ప్రభుత్వ నిధులను వంద శాతం సద్వినియోగం చేస్తూ నేడు అద్భుతాలు సృష్టిస్తున్నామని కొనియాడారు. ఈ ప్రగతిలో భాగంగానే గాజులదిన్నె ప్రాజెక్టు దగ్గర రూ.19.50 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన తాగునీటి పనులు ప్రస్తుతం అత్యంత వేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. త్వరలోనే 14 గ్రామాలకు తాగునీటి కష్టాలు శాశ్వతంగా తీరబోతున్నాయి. గాజులదిన్నె నుంచి ఎమ్మిగనూరు మండలంలోని రాళ్లదొడ్డి, ఎర్రకోట, కడిమెట్ల గ్రామాలకు నీరు సరఫరా చేసే కార్యక్రమంలో భాగంగా పైప్లైన్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. హెచ్.కైరవాడి, కులుమాల, వేముగోడు, పుట్టపాశం గ్రామాలకు సంబంధించి పైప్లైన్ పనులు ఇప్పటికే విజయవంతంగా పూర్తయ్యాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. మిగిలిన గ్రామాల్లో కూడా త్వరలోనే అన్ని పనులు పూర్తి చేసి, గోనెగండ్ల మరియు ఎమ్మిగనూరు మండలాల పరిధిలోని ఆయా గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని ఎమ్మెల్యే బి.వి. జయనాగేశ్వర రెడ్డి హామీ ఇచ్చారు..

# గులాబీ ఓవర్ కాన్ఫిడెన్సేనా..



హైదరాబాద్ : తెలంగాణలో బీఆర్ఎస్ తన ఓట్ల శాతాన్ని కాపాడుకునే ప్రయత్నం మొదలు పెట్టింది. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతం కంటే పెంచుకునేందుకు అవసరమైన వ్యూహాలను రచిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో పాటు తమకు అనకూల ఓటు పెరుగుతుందని గులాబీ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఎవరు అవునన్నా కాదన్నా బీఆర్ఎస్ తెలంగాణలో క్షేత్రస్థాయిలో బలంగా ఉంది. మరొకవైపు బీజేపీ బలపడుతుంది. బీజేపీ తమ ఓటు బ్యాంకును చీల్చకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే కాంగ్రెస్ పై వ్యతిరేక ఓటును తాము రాబట్టుకునే ప్రయత్నంలో కారు పార్టీ ఉంది. పార్టీ అగ్రనేత కేసీఆర్ సూచనల మేరకు కీలక నేతలు ఇప్పటికే ఆ పనిలో నిమగ్నమయ్యారు. సహజంగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఖచ్చితంగా అంతో ఇంతో వ్యతిరేకత ఉంటుంది. పాజటివిటీ కంటే నెగిటివిటీ ఓటు ఎక్కువగా ఉంటుంది. అందుకు కాంగ్రెస్ కూడా మినహాయింపు కాదు. ఎందుకంటే గతంలో బీఆర్ఎస్ రెండు దఫాల తర్వాత వచ్చిన వ్యతిరేకతతోనే కాంగ్రెస్ మొన్నటి ఎన్నికల్లో విజయం సాధించింది. అయితే ఎప్పుడూ పదేళ్లు ఒకే పార్టీ ఉంటుందని అనుకోవడం కేవలం గణాంకాల కోసమే. ప్రాక్టికల్ గా కుదరదు. మరొకవైపు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కు బీజేపీ నుంచి కూడా ప్రమాదం పొంచి ఉంది. బీజేపీ ఎంత బలపడితే అంత కాంగ్రెస్ కే నష్టమన్న అంచనాలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎటు వెళుతుందన్నది పక్కన పెడితే మూడు పార్టీలు బలంగా ఓట్లు చీల్చుకుంటే అది తమకే లాభమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. తమకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో వస్తున్న మద్దతు అందుకు ఉదాహరణ అని చెబుతున్నారు. ప్రస్తుతానికి కేటీఆర్, హరీశ్ రావులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇటు క్యాడర్ తో పాటు ఓటు బ్యాంకును కూడా రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో తమ పాలనకు, ప్రస్తుత పాలనకు బేరీజు వేసుకుంటే తామే ఎక్కువ ఓట్లు సాధిస్తామని గులాబీ పార్టీ నేతలు అంచనాలు వేసుకుంటున్నారు. గత ఎన్నికల్లోనూ అనేక నియోజకవర్గాల్లో స్వల్ప మెజారిటీతో ఓటమి పాలయిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ ఈసారి ఎన్నికల్లో తమకు అధికారం గ్యారంటీ అన్న ధీమాతో ఉంది. మరి చివరకు ఓటర్లు ఎలా తీర్పు చెబుతారన్నది చూడాల్సి ఉంది.

# సన్మానమా... అవమానమా?

## ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థినులకు తీరని అవమానం

### ఒకే శాలువాతో ఇద్దరికి సన్మానం...వివక్ష ఆరోపణలు

తుగ్గలి: ప్రతిభను ప్రోత్సహించాల్సిన విద్యా సంస్థలోనే ఇద్దరు గిరిజన విద్యార్థినులు అవమానానికి గురైన ఘటన తుగ్గలి మండలంలోని రాతన గిరిజన ఆశ్రమ పాఠశాలలో చోటుచేసుకుంది. పదో తరగతి ఫలితాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థినులను సన్మానించే కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుల వ్యవహారశైలి విమర్శలకు తావిచ్చింది. పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఇద్దరు విద్యార్థినులకు వేర్వేరుగా గౌరవం ఇవ్వాల్సిన చోట ఒకే శాలువాను ఇద్దరిపై ఒకేసారి కప్పి సన్మానించడం చర్చనీయాంశంగా మారింది. అంతటితో ఆగకుండా ఒక విద్యార్థినికి స్వీట్ బాక్స్ అందించగా, మరో విద్యార్థినికి కేవలం శాలువా మాత్రమే ఇవ్వడం పలువురి ఆగ్రహానికి కారణమైంది. ప్రతిభకు గుర్తింపుగా నిర్వహించిన కార్యక్రమంలోనే విద్యార్థినుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం పై తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల మధ్య ఎలాంటి తేడా లేకుండా సమాన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై ఉందని పేర్కొంటున్నారు. ఇద్దరు విద్యార్థినులు సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారే కావడంతో ఈ ఘటనపై వివక్ష కోణంలోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. "విద్యార్థులు సాధించిన విజయాన్ని గౌరవించకుండా ఇలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం?" అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. విద్యా సంస్థలు సమానత్వానికి ప్రతీకలుగా నిలవాల్సిన సమయంలో ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమని సామాజిక సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యవహారంపై గిరిజన సంక్షేమ శాఖ అధికారులు వెంటనే విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. "విద్యార్థుల ప్రతిభను గౌరవించాల్సిన వేదికపై అవమానకర పరిస్థితులు నెలకొనడం అత్యంత విచారకరం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి" అని ప్రజలు కోరుతున్నారు.

# కెనరా బ్యాంకులో మధ్య దళారులను తొలగించాలి

కౌతాళం: కౌతాళం మండల కేంద్రంలో కెనరా బ్యాంకులో రైతుల వ్యవసాయ రుణాలు రెన్యువల్ డబ్బులు చెల్లించడానికి వెళ్ళితే అక్కడ బ్యాంకులో మధ్య దళారులు వాళ్లతో( రైతు తో )కలిసి నీ అప్పు నేను కడతాను అని చెప్పి ,ఆయన అప్పు మధ్య దళారులు కట్టడం వల్ల ,వడ్డీ, మధ్య దళారుల కమిషన్, ఇతర ఖర్చులు అన్నీ కూడా రైతే భరించవలసి ఉంటుంది. కనుక బ్యాంకులో మధ్య దళారులను తొలగించాలని, బ్యాంకులోకి అనుమతించరాదని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే మల్లయ్య మేనేజర్ కు వినతి పత్రాన్ని అందించారు.. మండలంలో ఆరు బ్యాంకులు ఉన్నా ఏ బ్యాంకుల్లో కూడా కెనరా బ్యాంకులో ఉన్నటువంటి మధ్య దళారుల వ్యవస్థ లేదు. రైతులే నేరుగా బ్యాంకుకు పోయి మేనేజర్ తో మాట్లాడి స్తోమత ఉన్నవాళ్లు అసలు ,వడ్డీ కలిపి కడతారు. స్తోమత లేని వాళ్ళు వడ్డీ మాత్రమే కట్టి రెన్యువల్ చేయించుకుంటారు అలాంటి పద్ధతి కెనరా బ్యాంకులో లేదు. ఇక్కడ మధ్య దళారులకు ,బ్యాంకు సిబ్బందికి ,మేనేజర్ లోపాయికారిగా ఒప్పందాలు చేసుకొని లావాదేవీలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. రైతు అప్పు మధ్య దళారులు కడితే సంవత్సరానికి, సంవత్సరానికి అప్పు పెరుగుతుంది తప్ప , రైతుకు అప్పు సమస్య తీరదు అని ఆయన అన్నారు .కనుక ఇప్పటి నుంచైనా బ్యాంకు బ్యాంకు సిబ్బంది, మేనేజర్ మేల్కొని బ్యాంకులో మద్దతు దారుల వ్యవస్థను రద్దు చేయాలని లేకపోతే రైతులను సమీకరించి బ్యాంకు ముందు ఆందోళన కార్యక్రమాలను చేపట్టగలమని హెచ్చరించరు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి బి ఈరన్న ,రైతు సంఘం నాయకులు సత్యప్ప ,ఈరన్న, వెంకటేష్ ,నారాయణ, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## తోతాపురి మామిడి రైతులకు పూర్తి భరోసా

తిరుపతి : జిల్లాలో తోతాపురి మామిడి కొనుగోలు ప్రక్రియలు సజావుగా కొనసాగుతున్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డితో కలిసి రేణిగుంట మండలంలోని వర్ష ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించిన కలెక్టర్, కొనుగోలు ప్రక్రియలు, ధరల అమలు, రైతులకు అందుతున్న సేవలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత ఏడాది అధిక దిగుబడి కారణంగా రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రైతులకు మద్దతు కల్పించిందన్నారు. ఈ ఏడాది మార్కెట్ పరిస్థితులు మెరుగ్గా ఉన్నప్పటికీ, రైతులకు కిలోకు రూ.6 కంటే తక్కువ ధర రాకుండా చూడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఇటీవల తిరుపతి పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా రైతులతో సమావేశమై వారికి భరోసా కల్పించారని, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్నారు. రానున్న 10 నుండి 15 రోజులు తోతాపురి సీజన్‌లో అత్యంత కీలకమైన కాలమని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు పక్వానికి రాని కాయలను కోయకుండా, పూర్తిగా పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే కోసి విక్రయించాలని సూచించారు. పక్వానికి రాని కాయలను విక్రయించడం వల్ల రైతులకే నష్టం కలుగుతుందని వివరించారు. ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద రైతులు, రవాణా వాహనాలు ఇబ్బందులు ఎదుర్కోకుండా టోకెన్ విధానాన్ని అమలు చేయాలని అన్ని యూనిట్లకు ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వర్ష ప్రాసెసింగ్ యూనిట్ ఇప్పటికే కోడూరు ప్రాంత రైతులకు ముందస్తుగా టోకెన్లు జారీ చేయడం వల్ల వాహనాల రద్దీ గణనీయంగా తగ్గిందన్నారు. ప్రస్తుతం యూనిట్‌కు చేరుకునే వాహనాలు గరిష్టంగా 6 నుండి 12 గంటల వ్యవధిలో ఖాళీ అయి తిరిగి వెళ్తున్నాయని, కొనుగోలు ప్రక్రియలు వేగవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. గత 10 రోజుల్లో వర్ష ప్రాసెసింగ్ యూనిట్ ఒక్కటే సుమారు 25 వేల టన్నులకు పైగా తోతాపురి మామిడిని కొనుగోలు చేసిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ఇతర యూనిట్ల కొనుగోళ్లు కలిపి ఇప్పటివరకు సుమారు 80 వేల నుండి 90 వేల టన్నుల వరకు సేకరణ జరిగిందన్నారు. కోడూరు ప్రాంతంతో కలిపి ఈ సీజన్‌లో జిల్లాలో సుమారు 2.50 లక్షల టన్నుల తోతాపురి దిగుబడి నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో ఉత్పత్తి అయ్యే ప్రతి తోతాపురి మామిడి కాయను కొనుగోలు చేసేలా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటున్నాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

## నల్గొండలో ఎన్టీఆర్ విగ్రహం దహనం చేసిన నిందితులు అరెస్ట్

నల్గొండ : నల్గొండలో ఎన్టీఆర్ విగ్రహం దహనం చేసిన కేసులో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి అశోక్ కుమార్ గౌడ్ మరియు మరో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసారు. జూన్ 6వ తేదీన తెల్లవారుజామున నల్గొండలోని ఎన్టీఆర్ విగ్రహంపై గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి పాలకూరి అశోక్ కుమార్ గౌడ్, ఎలుకంటి ప్రణీత్ అనే నిందితులు బెడ్ షీట్లు కప్పి, పెట్రోల్ పోసి దహనం చేసారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులు బలెనో కారులో వచ్చి విగ్రహానికి నిప్పు పెట్టినట్లు గుర్తించి, వారిని అరెస్ట్ చేసి పీడీ యాక్ట్ నమోదు చేసారు.

## తాగునీరు రాలేదని సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం

సిద్దిపేట : తాగు నీరు రావడం లేదని సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను గ్రామస్థులు దహనంచేసారు. సిద్దిపేట జిల్లా ఎల్లారెడ్డి పేట గ్రామంలో తాగునీటి సరఫరా నిలచిపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. తాగునీటి సమస్యను తీర్చాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామ పంచాయతీ ముందు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి, ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు.

## బోయిన్ పల్లిలోని ప్రభుత్వ భూమిని కేటీఆర్ ప్రైవేటు వ్యక్తులకు దారదత్తం చేశారు

సికింద్రాబాద్ : బోయిన్ పల్లిలోని ఎన్ఐఎంహెచ్ ముందు ఉన్న 157/1 ప్రభుత్వ భూమిని 2023 లోనే కేటీఆర్ 50 కోట్ల రూపాయల కమిషన్ తీసుకొని, సిసిఎల్ లో అది ప్రైవేటు వ్యక్తులకు దారదత్తం చేశారని, కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీ గణేష్ మీడియా ముందు ఆరోపించారు. నేడు కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశం బ్రిగేడియర్, బోర్డు సీఈవో అధ్యక్షతన నిర్వహించగా, ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీ గణేష్, నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా మల్లికార్జున్ లు హాజరై పలు బోర్డు తీర్మానాలను ఆమోదించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీ గణేష్ మీడియాతో మాట్లాడుతూ 303 కోట్ల రూపాయలతో కంటోన్మెంట్ అభివృద్దే ధ్యేయంగా పనులను ప్రారంభించాలని బోర్డులో తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. 3వ వార్డు మట్ ఫోర్డ్ లో పేదలు నివసించే గుడిసెలను తొలగించేది లేదని తెలిపారు. భవన మెటీరియల్, చెత్త సేకరణ బండ్లను రోడ్డుపై కాకుండా లోపటికి పెట్టాలని బోర్డు అధికారులు ఆదేశిస్తే, దాన్ని కూడా బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేశారని హెద్దేవా చేశారు. బోయిన్ పల్లిలోని ప్రభుత్వ స్థలంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తనపై అనవసరమైన ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. గతంలో బిఆర్ఎస్ పది సంవత్సరాల అధికారంలో ఉన్నప్పుడు ఇదే ప్రభుత్వ భూమిని కేటీఆర్ ఎందుకు కాపాడలేకపోయారు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కమిషన్ లు తీసుకొని తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తే ప్రజలు మరొకసారి బీఆర్ఎస్ పార్టీ నాయకులకు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ...మడ్ ఫోర్డ్ గుడిసెలు, బోయిన్ పల్లి ప్రభుత్వ స్థలంపై స్పందిస్తూ ప్రభుత్వ భూములను కాపాడుతామని, పేదలు నివసించే గుడిసెలను తొలగించవద్దని, ఇట్టి వివాదంపై డిఫెన్స్ అధికారులకు దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు.

## రైతు బీమా పథకాన్ని ఎగ్గొట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర

హైదరాబాద్ : ప్రభుత్వం బోనస్ ఇస్తామంటున్న 7 రకాల వడ్ల వల్ల రైతులు ఎకరానికి 10 క్వింటాళ్లు నష్టపోతారు. అంటే ఒక్కో రైతుకు రూ. 24 వేల దిగుబడి తగ్గే అవకాశం ఉందని బీఆర్ఎస్ నేత జీవన్ రెడ్డి అన్నారు. అయన మీడియాతో మాట్లాడారు. 33 రకాల వడ్లలో ప్రభుత్వం గుర్తిస్తున్న 7 రకాల వడ్లు ఎకరాకి 20 క్వింటాళ్లు పండితే మిగతా 26 రకాలు మాత్రం ఎకరాకు 30 క్వింటాళ్లు పండుతాయి. ఈ 7 రకాల వడ్లు పండించడం వల్ల రైతులు 10 క్వింటాళ్లు ఎక్కువ నష్టపోతారని అన్నారు. రైతు బీమా పథకాన్ని ఎగ్గొట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుంది. ఈ ప్రభుత్వం ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టకపోవడంతో 7600 మంది చనిపోయిన రైతులకు రైతు బీమా డబ్బులు రాలేదు.

## నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న యువతి ఆత్మహత్య

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న 23 ఏళ్ల యువతి ఆత్మహత్యకు పాల్పడింది. పన్నెండో తరగతిలో పాఠశాల టాపర్‌గా నిలిచిన సదరు విద్యార్థిని, తన నివాసంలోనే ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. "అమ్మా, నాన్నా ఐ లవ్ యూ.. నా మరణానికి ఎవరూ కారణం కాదు" అని హిందీలో రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం, మృతురాలిని కార్గిల్ యుద్ధ వీరుడు రాజేష్ థాపా కుమార్తె రియా కుమారి థాపాగా గుర్తించారు. ఉదయం 11:30 గంటల సమయంలో భోజనానికి పిలిచినా ఆమె గది నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు తలుపులు బద్దలు కొట్టి చూడగా, రియా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. సాధారణంగా ఆమె రాత్రి వేళల్లో పొద్దుపోయే వరకు చదువుకుని, ఉదయం ఆలస్యంగా నిద్రలేచే అలవాటు ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. జూన్ 21న జరగనున్న నీట్ రీ-ఎగ్జామినేషన్ కోసం రియా సిద్ధమవుతున్నట్లు సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అంకిత్ కందారి వెల్లడించారు. మొదటి ప్రయత్నంలో నీట్ అర్హత సాధించలేకపోవడంతో చదువుపై ఏర్పడిన తీవ్ర ఒత్తిడి, నిరాశ కారణంగానే ఆమె ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. పన్నెండో తరగతిలో 97 శాతం మార్కులు సాధించిన రియా, చదువులో ఎంతో ప్రతిభావంతురాలని తెలిసింది. ఈ ఘటనలో ఎలాంటి కుట్ర కోణం లేదని, దీనిని ఆత్మహత్యగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. పోటీ పరీక్షల ఒత్తిడి కారణంగా విద్యార్థులు ఇలా బలవన్మరణాలకు పాల్పడుతున్న ఘటనలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

## పోలవరం ముంపు ప్రాంతాలను ఆదుకుంటాం

హైదరాబాద : తెలంగాణ సరిహద్దు గ్రామాలను భయపెడుతున్న పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ (వెనక్కి తన్నే నీరు) ముంపు సమస్యపై ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ప్రతినిధి బృందం సమర్పించిన వినతిపత్రంపై కేంద్ర ప్రభుత్వ పరిధిలోని 'పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సానుకూలంగా స్పందిస్తూ రాతపూర్వక హామీ ఇచ్చింది. ఈ లేఖకు సంబంధించిన వివరాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఎక్స్ వేదికగా పంచుకున్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం కారణంగా తెలంగాణ పరిధిలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను రెండు విధాలుగా ఆదుకుంటామని అథారిటీ స్పష్టం చేసింది. ఒకటి.. తగిన ఇంజనీరింగ్ పనుల ద్వారా ఆయా గ్రామాలకు ముంపు ముప్పు లేకుండా రక్షించడం. రెండు.. అది సాధ్యం కాకపోతే పునరావాస-పునర్నిర్మాణ చట్టం కింద ఆ భూములను సేకరించి రైతులకు పక్కా నష్టపరిహారం అందించడం. 2025 ఏప్రిల్ 8న జరిగిన అంతర్రాష్ట్ర సమావేశ నిర్ణయాలకు తాము కట్టుబడి ఉన్నామని పీపీఏ తెలిపింది. గోదావరి బేసిన్ పరిధిలోని తెలంగాణ ప్రజల జీవనోపాధిని, గిరిజనుల వ్యవసాయ భూములను కాపాడటానికి శాస్త్రీయ అంచనాలు, సమగ్ర వరద నివారణ చర్యలు తీసుకుంటామని లేఖలో పునరుద్ఘాటించింది. తెలంగాణ ప్రజల ప్రాణాలకు, ప్రయోజనాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని పేర్కొంది. ఈ నేపథ్యంలో... కేంద్ర ప్రభుత్వం ముంపు ఆందోళనలను అధికారికంగా గుర్తించి, రక్షణకు హామీ ఇవ్వడాన్ని తాము స్వాగతిస్తున్నామని హరీశ్ రావు తెలిపారు. అయితే, ఈ హామీలు కేవలం ఆఫీసు ఫైళ్లకే పరిమితం కాకుండా గ్రౌండ్ లెవెల్‌లో సకాలంలో అమలు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సరిహద్దు ప్రజల భద్రత, రైతుల ఉపాధి విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. కేంద్రం, పీపీఏ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు కలిసి సమన్వయంతో వ్యవహరించి, ప్రభావితమయ్యే ప్రతి కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

## పీఓకేలో గో బ్యాక్ పాక్

న్యూఢిల్లీ : పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్.. దీన్ని ఆక్రమించిన పాకిస్తాన్ .. దీన్ని 'అజాద్ కశ్మీర్'గా పిలుస్తారు. అక్టోబర్ 24, 1947లో ఏర్పడింది. గిల్గిట్ బాల్టిస్టాన్, అజాద్ కశ్మీర్ ను పాక్ ఆక్రమించింది. ఇది 77 ఏళ్లుగా పాకిస్తాన్ కాలనీగా ఉంది. పేరుకు స్వతంత్ర ప్రాంతం.. కానీ పాకిస్తాన్ పాలనలోనే మగ్గింది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. వారు భారత్ లో జమ్మూకశ్మీర్ ఎలా మారుతుందో చూస్తున్నారు. 2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370 రద్దు తర్వాత పరిస్థితులు కశ్మీర్ లో పరిస్థితులు మారాయి. ఐఐటీలు, ఐఐఎంలు లాంటి 10 అత్యున్నత సంస్థలు వచ్చాయి. రోడ్లు, మౌళిక వసతులు, బాగా వచ్చాయి. భారత్ ఏమో శత్రుదేశంగా చూస్తే కశ్మీరీలకు భారత్ వల్లే మేలు జరిగింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ మాత్రం అక్కడ నష్టం జరిగిందని ఇతర దేశాల్లో ఉన్న కశ్మీరీలు గ్రహించి ఇప్పుడు పీఓకే లో ఆందోళనలు చేపడుతున్నారు. ఒకనాడు కేవలం ఆర్థిక డిమాండ్ల వరకే ఉన్నాయి. గత 10 రోజుల ఆందోళనలో ఈరోజు రాజకీయ డిమాండ్ గా మారింది. మా కశ్మీర్ లో మీరు ఎవరు అంటూ పాక్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. మీ పాక్ సైన్యం ఇక్కడ ఎందుకు అంటూ నినదిస్తున్నారు. పాక్ ఆర్మీ, పాక్ అధికారులు వెళ్లిపోవాలని నినాదాలు చేస్తున్నాడు. ఆడవారు, వేలాది మంది పబ్లిక్ ర్యాలీలు తీస్తున్నారు. మా దేశం వేరు.. మీది వేరు అంటూ మాట్లాడడం మొదలుపెట్టారు. ఉగ్రవాదానికి ఊతం ఇచ్చి పెంచి పోషించిందే పాక్ ఆక్రమిత కశ్మీర్. కానీ ఇవ్వాల హిందుస్తాన్ తో అయినా కలుస్తాం అని అంటున్నారు.

## హర్మూజ్ జలసంధి తెరుచుకుంది

న్యూఢిల్లీ : మిడిలీస్ట్‌ను కుదిపేసిన ఇరాన్-అమెరికా యుద్ధానికి ముగింపు దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ యుద్ధ విరమణకు సంబంధించిన అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసినట్లు వైట్ హౌస్ ప్రకటించింది. ఈ ఒప్పందంతో ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకోనుంది. అయితే ఒప్పందాన్ని ఇజ్రాయెల్ పూర్తిగా అమలు చేస్తుందా లేదా అన్నదానిపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ఈ ఒప్పందం తర్వాత ఇరాన్ ఒక ప్రకటన చేసింది. శాంతి ఒప్పందంపై చర్చలు పూర్తయ్యాని పేర్కొంది. ఒప్పంద అములుకు ఇది పరీక్ష సమయం అని తెలిపింది. అయితే ఈ రెండు దేశాల మధ్య దాదాపు 14 అంశాలపై రాజీ కుదిరినట్టు తెలుస్తోంది. ఈ 14 అంశాలకు ఏవి అని కూడా తాజాగా అమెరికా ప్రకటించింది. లెబనాన్‌తో పాటు అన్ని వైపులా సైనిక చర్యల నిలిపివేతకు అమెరికా అంగీకరించింది. ఇరాన్-అమెరికా తుది ఒప్పందానికి 60 రోజుల గడువు ఉంటుంది. పరస్పర అంగీకారంతో ఇరు దేశాలు ఈ గడువును పెంచుకోవచ్చు. 30 రోజుల్లో హర్మూజ్ దిగ్బంధనాన్ని పూర్తిగా ఎత్తివేసి, టోల్ లేకుండా ఇరాన్ నౌకలను అనుమతించాలి.. ఇరాన్ పునర్నిర్మాణ కోసం 300 బిలియన్ డాలర్ల నిధి ఏర్పాటు చేస్తారు. అణ్వాయుధాన్ని ఎప్పటికీ తయారు చేయకూడదని ఇరాన్ అంగీకరించింది. అలాగే ఆంక్షలు ఎత్తివేసే వరకు స్వేచ్ఛగా చమురు అమ్ముకునేందుకు అంగీకరించాలని ఇరాన్ కోరింది. అయితే ఈ మొత్తం 14 అంశాల్లో యురేనియం సంబంధించి ఎక్కడా ప్రస్తావన జరగలేనట్టు కనిపిస్తోంది.

### నగునూరు గ్రామంలో ఎరువుల గోదామును పరిశీలించిన అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

కరీంనగర్ : జిల్లాలో ఏయే ఎరువులు ఏ డీలర్లకు పంపిణీ చేశారనే వివరాలను తెలుసుకున్నారు. జిల్లాలోని విత్తన కేంద్రాలు, ఎరువుల విక్రయ కేంద్రాలు మరియు ఇప్పటివరకు జరిగిన అమ్మకాల వివరాలను సమగ్రంగా పరిశీలించారు. అలాగే వరి, మొక్కజొన్న మరియు పత్తి విత్తన నిల్వలను గోదాములలో పరిశీలించారు. అనంతరం నగునూరు గ్రామంలోని అగ్రో రైతు సేవా కేంద్రంలో ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చిన వరి విత్తనాలైన బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-1508 మరియు కేఎన్ఎం-1638 వంటి వంగడాలను పరిశీలించారు. వాటి విత్తన నిల్వ వివరాలను, టీఎస్ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా సరఫరా చేసిన పెసర మరియు ఇతర విత్తనాల వివరాలను, అలాగే జీలుగజనుము విత్తనాల నాణ్యతను కూడా పరిశీలించారు. తదుపరి అక్కడ ఉన్న రైతులకు పాయింట్ ఆఫ్ సేల్ పిఓ ఎస్ యంత్రం ద్వారా జరిగే అమ్మకాల విధానాన్ని వివరించారు. రైతుల ఆధార్ నమోదు చేసి ఈ-పాస్ యంత్రం ద్వారా అవసరమైన కాంప్లెక్స్ ఎరువులను విక్రయించే ప్రక్రియను వారి సమక్షంలో పరిశీలించారు.

# నేతలను మించిపోతున్న అవినీతి అనకొండలు



హైదరాబాద్ : తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ వరుసగా జరుపుతున్న మెగా దాడులు, అందులో దొరుకుతున్న అక్రమ ఆస్తుల వివరాలు చూసి సామాన్య పౌరుల మైండ్ బ్లాంక్ అవుతోంది. ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి నివాసాలపై జరిగిన దాడుల్లో మంచాల కింద లభించిన కోట్లాది రూపాయల నోట్ల కట్టలు, కిలోల కొద్దీ బంగారం, లగ్జరీ ఫ్లాట్ల డాక్యుమెంట్లు ఒక ఎత్తయితే.. అంతకు వారం ముందే రోడ్లు, భవనాల శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ మోహన్ నాయక్ నివాసాల్లో రూ. 200 కోట్ల మార్కెట్ విలువైన అక్రమ ఆస్తులు బయటపడటం మరో ఎత్తు. మే నెలలోనే మెడ్చల్ డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్ ఇళ్లపై జరిగిన దాడుల్లోనూ వంద కోట్ల విలువైన ల్యాండ్ల పత్రాలు దొరికాయి. ఇవన్నీ చూస్తుంటే తెలంగాణలో అవినీతి అనేది ఏదో ఒకరిద్దరు అధికారులకో, ఒక శాఖకో పరిమితం కాలేదని.. వ్యవస్థల్లో ఏ స్థాయిలో వేళ్లునురుకుపోయిందో స్పష్టమవుతోంది. రాష్ట్రంలోని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, టౌన్ ప్లానింగ్, మైనింగ్, ఎక్సైజ్, గృహ నిర్మాణ శాఖల్లో కింది స్థాయి క్లర్క్ నుండి పైస్థాయి డైరెక్టర్ల వరకు ఒక వ్యవస్థీకృత నెట్‌వర్క్ లాగా అవినీతి సాగుతోందని మీడియా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. జీతం కొన్ని వేలలో ఉండే అధికారుల ఇళ్లలో వందల కోట్ల మార్కెట్ విలువైన బినామీ ఆస్తులు, ఓపెన్ ప్లాట్లు, ఫార్మ్‌హౌస్‌లు బయటపడటం దేనికి సంకేతం? ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు హెచ్చరిస్తున్నా క్షేత్రస్థాయిలో లంచాల పర్వం ఆగకపోగా.. అవినీతి తిమింగలాల ఆస్తుల వేగం మాత్రం జెట్ స్పీడ్ తో దూసుకుపోతోంది. ఏసీబీ కేవలం పక్కా సమాచారం ఉన్న కొద్దిమంది పైనే దాడులు చేస్తుంటేనే ఈ స్థాయి సంపద కుప్పలుగా తేలుతోంది. రాష్ట్రంలో ఒకరిద్దరు అధికారులను కాకుండా.. కీలక శాఖల్లో ఉన్న క్లాస్-1, క్లాస్-2 గ్రేడ్ అధికారులందరిపై ఆపరేషన్ క్లీన్-అప్ తరహాలో ఏకకాలంలో రాష్ట్రవ్యాప్త తనిఖీలు నిర్వహిస్తే ఎలా ఉంటుంది? అనుమానితులైన ప్రతి ఉన్నతాధికారి సంపాదనను, వారి బినామీల నెట్‌వర్క్‌ను జల్లెడ పట్టి ఆస్తులన్నీ లెక్కతేల్చి, వాటిని గనుక ప్రభుత్వం జప్తు చేస్తే.. అక్షరాలా తెలంగాణ రాష్ట్ర వార్షిక బడ్జెట్ కు సమానమైన నిధులు ఒకే ఏడాదిలో సమకూరడం ఖాయమని లెక్కలు వేస్తున్నారు. అంతలా ప్రజాధనం అక్రమార్కుల లాకర్లలో మూలుగుతోంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం నిధుల కొరతతో, ప్రాజెక్టుల రుణాల బదిలీల కోసం ఢిల్లీ చుట్టూ తిరుగుతుంటే.. మరోవైపు రాష్ట్రంలోనే కొంతమంది అధికారులు సమాంతర ఆర్థిక వ్యవస్థను నడుపుతున్నారు. ఈ డిజిటల్ యుగంలో బినామీల పేరిట స్థిరాస్తులు కొనడం, హవాలా మార్గాల్లో పెట్టుబడులు పెట్టడం పెరిగిపోయింది. ప్రభుత్వం కేవలం సంప్రదాయ ఏసీబీ దాడులకే పరిమితం కాకుండా.. ఆధునిక టెక్నాలజీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ , ఐటీ శాఖల సమన్వయంతో వ్యవస్థాగత శస్త్రచికిత్స చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ అవినీతి తిమింగలాల గొంతు నొక్కి, అక్రమ ఆస్తులను ప్రజా సంక్షేమానికి మళ్లిస్తేనే.. తెలంగాణ సమాజానికి అసలైన ఆర్థిక స్వాతంత్రం లభిస్తుందని అనుకోవచ్చు.

రెండు సంవత్సరాలు.. 441 కేసులు.. కేవలం రెండు సంవత్సరాలు.. 441 కేసులు.. ఇదేదో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ లో నమోదు చేసిన కేసులు కాదు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై నమోదు చేసిన కేసులు కాదు. తెలంగాణలో ఏసీబీ ఆఫీసర్లు కరప్షన్ కు పాల్పడుతున్న అధికారుల మీద నమోదు చేసిన కేసులు. పైగా వీరిలో చాలామంది లంచం తీసుకుంటూ దొరికిపోయారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు లంచం తీసుకుంటే ట్రాప్ చేస్తున్నారు. అక్రమంగా ఆస్తులను కూడ పెడితే రైడ్ చేస్తున్నారు. 2024 నుంచి ఇప్పటివరకు ఏకంగా 441 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంత స్థాయిలో కేసులు నమోదు చేస్తున్నప్పటికీ అవినీతి అధికారులు తమ ధోరణి మార్చుకోవడం లేదు. ఇటీవల కాలంలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న రాము నాయక్ అనే అధికారిని ప్రభుత్వం డిస్మిస్ చేసింది. అతడు ఏకంగా ప్రభుత్వ భూములను ఇతర వ్యక్తులకు అక్రమంగా పట్టా చేయించాడు. దీనికోసం భారీగా లంచం తీసుకున్నాడు. ఇటీవల మోహన్ నాయక్ అనే అధికారి 100 కోట్లకు పైగా ఆస్తులను కూడబెట్టిన నేపథ్యంలో.. అతని మీద కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అవినీతి అధికారుల మీద ఏసీబీ అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ వారి ప్రవర్తన మారడం లేదు. ఇటీవల కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సింహులపేట మండలంలో ఒక ఎంపీడీవో, ఎంపీవో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పకడ్బందీగా పట్టుకున్నారు. పైగా ఆ మహిళా అధికారి తన కుమారుడిని కూడా వసూళ్లకు ప్రత్యేకంగా నియమించుకోవడం విశేషం. ఏసీబీ అధికారుల తనిఖీలు ఆ ఎంపీడీవో, ఎంపీవో పట్టుబడిన నేపథ్యంలో.. అక్కడి ప్రజలు పటాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. అవినీతి అధికారులు రోజురోజుకు ప్రజల మీద పడి దోచుకుంటున్నారు. ఏదైనా పని ఉందని వెళ్తే.. మొహమాటం లేకుండా ఏమిస్తావని అడుగుతున్నారు. తాజాగా ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఇంట్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. అతడికి ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని అధికారులు గుర్తించారు. పాతబస్తీలోని ఛత్రినాక ప్రాంతంలో అతడి నివాసం.. కార్యాలయం.. బంధువుల గృహాలలో తనిఖీలు చేపట్టారు. నరహరి ఇంట్లో ఏకంగా 1.10 కోట్ల నగదును గుర్తించారు. ఇవే కాక బంగారు ఆభరణాలు.. ఇతర రికార్డులను కూడా స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతాలలో అతడికి ఓపెన్ ప్లాట్లు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ భూమి ఉంది. బహిరంగ మార్కెట్లో వీటి విలువ వందల కోట్లు ఉంటుందని తెలుస్తోంది.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరి సహకారం అవసరం

## రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలి: జిల్లా ఎస్పీ మహేష్ బి గితే

రాజన్న సిరిసిల్ల : ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామంలో "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 11 సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామ ప్రజలతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ప్రజలకు సీసీ కెమెరాల ప్రాముఖ్యత, డ్రగ్స్,గంజాయి వంటి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు,రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..."నేను సైతం" కార్యక్రమంలో భాగంగా ప్రజల సహకారంతో జిల్లాలో కొత్త సీసీ కెమెరాల ఏర్పాటు కొనసాగుతోందని తెలిపారు. ప్రజలు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఆధునిక సాంకేతికతతో నేరాలను అరికట్టి నిందితులపై త్వరితగతిన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ కృషి. జిల్లాలో డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు చేపడుతూ, యువతను మత్తు పదార్థాల దుష్ప్రభావాల నుంచి రక్షించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. డ్రగ్స్ రహిత జిల్లాగా రాజన్న సిరిసిల్లను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ లేదా గంజాయి విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలిప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని ప్రజలకు సూచించారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిచమన్నారు. కోరుట్లపేట గ్రామంలో ఒక రోడ్డు ప్రమాదం జరగకపోవడం కోరుట్లపేట గ్రామ ప్రజల అవగాహనకు నిదర్శనంగా నిలిచిందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని,ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని,పరిమితి కి మించిన వేగంతో వాహనాలు నడపవద్దని ,రాంగ్ రూట్‌లో ప్రయాణించవద్దన్నారు. ఈ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ వెంకటేష్,ఎస్.ఐ రాహుల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ జ్యోతి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రికార్డు స్థాయి వరి దిగుబడి

## తెలంగాణలో సన్న బియ్యానికి రెక్కలు



హైదరాబాద్ : దేశంలోనే అత్యధిక ధాన్యం ఉత్పత్తి సాధించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచినప్పటికీ.. మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు మాత్రం ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు సన్న బియ్యం నిల్వలను అక్రమంగా దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించడమే దీనికి ప్రధాన కారణం. గత 10 రోజుల్లోనే కిలోకు రూ. 5 నుంచి రూ. 7 వరకు ధరలు పెరిగాయి. ముఖ్యంగా డిమాండ్ ఉన్న రెండేళ్ల నాటి పాత బియ్యాన్ని తక్కువ పరిమాణంలో మార్కెట్లోకి వదులుతూ వ్యాపారులు సామాన్య, మధ్యతరగతి వినియోగదారులను నిలువునా దోచుకుంటున్నారు. దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. కానీ ఈ రికార్డు స్థాయి దిగుబడులు స్థానిక వినియోగదారులకు మాత్రం ఎలాంటి ఉపశమనాన్ని ఇవ్వడం లేదు. ఓ పక్క రాష్ట్రంలో పండించిన సన్న వడ్ల నిల్వలు పుష్కలంగా ఉన్నప్పటికీ.. ఓపెన్ మార్కెట్లో మాత్రం సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొంతమంది రైస్ మిల్లర్లు, పెద్ద ఎత్తున వ్యాపారం చేసే హోల్‌సేలర్లు కుమ్మక్కై మార్కెట్లో సన్న బియ్యానికి కృత్రిమ కొరత సృష్టించడమే దీనికి ప్రధాన కారణం. ఈ అక్రమ నిల్వలు, సిండికేట్ దందా కారణంగా సామాన్య, మధ్యతరగతి ప్రజల బడ్జెట్ తలకిందులవుతోంది. ట్రేడర్లు, రిటైల్ వ్యాపారుల చెప్పిన వివరాల ప్రకారం.. గత 10 రోజుల్లోనే వివిధ రకాల సన్న బియ్యం ధరలు కిలోకు రూ. 5 నుంచి రూ. 7 వరకు పెరిగాయి. మధ్యతరగతి ఇళ్లల్లో ఎక్కువగా ఉపయోగించే సాంబ మసూరి రకం ధర నిన్నమొన్నటి వరకు కిలో రూ. 62 ఉండగా.. అది ఇప్పుడు ఏకంగా రూ. 68 కి చేరింది. మార్కెట్లో అత్యధిక డిమాండ్ ఉన్న రెండేళ్ల నాటి పాత బియ్యం నిల్వలను మిల్లర్లు గోడౌన్లలోనే తొక్కిపెట్టారని, వాటిని హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ ఏజెంట్ల ద్వారా అత్యధిక ధరలకు విక్రయిస్తూ భారీగా లాభాలు గడిస్తున్నారని తెలుస్తోంది. డిమాండ్ ఎక్కువగా ఉన్న రకాలను మాత్రమే టార్గెట్ చేసి ఈ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏటా దాదాపు 60 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని ప్రభుత్వం, వివిధ సంస్థలు సేకరిస్తున్నాయి. దీనికి అదనంగా మరో 10 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యమైన సన్న వడ్లను మిల్లర్లు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. మొత్తంగా చూస్తే.. రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 70 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ఉత్పత్తి అవుతోంది. ఇంత భారీ స్థాయిలో ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ మార్కెట్లో కొరత ఏర్పడటం వెనుక పెద్ద స్కామ్ ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పౌరసరఫరాల శాఖ అధికారులు చెప్పిన వివరాల ప్రకారం.. పేద, దిగువ మధ్యతరగతి వర్గాల నుంచి సంపన్నుల వరకు అందరూ రోజువారీ ఆహార అవసరాల కోసం సన్న బియ్యాన్నే ఇష్టపడుతుండటంతో వీటికి డిమాండ్ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా కర్నూలు, నిజామాబాద్, బాపట్ల, కరీంనగర్ జిల్లాల సోనామసూరి రకాలకు మార్కెట్లో విపరీతమైన క్రేజ్ ఉంది. సన్న బియ్యం పోషక విలువలతో కూడిన ముఖ్యమైన ఆహారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం వైట్ రేషన్ కార్డు కలిగిన పేద కుటుంబాలకు రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ ధరలకే సరఫరా చేస్తుంది. దీంతో బహిరంగ మార్కెట్లో సన్న బియ్యానికి డిమాండ్ మరింత పెరిగింది. ఈ మార్కెట్ డిమాండ్‌ను కొందరు మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. నిల్వలను బ్లాక్ చేసి, మార్కెట్లోకి తగినంత స్టాక్ రాకుండా అడ్డుకుంటున్నారు. బియ్యం ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని.. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో రైస్ మిల్లులపై దాడులు నిర్వహించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

# సునీల్‌ను తలంటిన హైకోర్టు

## ఎంపీపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా- మీకు ఉగ్రవాదులకు తేడ ఏంటీ అంటూ ప్రశ్న


విజయవాడ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి తిరుగుబాటు ఎంపీ రఘురామకృష్ణ రాజు అరెస్ట్, ఆపై సీఐడీ కస్టడీలో జరిగిన థర్డ్ డిగ్రీ వేధింపుల కేసు ఇప్పుడు ఐపీఎస్ అధికారుల మెడకు గట్టిగా చుట్టుకుంటోంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి, నాటి సీఐడీ అదనపు డీజీ పీవీ సునీల్ కుమార్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఒక దేశ పార్లమెంట్ సభ్యుడిని కస్టడీలో చిత్రహింసలకు గురిచేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని వ్యాఖ్యానిస్తూ.. అసలు ఎప్పటిలోగా సరెండర్ అవుతారు అని నిందితుడైన ఐపీఎస్ అధికారిని న్యాయస్థానం నిలదీసింది. హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం ఈ కేసు తీవ్రతను వివరిస్తూ సంచలన పోలికను తెరపైకి తెచ్చింది. దేశ అత్యున్నత చట్టసభ అయిన పార్లమెంట్‌పై దాడి చేసిన ఉగ్రవాదులకు.. ఒక పార్లమెంట్ సభ్యుడిని చట్టవిరుద్ధంగా కస్టడీలో పెట్టి శారీరకంగా వేధించిన వారికి మధ్య పెద్ద తేడా లేదుఅని హైకోర్టు అభిప్రాయపడింది. చట్టాన్ని రక్షించాల్సిన ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి ఇలాంటి రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా తనను తాను నియంత్రించుకోవాల్సిన కనీస బాధ్యత లేదా అని ప్రశ్నించింది. ఎంపీ రఘురామకృష్ణ రాజును గుంటూరు సీఐడీ ఆఫీసులో అర్ధరాత్రి వేళ బూటుకాళ్లతో తన్నుతూ, అరికాళ్లపై కొడుతూ అమానుషంగా హింసించబోతున్నారనే విషయం ఫిర్యాదుదారుగా ఉన్న సునీల్ కుమార్ నాయక్‌కు ముందే తెలుసని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఆయన కీలక పాత్ర పోషించినట్లు ప్రాథమికంగా ఆధారాలు కనిపిస్తున్నాయని కోర్టు పేర్కొంది. ఇలాంటి కస్టోడియల్ టార్చర్ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి ముందస్తు బెయిల్ ఒక రక్షణ కవచంగా మారకూడదని బెంచ్ తేల్చిచెప్పింది. న్యాయస్థానం ఘాటు వైఖరిని గమనించిన సునీల్ నాయక్ తరపు న్యాయవాది సైలెంట్ అయ్యారు. దీంతో కోర్టు స్పందిస్తూ.. ఈ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొనసాగిస్తారా, లేక చట్టాన్ని గౌరవించి స్వచ్ఛందంగా పోలీసుల ఎదుట సరెండర్ అయ్యే మార్గాన్ని ఎంచుకుంటారా అనేది తేల్చుకోవాలని స్పష్టమైన ఛాయిస్ ఇచ్చింది. దీనిపై పిటిషనర్‌తో మాట్లాడి కోర్టుకు తమ నిర్ణయాన్ని తెలియజేస్తామని లాయర్ కోరడంతో.. హైకోర్టు ఈ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఎలాంటి తుది ఉత్తర్వులు ఇవ్వకుండా తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. 2021లో అప్పటి ఎంపీ రఘురామకృష్ణ రాజుపై సీఐడీ నాన్-బెయిలబుల్ కేసు పెట్టి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అరెస్ట్ చేసి గుంటూరు తరలించారు. ఆ రోజు కస్టడీలో చిత్రహింసలు పెట్టారని రఘురామ ఆరోపించారు. ఆ విషయం అప్పట్లో వివాదాస్పదమయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, రఘురామకృష్ణ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుంటూరు నగరంలోని నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో నాటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో పాటు ఐపీఎస్ అధికారులు పీవీ సునీల్ కుమార్, సునీల్ నాయక్, పి. సీతారామాంజనేయులు నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ , అప్పటి సీఐడీ అడిషనల్ ఎస్పీ విజయ్ పాల్‌లపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే విజయ్ పాల్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా, అరెస్ట్ భయంతో సునీల్ నాయక్ హైకోర్టును ఆశ్రయించారు.

# జెన్ జీ పెళ్లి గురించి ఏం ఆలోచిస్తోంది.. రష్మిక ఏమన్నారంటే?



ప్రస్తుత జనరేషన్ (జెన్–జీ) లైఫ్ స్టైల్, ఆలోచనలు పాత తరంతో పోలిస్తే చాలా డిఫరెంట్‌గా ఉంటున్నాయి. ముఖ్యంగా 'పెళ్లి' అనే కాన్సెప్ట్‌ను ఈ తరం యూత్ చూసే విధానం పూర్తిగా మారిపోయింది. తాజాగా నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఒక ఇంటర్వ్యూలో పెళ్లి గురించి, అలాగే నేటి యువత ఆలోచనా తీరు గురించి కొన్ని చాలా ఇంట్రెస్టింగ్ అండ్ బోల్డ్ కామెంట్స్ చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో రష్మిక చేసిన ఈ వ్యాఖ్యలు తెగ వైరల్ అవుతున్నాయి. ఆ వివరాలు చూద్దాం.. ఇటీవల జరిగిన ఒక ఇంటర్వ్యూలో రష్మికకు నేటి తరం జెన్–జీ పెళ్లిని ఒక 'అవుట్ డేటెడ్' కాన్సెప్ట్‌గా భావిస్తోందనే ప్రశ్న ఎదురైంది. దీనికి ఆమె చాలా ప్రాక్టికల్‌గా స్పందించారు. సమాజం పెళ్లి విషయంలో కొన్ని కఠినమైన రూల్స్ పెట్టిందని, ముఖ్యంగా అమ్మాయిలకు ఒక నిర్దిష్ట వయసు రాగానే కచ్చితంగా పెళ్లి చేసేయాలనే ఒత్తిడి తెస్తుందని రష్మిక అన్నారు. ఇక సొసైటీ పెట్టిన ఇలాంటి రూల్స్ నచ్చకే నేటి యూత్ పెళ్లికి దూరంగా ఉండాలని ఆలోచిస్తోందని ఆమె చెప్పుకొచ్చారు. పెళ్లి అనేది కేవలం సమాజం పెట్టిన రూల్స్ కోసమో, ఎవరో ఏదో అనుకుంటారనో చేసుకోవాల్సిన అవసరం లేదని రష్మిక తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. పెళ్లి బంధంలోకి అడుగుపెట్టే ఇద్దరు భాగస్వాములు ఒకరినొకరు ఎలా అర్థం చేసుకుంటున్నారు, వారు కలిసి ఎలా ఉండాలనుకుంటున్నారు అనేదే అన్నింటికంటే ముఖ్యమని స్పష్టం చేశారు. ఇక సమాజం కండిషన్ల కంటే పార్ట్‌నర్స్ ఇష్టానికే ఎక్కువ ప్రయారిటీ ఇవ్వాలని రష్మిక అన్నారు. ఒకవైపు ఇలాంటి బోల్డ్ స్టేట్‌మెంట్లతో వార్తల్లో నిలుస్తున్న రష్మిక.. సినిమాల పరంగానూ ఈ ఏడాది ఫుల్ జోరు చూపిస్తోంది. ఆమె నటించిన 'కాక్‌టైల్ 2' ఈరోజే విడుదలై మంచి టాక్ తెచ్చుకుంటోంది. దీనితో పాటు ఈ ఏడాది మరో రెండు భారీ సినిమాలు ప్రేక్షకులను అలరించడానికి రెడీ అవుతున్నాయి. విజయ్ దేవరకొండ సరసన ఆమె నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'రణబాలి' సెప్టెంబర్‌లో విడుదల కానుంది. అలాగే ఆమె లేడీ ఓరియెంటెడ్ ప్యాన్–ఇండియా యాక్షన్ చిత్రం 'మైసా' డిసెంబర్ కానుకగా థియేటర్లలోకి రాబోతోంది. ఇక పెళ్లి అనేది ఇద్దరు వ్యక్తుల వ్యక్తిగత విషయమని, దానికి సమాజం గీసిన గీతలే ప్రామాణికం కాదంటూ రష్మిక చేసిన కామెంట్స్ నూటికి నూరు పాళ్ళు నిజమని నేటి యూత్ సపోర్ట్ చేస్తున్నారు. ఇక ఏది ఏమైనా పెళ్లి విషయంలో సొసైటీ ప్రెజర్‌ను పక్కన పెట్టాలనే రష్మిక మాటలకు కొందరు సపోర్ట్ చేస్తున్నారు. ఇక ఈరోజే విడుదలైన కాక్‌టైల్ 2 మరియు రాబోయే రణబాలి, మైసా చిత్రాలతో ఈ ఏడాది బాక్సాఫీస్ వద్ద రష్మిక ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

# ప్రియదర్శి మరో డిఫరెంట్ కాన్సెప్ట్.. హీరోయిన్ ఎవరంటే..



టాలీవుడ్ లో ప్రస్తుతం కమర్షియల్ హంగుల కంటే కూడా మట్టి వాసన ఉన్న కథలకే ఆడియన్స్ ఎక్కువగా ఎట్రాక్ట్ అవుతున్నారు. ఈ సరికొత్త ట్రెండ్ ను సరిగ్గా క్యాచ్ చేసిన స్టార్ డైరెక్టర్ సుకుమార్ తన సొంత బ్యానర్ సుకుమార్ రైటింగ్స్, సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్ వర్క్స్ తో కలిసి ఒక వైవిధ్యమైన ప్రాజెక్ట్ ను అనౌన్స్ చేశారు. కొత్త దర్శకుడు వంశీ రెడ్డి ఈ సినిమాతో మెగాఫోన్ పడుతున్నాడు. ఇదొక స్వచ్ఛమైన కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా అని అనౌన్స్మెంట్ తోనే అందరికీ ఒక క్లారిటీ వచ్చేసింది. ఈ ప్రాజెక్ట్ కు సంబంధించిన లేటెస్ట్ వివరాల్లోకి వెళితే.. మేకర్స్ తీసుకున్న ఒకే ఒక్క నిర్ణయం ఇండస్ట్రీలో ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. తెలంగాణకు చెందిన పాపులర్ ఫోక్ సింగర్, డాన్సర్ నాగదుర్గను ఈ సినిమాలో హీరోయిన్ గా ఎంపిక చేశారట. నల్గొండ ప్రాంతానికి చెందిన ఆమెకు జానపద కళల్లో ఎంతో మంచి పట్టుంది. కేవలం గ్లామరస్ హీరోయిన్స్ ని కాకుండా ఇలాంటి నేచురల్ టాలెంట్ ను వెండితెరకు పరిచయం చేయడం వెనుక దర్శకుడి పక్కా ప్లాన్ కనిపిస్తోంది. ఇక దర్శకుడు సుకుమార్ సినిమాల్లో క్యారెక్టర్లు చాలా రూటెడ్ గా, రియలిస్టిక్ గా ఉంటాయి. ఇక ఈ సినిమాలో కూడా కథలోని నేటివిటీని పర్ఫెక్ట్ గా మ్యాచ్ చేయడం కోసమే నాగదుర్గను ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇదొక ఎమోషనల్ గా సాగే రూరల్ డ్రామా కావడంతో ఆ వాతావరణానికి, ఆ యాసకు పక్కాగా సరిపోయే అమ్మాయి కావాలనే ఈ సర్ ప్రైజ్ ఛాయిస్ తీసుకున్నారని ఇండస్ట్రీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తున్న మాట. ఇక ఈ ప్రాజెక్ట్ లో మరో అతిపెద్ద ప్లస్ పాయింట్ యంగ్ హీరో ప్రియదర్శి. బలగం లాంటి రూటెడ్ విలేజ్ డ్రామాతో బాక్సాఫీస్ దగ్గర మ్యాజిక్ క్రియేట్ చేసి తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపుని అందుకున్నాడు. కామెడీ పాత్రలకే పరిమితం కాకుండా కంటెంట్ ఉన్న సబ్జెక్ట్స్ ను ఎంచుకుంటూ తనేంటో ప్రూవ్ చేసుకుంటున్నాడు. ఇప్పుడు మరోసారి ఒక పల్లెటూరి నేపథ్యంలో సాగే ఇంటెన్స్ ఎమోషనల్ కథతో రాబోతుండటంతో ఈ సినిమాపై ముందు నుంచే అంచనాలు పెరిగిపోతున్నాయి.



# ప్రభాస్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ సవాల్

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, వైవిధ్యభరితమైన చిత్రాల దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ఫౌజి. ఈ సినిమా షూటింగ్ ఏళ్ల తరబడి సాగుతుండటం, విడుదల తేదీ విషయంలో ఇప్పటివరకు సరైన స్పష్టత లేకపోవడంతో ప్రభాస్ అభిమానులు మేకర్స్‌పై చాలా సీరియస్‌గా ఉన్నారు. అయినా ఇంకా రిలీజ్ తేదీపై ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ఇంతలోనే డార్లింగ్ తన కాల్షీట్లను పూర్తిగా సందీప్ వంగా స్పిరిట్ కోసం కేటాయించారని ప్రచారమైంది. ఈ సినిమా కొత్త షెడ్యూల్ షూటింగ్ కోసం వంగా తన ఏర్పాట్లలో తాను ఉన్నాడు. అయితే ఇంతలోనే ప్రభాస్ ఒక కొత్త నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. అతడు కొన్ని నెలల పాటు తన ప్రాజెక్ట్‌ల ప్రాధాన్యతలను మార్చుకున్నట్లు తెలుస్తోంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ని స్పిరిట్ కొత్త షెడ్యూల్ ను ప్రారంభించడానికి ముందే ఫౌజి చిత్రాన్ని పూర్తిగా పూర్తి చేయాలని నిర్ణయించుకున్నాడట. అందుకోసం దాదాపు మూడు నెలల సమయాన్ని పూర్తిగా ఫౌజి షూటింగ్‌కే కేటాయించనున్నారు. ఇప్పటికే ఈ ఏడాది జనవరి నుండి మార్చి మధ్య జరిగిన షెడ్యూల్స్‌లోనే ప్రభాస్ దాదాపు 50 శాతం షూటింగ్‌ను పూర్తి చేసేశారు. మిగిలిన భాగాన్ని కూడా ఒకే పట్టున పూర్తి చేసి... అనుకున్నట్లుగా డిసెంబర్ విడుదలకు సినిమాను సిద్ధం చేయాలనేది ప్రభాస్ ప్లాన్. 1945 కాలం నాటి బ్రిటీష్ ఇండియన్ ఆర్మీ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ డ్రామాలో ప్రభాస్ ఒక సైనికుడి పాత్రలో కనిపించనున్నారు. కేవలం లార్జర్ దేన్ లైఫ్ మాస్ యాక్షన్ ఎలిమెంట్స్‌కే పరిమితం కాకుండా... ప్రభాస్ కెరీర్‌లోనే అత్యంత సంక్లిష్టమైన.. విభిన్నమైన షేడ్స్ ఉన్న పాత్రగా దీనిని హను రాఘవపూడి డిజైన్ చేశారు. స్వాతంత్ర్యానికి పూర్వం ఒక సైనికుడి జీవితంలో ఎదురైన వివిధ దశలు, ఎమోషనల్ గ్లిచెస్, వ్యక్తిగా అంతర్గత పరిణామ క్రమాన్ని ఈ కథలో చూపించబోతున్నారు. శారీరక శ్రమతో పాటు ఎంతో మానసిక పరిపక్వతతో కూడిన నటనను ఈ పాత్రలో ప్రదర్శించాల్సి ఉంటుంది. ప్రభాస్ కెరీర్‌లోనే అత్యంత సవాలుతో కూడుకున్న పాత్ర ఇదని చెబుతున్నారు. ఇటీవల వచ్చిన దేవర, పెద్ది వంటి భారీ చిత్రాలలో లవ్ ట్రాక్స్ కథకు సంబంధం లేకుండా బలవంతంగా ఇరికించినట్లు ఉన్నాయనే విమర్శలు వచ్చాయి. అయితే హను రాఘవపూడి సీతా రామం తరహాలోనే ఫౌజిలో కూడా కథలో లీనమైపోయే ఒక అద్భుతమైన, మనసుకు హత్తుకునే ప్రేమకథను చూపించబోతున్నారట. ఈ సినిమాలో ప్రేమ అనేది కేవలం కమర్షియల్ ఎలిమెంట్ లాగా కాకుండా కథలో అంతర్భాగంగా సాగుతుంది. ఈ చిత్రం ద్వారా ప్రముఖ డ్యాన్సర్, సోషల్ మీడియా స్టార్ ఇమాన్వి కథానాయికగా వెండితెరకు పరిచయమవుతుండగా... ప్రభాస్–ఇమాన్విల స్క్రీన్ కెమిస్ట్రీ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని ఇండస్ట్రీ వర్గాలు నమ్ముతున్నాయి. షెడ్యూల్స్ మధ్య గ్యాప్ రావడంతో పాత్రలోని మూడ్ దెబ్బతినకుండా ఉండేందుకే ప్రభాస్ మరే ఇతర ప్రాజెక్ట్ వైపు చూడకుండా ఫౌజిని సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఈ భారీ చిత్రంలో సీనియర్ నటులు మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రలు పోషిస్తుండటం సినిమాకు మరింత అదనపు బలం. యాక్షన్, ఎమోషన్, రోమాన్స్ సమపాళ్లలో కుదిరిన ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని డిసెంబర్ చివరి వారంలో విడుదల చేసి, బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించాలనేది ప్లాన్. తాజా గుసగుసల ప్రకారం.. రిలీజ్ తేదీని త్వరలోనే రివీల్ చేస్తారు. అయితే సినిమా నాణ్యత ఏమాత్రం చెడకుండా పకడ్బంధీగా ప్రతిదీ ప్లాన్ చేస్తున్నారని సమాచారం.




PUBLISHED, OWNED, EDITED BY SREERAMOJU BALANARASIMHA CHARY(PRGI : TGTEL/26/A0688), 4-12-798, DWARAKA MAI NAGAR, VANASTHALIPURAM, RANGA REDDY DIST, HYDERABAD - TELANGANA STATE -500070. 9440189819.
PRINTED AT SMILYS ONLINE #6-7-48, VANASTHALIPURAM SHOPPING COMPLEX, HYDERABAD, RANGAREDDY-TELANGANA-500070, PH:- 9440189819, specialeditiondaily@gmail.com